


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 30 పేజీలు: 10+4 వెల: 6.50




**సూపర్-8లో విండీస్‌పై భారత్ గెలుపు**

ఆటలో

సెమీస్‌లోకి అడుగిడిన టీమిండియా

5న వాంఖడేలో ఇంగ్లండ్‌తో తలపడనున్న భారత్



ఆదివారం అమెరికా, ఇజ్రాయెల్ దళాల క్షిపణిదాడులకు భస్మీపటమవుతున్న ఇరాన్‌లోని పలుప్రాంతాలు



# ఖమేనీ ఖతం

**ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలీ రెజా అరాఫీ** 2లో

**ఇరాన్ రక్షణమంత్రి, మరో ఐదుగురు కమాండర్లనూ హతమార్చిన అమెరికా, ఇజ్రాయెల్ దళాలు**



ఖమేనీ నివాసం పూర్తిగా నేలమట్టం

ఇరాన్ ప్రజలకు మహోపకారం చేశామన్న ట్రంప్

తాజా పరిణామాలతో పశ్చిమాసియా అల్లకల్లోలం

ఎటు చూసినా డ్రోన్‌లు, మిసైళ్లు, బాంబు పేలుళ్లతో జనం హాహాకారాలు

ప్రతీకారం తీర్చుకొంటామన్న ఇరాన్

అంతు చూస్తామని ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**టెహ్రాన్, మార్చి 1:** ఇరాన్ సుప్రీం లీడర్ అయొతొల్లా అలిఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ సేనలు అంతం చేసాయి. ఈ రెండుదేశాలు జరిపిన సంయుక్త దాడులతో ఖమైనీ చనిపోయారని ముందుగానే ప్రకటించినా ఇరాన్ మాత్రం ధృవీకరించలేదు. చివరకు ఖమైనీ ఆశ్రయం పొందుతున్న నివాసంపూర్తిగా నేలమట్టం కావడంతో సుప్రీం లీడర్ ఇక లేనట్లుగానే నిర్ధారించిన టెహ్రాన్ ఖమైనీ మృతిచెందారని ప్రకటించింది. ఇరాన్ మతపెద్ద అమరుడయ్యారని ప్రభుత్వ ప్రసార సంస్థ ఇరిబ్ ఆదివారం ఉదయం ప్రకటించింది. 86 యేళ్ల ఖమైనీ ఆయన ఆఫీసులోనే శనివారం ఉదయంవేళల్లో చనిపోయారని ఇరాన్ ధృవీకరించింది. ఇజ్రాయెల్ ముందు రోజే ఇరాన్ అగ్రనేతను అంతంచేసామని, ఆయన కాంపౌండ్‌లోనే చంపివేసినట్లు ప్రకటించింది. సీనియర్ ఇజ్రాయెలీ అధికారి ఆయన మృతదేహాన్ని గుర్తించామని కూడా ప్రకటించారు. ఇజ్రాయెల్ ఛానెళ్ల ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఖమేనీ మృతదేహం చూపిస్తున్న ఫోటోలను ప్రసారం చేసాయి. ఆయన మృతదేహాన్ని టెహ్రాన్ కాంపౌండ్‌లోనే స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఇక ఇరాన్ అగ్రనేతను అంతంచేయడంతో ఇపుడు ఇరాన్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఇస్లామిక్ రిపబ్లిక్ రెండో అగ్రనేత కూడా హత్యకు గురికావడంతో టెహ్రాన్ భవిష్యత్తు సందేహాస్పదంగా మారింది. ముందురోజే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో >>2



## నేడు రాహుల్ గాంధీ తెలంగాణకు రాక

**వికారాబాద్‌లో డిసిసి శిక్షణ తరగతులకు హాజరు**

**రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై దిశానిర్దేశం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి1:** తెలంగాణ కాంగ్రెస్‌లో నూతనోత్సహం నింపేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నారు. ఉదయం 9.20 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10.20 గంటలకు శంషాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు బయలుదేరుతారు. ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ చేరుకుని, అక్కడి హరిత రిసార్ట్స్‌లో జరిగే శిక్షణ తరగతులకు హాజరవుతారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రోజంతా డిసిసి అధ్యక్షులు, పార్టీ కీలక నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారు. తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలు సహా రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల వనం వీడి జనంలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రాహల్ గాంధీ సమావేశం అయ్యే అవకాశం ఉంది. ప్రజా సమస్యలు, క్షేత్ర స్థాయి పరిస్థితులపై వారితో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. సాయంత్రం 5 గంటలకు తిరిగి ఢిల్లీ బయలుదేరనున్నారు. మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే పీఏసీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరవ్వనున్నట్లుగా తెలుస్తోంది. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం కానుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క పాల్గొననున్న ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చిస్తారు. రాజ్యసభ సీట్ల కోసం పోటీ పడుతున్న నాయకుల గురించి చర్చించే క్రమంలోనే సామాజిక సమీకరణాలు, విధేయత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటివరకు ఏయే సామాజిక వర్గాలకు ఏయే పదవులు పొందారనే అంశంతో పాటు పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పని చేస్తూ ఎలాంటి పదవులు పొందని నాయకులు ఎవరెవరు ఉన్నారనే విషయాలను పరిశీలించి ఏ సామాజిక వర్గాలు పదవులకు >>2



# అనుక్షణం అప్రమత్తం

**ఇరాన్‌లో మరో రెండువేల మంది తెలంగాణ పౌరులు**

**టెన్షన్‌లో విద్యార్థులు, పేరెంట్స్‌లో భయాందోళనలు**

**గల్ఫ్‌లో చిక్కుకొన్న తెలుగువారిని సురక్షితంగా తీసుకొస్తాం**

**ఎంబసీలతో సంప్రదింపులు: సిఎం రేవంత్ రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి1:** పశ్చిమ ఆసియాలో రేగుతున్న యుద్ధ జ్వాలలు హైదరాబాద్‌లోని వందలాది కుటుంబాల్లో భయాందోళనలు రేకెత్తించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన సుమారు 900 మంది విద్యార్థులు ఇప్పుడు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ప్రధానంగా టెహ్రాన్, కుమ్ వంటి నగరాల్లో ఎంబీబీఎస్, ఇతర ఉన్నత చదువుల కోసం వెళ్ళిన విద్యార్థులు యుద్ధం మధ్యలో చిక్కుకుపోయారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ, టోలీచౌకి, నాంపల్లి వంటి ప్రాంతాల నుంచి వెళ్ళిన విద్యార్థుల ఆచూకీ తెలియక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు మొబైల్ నెట్‌వర్క్‌పై కూడా ఆంక్షలు విధించింది. దీంతో గత 24 గంటలుగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అందుబాటులోకి రాలేకపోతున్నారు. మా పిల్లల ఫోన్లు కలవడం లేదు.. వాళ్ళు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెలియక ఆందోళన చెందుతున్నాం అంటూ పలువురు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. విద్యార్థులే కాకుండా, ఇంజనీర్లు, వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం వెళ్ళిన వారు కలిపి మొత్తం తెలంగాణ నుంచి సుమారు 2 వేల మంది ఇరాన్‌లో ఉన్నట్లు సమాచారం. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారే. సాధారణంగా హైదరాబాద్ నుంచి ఇరాన్ దేశానికి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి, కానీ ప్రస్తుత యుద్ధ వాతావరణం ఈ సంబంధాలను అతలాకుతలం చేసింది. భారత రాయబార కార్యాలయం ఇప్పటికే ఒక అడ్వైజరీ జారీ చేస్తూ.. భారతీయులందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసరంగా బయటకు రావద్దని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుంటూ, చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం >>2



ఆదివారం మదురైలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపిన ప్రధాని మోదీ

# తమిళనాట డబులింజన్ ఖాయం

## డిఎంకెవన్నీ పీడకలలే: మదురై ర్యాలీలో ప్రధాని మోడీ

**మదురై, మార్చి 1:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో ప్రధాని మోడీ విరుచుకుపడ్డారు. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందన్నారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు. కానీ ఎన్‌డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు టర్నింగ్ పాయింట్. డీఎంకేను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని మోడీ అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమేనని 25ఏళ్ల తర్వాత 2021లో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ >>2

# ఇక 30 రోజులే..



ముప్పిడి సాంబయ్య

**ముంచుకొస్తున్న గడువు..**

**మరో మావోయిస్టు అగ్రనేత ముప్పిడి సాంబయ్య, 15మంది సరెండర్**

**ఇబ్బడి ముబ్బడిగా లొంగుబాట్లు**

**జమ్మికుంట/హుజురాబాద్, మార్చి1 ప్రభాతవార్త:** దేశ అంతర్గత భద్రతకు విప్లవపార్టీలతో ముప్పు పొంచి ఉందన్న ఇంటలిజెన్స్ వర్గాల బలమైన సమాచారంతో భారత ప్రభుత్వం 16రాష్ట్ర ప్రభుత్వాలను ఒక్కసారిగా మేల్కొలిపి మావోయిస్టు పార్టీ దాని అనుబంధ సంస్థలను కూకటివేళ్లతో పీకిపాడేస్తామంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఏ ముహూర్తంలో నిర్ణయం తీసుకున్నాడో 2024 జనవరి 1నుండి ఆపరేషన్ కగార్ ప్రారంభించడంతో కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా బల >>2

## నాగ్‌పూర్‌లో భారీ పేలుళ్లు

**ఎస్బీఎల్ పరిశ్రమ ధ్వంసం**

**17 మంది మృతి**



**ముంబై, మార్చి 1:**మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. నాగ్‌పూర్‌లోని కటోల్ ప్రాంతంలో పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్బీఎల్ ఎనర్జి లిమిటెడ్‌లో ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంపపేలుడు పదార్థాలు తయారు చేస్తారని తెలుస్తోంది. ఎస్బీఎల్‌లోని ఓయూనిట్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ సమయంలో >>2

# మీ కన్నీరు తుడుస్తా..

**దళారుల దగాపై ఉక్కుపాదం**

**వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి అభయం**


**15లోగా ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు: మంత్రి**





**ప్రభాతవార్త ప్రతినిధి,ఖమ్మం:** అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతి పేదవాడికి ఈ నెల 15వ తేదీలోపు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐడిఒసి వేదికగా జరిగిన బాధితుల ముఖాముఖిలో మంత్రి వారి కష్టాలను స్వయంగా విని చలించిపోయారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని తాము రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన ఆ దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు. గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతున్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి కేవలం ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు అంగన్వాడీ, పాఠశాల లను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని వివరిం చారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

**అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.** బాధితుల సానుభూతి కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నేతలపెమంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పది సంవత్స >>2



ఆదివారం తిరుమల సందర్శించిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారులు

# బాబ్లీ నుండి తెలంగాణకు గోదావరి జలాలు

**0.60 టీఎంసీలు విడుదల**

**ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టుకు తరలిస్తున్న తెలంగాణ అధికారులు**

**ఎల్లంపల్లి బరాజ్ వద్ద గోదావరి జలాల ఎత్తిపోతలు షురూ**

హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త: గోదావరి నదిపై మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు నుంచి తెలంగాణకు గోదావరి జలాలు విడుదలయ్యాయి. మహారాష్ట్ర - తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారుల సంయుక్త పర్యవేక్షణలో ప్రాజెక్టు నుండి తెలంగాణకు 0.60 టీఎంసీల నీటిని వదిలారు. ఏటా వేసవికాలంలో తాగు నీటి ఎద్దడిని నివారించేందుకు బాబ్లీ గేట్లను ఎత్తి దిగువకు నీళ్లు పంపినీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం బాబ్లీ ప్రాజెక్టు దిగువ గోదావరి నదిలోకి నీళ్లను వదిలారు. ఈ జలాలు ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టుకు చేరుకొనున్నాయి. ఎస్ఆర్ఎస్పీ, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, కేంద్రజల వనరుల సంఘం అధికారుల సమక్షంలో గేట్లను ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. కాగా... కాళేశ్వరం లింక్-2లో పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి బరాజ్ నుంచి నంది పంప్‌హౌస్ మీదుగా ఎగువకు గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ధర్మారం మండలం నందిమేడారం నంది పంప్‌హౌస్‌లో ఫిబ్రవరి 27న 4, 5 మోటర్లను ఆన్ చేసి జలాలను తరలించిన అధికారులు, విడతల వారీగా మోటర్లను ప్రారంభిస్తూ నీటిని ఎత్తిపోస్తున్నారు. శనివారం 2,5 నంబరు మోటర్లను ఆన్ చేయగా 6,300 క్యూసెక్కులు డెలివరీ సిస్టర్న్ల ద్వారా నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అండర్ టన్నెల్ ద్వారా అదే పరిమాణంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్‌కు తరలిపోతున్నాయి. 1, 7వ నంబర్ మోటర్లను ప్రారంభించి ఎత్తిపోతలు కొనసాగించారు. డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న జలాలు గ్రావిటీ కెనాల్ ద్వారా ప్రవహించి ఎస్సారెస్పీ వరదకాలువ 102 కిలో మీటర్ పాయింట్ వద్ద కలుస్తున్నాయి. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా ఇక్కడి గేట్లను మూసి నీటిని ఎగువకు తరలిస్తున్నారు. శుక్రవారం 0.15 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని, శనివారం 0.30 టీఎంసీల జలాలను తరలించామని వెల్లడించారు. గాయత్రి పంప్‌హౌస్ నుంచి తరలివచ్చిన 6,300 క్యూసెక్కుల జలాలు వరద కాలువలో ఎదురెక్కుతూ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మించిన రాంపూర్ పంప్‌హౌస్‌కు చేరాయి. ఇక్కడ 3 మోటర్లను ఆన్ చేసి ఒక్కో మోటర్ ద్వారా 1,450 క్యూసెక్కుల చొప్పున 4,350 క్యూసెక్కులు వరదకాలువలో ఎగువకు పంపింగ్ చేశారు. వరద కాలువపై ఆధారపడ సాగైన పంటలకు నీరందించేందుకే ఎత్తి పోతలు కొనసాగించినట్లు అధికారులు చెబుతున్నారు.

# ఖమైనీ హత్యకు పాక్‌లో వెల్లువెత్తిన నిరసనలు

ఇస్లామాబాద్, మార్చి 1: అమెరికా సహకారంతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో ప్రపంచ దేశాల్లో కూడా భారీ ఎత్తున నిరసనలు, ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఇవి పాకిస్తాన్‌లో మరింత ఎక్కువగానే ఉన్నాయి. పాక్‌లో నిరసన చేస్తున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేసిన పనికి 10 మంది ప్రాణాలు తీసింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను వ్యతిరేకిస్తూ పాకిస్తాన్‌లోని కరాచీలో ఆందోళనలు చెలరేగాయి. పలువురు ఆందోళనకారులు అక్కడి యూఎస్ కాన్సులేట్‌పై దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో విరుచుకుపడటంతో పరిస్థితి తీవ్రతరం అయింది. ఆ తర్వాత అమెరికా కాన్సులేట్‌కు నిప్పు అంటించేందుకు ఆందోళనకారులు ప్రయత్నాలు చేయగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో లాఠీఛార్జ్ చేశారు. అయినప్పటికీ ఆందోళనలు ఆగకపోవడంతో కాల్పులకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణలు తీవ్రంగా మారాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా మెరైన్ సెక్యూరిటీ సిబ్బంది జరిపిన కాల్పుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోవడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. మరో 30 మందికి పైగా గాయాల పాలయ్యారు. ఖమేనీ మృతికి పాకిస్తాన్‌లో ఉన్న ఇరాన్ రాయబార కార్యాలయం సంతాపం తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ ఖమేనీని లక్ష్యంగా చేసుకుని దాడి చేసి చంపేయడాన్ని వారి పిరికిపంద చర్యగా అభివర్ణించింది. ఖమేనీ మరణానికి నిరసనగా పాకిస్తాన్ లోని షియా సంఘాలు కరాచీలోని అమెరికా దౌత్య కార్యాలయం వైపు భారీ ర్యాలీగా వెళ్లాయి. వాషింగ్టన్, టెల్ అవీవ్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసుకుని అమెరికా కాన్సులేట్ లోపలికి వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. పరిస్థితి చేయి దాటి పోవడంతో యూఎస్ కాన్సులేట్ రక్షణలో ఉన్న అమెరికా మెరైన్ సిబ్బంది కాల్పులు జరిపినట్లు పాకిస్తాన్ మీడియా వెల్లడించింది. కరాచీలో మాత్రమే కాకుండా పాకిస్తాన్‌లోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఖమేనీ మృతికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి. వందలాది మంది నిరసనకారులు లాహోర్‌లోని అమెరికా కాన్సులేట్ ముందు బైఠాయించారు. రోడ్డుపైనే ప్రార్థనలు చేసి అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. పోలీసులు భారీగా మోహరించడంతో అక్కడ ఎలాంటి హింస చెలరేగలేదు. ఉత్తర పాకిస్తాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు ఐక్యరాజ్యసమితి కార్యాలయ భవనానికి నిప్పు అంటించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అక్కడ ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ.. భారీగా ఆస్తి నష్టం జరిగింది. పాకిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. కరాచీ, లాహోర్, పెషావర్ నగరాల్లో మరిన్ని నిరసనలు జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అమెరికా పౌరులకు సూచించింది.



ఇరాన్ తాజా పరిమణామాలను వైట్ హౌస్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం జరిపిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

# ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్, మార్చి 1: సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడులపై తీవ్రంగా స్పందించింది. దాడులకు పాల్పడిన వారిపై కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ కేబినెట్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఖమేనీ మృతిపై ఐఆర్‌జిసి సంతాపం తెలిపింది. తమ సుప్రీం నేతను చంపిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించింది. చరిత్రలో ఎన్నడూ చూడని భయంకరమైన దాడులు జరగవచ్చని తెలిపింది. ఖమేనీ మృతికి సరైన సమాధానం చెప్పకుండా వదిలి పెట్టేది లేదని తేల్చిచెప్పింది. ఇజ్రాయెల్, అమెరికాలే లక్ష్యంగా ఆపరేషన్ చేపట్టేందుకు ఐఆర్‌జీసీ సిద్ధమైనట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది.

# ఖమేనీ ఖతం

>> పోస్టు చేస్తూ 86 ఏళ్ల ఇరానియన్ అగ్రనేత మరణాన్ని ధృవీకరిస్తూ ఇరాన్‌ప్రజలు తమ దేశాన్ని తిరిగి పొందేందుకు ఒక గొప్ప అవకాశం సాధించుకున్నారని ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక బాంబుదాడులతో ఇరాన్ మిలిటరీ, ప్రభుత్వ స్థలాలన్నీ ధ్వంసం అయ్యాయి. అమెరికన్ కమాండర్‌ఇన్‌చీఫ్ మాట్లాడుతూ తమ దేశం ఇజ్రాయెల్‌తో కలిసి పర్యవేక్షణ చేసిందని 1989నుంచి ఉన్న ఈ నేతను అంతంచేయడమే లక్ష్యంగా చెప్పారు. అణ్వాయుధ తయారీని ఎంతమాత్రం అంగీకరించబోమని, ఇరాన్‌తో తమకు అణుముప్పు ఉన్నందువల్లనే దాడులుచేసామని ముందుగా హెచ్చరించినా ఫలితం లేకపోయిందని చెపుతూ వచ్చిన అమెరికా ఇజ్రాయెల్‌తో కలిసి దాడులకు పూనుకుంది. ఇంటెలిజెన్స్ ట్రాకింగ్ వ్యవస్థలు ఖమైనీ ఎక్కడ ఉంటున్నదీ పసిగట్టాయి. ఖమైనీతోపాటే ఇరాన్ రక్షణ మంత్రి ఆమిర్ నాసిర్‌జాదె, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహ్మద్ పాక్‌పోర్‌లు కూడా ఈ దాడుల్లోచనిపోయారు. ఇజ్రాయెల్ మిలిటరీ కూడా తమ మిలిటరీలోని ఐదుగురు సీనియర్ కమాండర్లుకూడా చనిపోయారని, వారిలో ఇరాన్‌సుప్రీం లీడర్ సలహాదారు ఆలి షమ్‌ఖాని కూడా ఉన్నట్లు వెల్లడించింది. ఇరాన్ మతపెద్ద కుమార్తె, మనవరాలు, అల్లుడు, కోడలు కూడా చనిపోయారని ప్రకటించింది. అమెరికా ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ ఆగ్రహావేశాలతో ఊగిపోతూ దాడులు ముమ్మరంచేసింది. ఇజ్రాయెల్‌తోపాటు మరో ఏడు దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులుచేసింది. ప్రత్యేకించి గల్ఫ్‌దేశాల్లోనే ఈ దాడులు జరిగాయి. 86 ఏళ్ల అయొతుల్లా అలీఖమేనీ ఇరాన్‌ను 1989నుంచి పాలించారు. ప్రభుత్వం, మిలిటరీ, న్యాయవ్యవస్థలపై పూర్తిస్థాయి పట్టును నిరూపించారు. షియా ఇస్లామిక్ రిబిప్లక్ దేశంలో అగ్రనేతగా కొనసాగారు. ఇరాన్ వ్యవస్థాపకుడుగా పేర్కొంటున్న ఆవిష్కర్త అయొతొల్లా రుహోల్లాఖొమైనీ తర్వాత ఈ అయొతుల్లా ఖమైనీనే ఎంపికచేసారు. ప్రాథమికంగా అంతగా పట్టుసాధించలేకపోయినా గడచిన వందేళ్లలో ఐదుగురు శక్తివంతమైన ఇరాన్ మతపెద్దల్లో ఒకరిగా క్రమేపీ ఎదుగుతూ వచ్చారు. తన పాలనలో నిరంతరం అమెరికాను ఖమైనీ ఎండగడుతూనే వచ్చారు. డొనాల్డ్‌ట్రంప్ రెండోసారి ఎన్నికయిన తర్వాత కూడా ఈ విమర్శలు, వివాదాలు కొనసాగుతూనే వచ్చాయి. దీనితోనే ట్రంప్ నిరంతరం నియంతకు మరణం తప్పదు అంటూ నినాదాలిచ్చేవారు. శతృవుకు ఎప్పుడూ ఇరాన్ లొంగదంటూ వచ్చిన ఖమైనీ తన పాలనశైలిలోనే కొనసాగారు. ఖమైనీ తన పాలనలో స్వతంత్రతను తెచ్చారు. ఎన్నికైన అధ్యక్ష తరహా పాలనను పూర్తిగా రద్దుచేసి మతపరమైన పాలనకు బీజం వేసారు. దీనితోనే ఇరాన్ ఇతర ప్రపంచదేశాలతో ఏకాకిగా మారిపోయింది.

# ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలీ రెజా అరాఫీ

టెహ్రాన్, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ అయొతుల్లా ఖమేనీ హత్యతో ఏర్పడిన ఖాళీని భర్తీచేసేందుకు తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లు అలిరెజా అరాఫిని ఎంపికచేసారు. దేశ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అరాఫి వ్యవరిస్తారు. అలాగే శాశ్వత సుప్రీం లీడర్ ఎంపిక జరిగేంతవరకూ అలిరెజాయే సుప్రీంగా కొనసాగుతారు. సుప్రీం లీడర్‌నియామకం కోసం అధ్యక్షుడు పెజెష్కియాన్, చీఫ్‌జస్టిస్ ఘోలమ్ హోస్సేన్ మెహసేని ఎజెయీ, గార్డియన్ కౌన్సిల్ నుంచి ఒక సభ్యుడు ఉంటారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం సుప్రీం లీడర్‌ను నిపుణుల కమిటీ నియమిస్తుంది. 88 మంది సభ్యులున్న మతపెద్దల కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. ఇరాన్ సుప్రీం లీడర్‌కు మత పెద్దల రాజ్యాంగం ప్రకారమే సుప్రీం అధికారాలు సంక్రమిస్తాయి. విదేశాంగ విధానాన్ని కూడా సుప్రీం లీడరే నిర్ణయిస్తారు. 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్‌ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అధ్యక్షుడుగా కూడా అరాఫీ పనిచేశారు.

# నాగ్‌పూర్‌లో భారీ పేలుళ్లు

>> 20 మందికిపైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో 17 మంది మరణించారు. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలను కలిగించింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

**మరికొందరి పరిస్థితి విషమం..**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో 12 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి ఈ పరిశ్రమ గోదాము పూర్తిగా నేలమట్టమైంది. ఈ ప్రమాదం ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇతర భవనాలు కూడా దెబ్బ తిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ గోడౌన్‌లో అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ చేయడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని సమాచారం.

# మీ కన్నీరు తుడుస్తా..

>> రాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ పేదలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయాల కోసం పేదలను కవచంలా వాడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. మీ పార్టీ ఏదైనా సరే.. మీరు నిజమైన పేదలైతే ఈ ప్రభుత్వం మీకు ఇల్లు ఇచ్చి తీరుతుందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శకమైన సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారువెలుగుమట్ల భూదాన్ భూములలో ఉన్న ఆక్రమణల తొలగింపులో నిరాశ్రయానికి గురైన అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ స్థలంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేసినట్లు తమకు సమాచారం వచ్చిందని, బాధితులు ఎవరికైనా డబ్బులు ఇస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ బాధితులలో అర్హులైన పేదలకు వారి సొంత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. వెలుగుమట్ల అంశాన్ని కొందరు రాజకీయాలకు వాడుతున్నారని, తాము ఈ అంశాన్ని కేవలం పేదల కోణంలోనే చూస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ ప్రభుత్వంలో అన్యాయం జరిగే ప్రసక్తే ఉండదన్నారు.!! వెలుగుమట్ల ప్రభుత్వ భూదాన్ భూముల ఆక్రమణలో తప్పు ఒకరు చేస్తే, శిక్ష మరొకరికి వచ్చినట్లు కొంతమంది బాధితులు తెలియక అక్కడ ఇండ్ల పట్టాలు పొందామనే భ్రమలో ఇండ్లు కట్టుకున్నారని మంత్రి అన్నారు.వెలుగుమట్ల సంఘటనలో బాధితులు ఎప్పటినుంచి ఇక్కడ ఉంటున్నారు,!! ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అధికారులతో క్షుణ్ణంగా విచారణ చేయించి నిరుపేదలకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్నవాళ్లు కూడా ఉన్నట్లు తెలుస్తోందని, అటువంటి వారికి కాకుండా మిగిలిన అర్హులైన పేదలందరికీ ఖమ్మం పరిసర ప్రాంతాల్లో, సంబంధిత బాధితుల సొంత ప్రాంతాల్లో ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. బాధితులు వెలుగుమట్ల ఇంటి స్థలం కోసం ఎవరికి డబ్బులు ఇచ్చారో నిర్భయంగా పోలీసు అధికారులకు చెప్పాలని, ఆ డబ్బులు కూడా బాధితులకు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.!! వెలుగుమట్ల బాధితులకు ఇచ్చే ఇండ్ల దగ్గర అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, త్రాగు నీరు, విద్యుత్ సౌకర్యం, మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. పేద ప్రజల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, గత పాలకులు వెలుగుమట్ల బాధితులకు పట్టాలు పంపిణీ చేయని కారణంగానే నేడు కూల్చివేతలు జరిగాయని మంత్రి అన్నారు. ప్రతి అంశాన్ని రెచ్చగొట్టే ధోరణితో చూడవద్దని తెలిపారు. మార్చి 15 నాటికి అర్హులైన పేదలకు తప్పనిసరిగా ఇళ్లస్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వెలుగుమట్ల సంఘట!!న బాధితులకు న్యాయం చేయడానికి తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. అనంతరం వెలుగుమట్ల బాధితులు దళారులకు ఎలా డబ్బులు ఇచ్చి మోసపోయామో మీడియా ప్రతినిధుల ఎదుట వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు, వెలుగుమట్ల బాధితులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాట డబులింజన్ ఖాయం

>> వారు సరైన సుపరిపాలనను అందించలేదు. మొత్తం రాష్ట్రాన్ని లూటీ చేశారు. వారసత్వ రాజకీయాల గురించి ఆలోచిస్తూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. మధురైను ప్రేమించిన ఎంజీఆర్‌తో ఇక్కడి ప్రజలు అండగా నిలిచారు. అందుకే డీఎంకేకు మదురై అంటే ఇష్టం లేదు. ఇంకా మదురైకు మాఫియా తరహా రాజకీయాలను తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ సరిగ్గా లేదు. జాతీయ శుభ్రత ర్యాంకింగ్స్‌లో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లింది. అవినీతి వల్ల మేయర్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. డీఎంకే పేదల కోసం పనిచేయదు ఇతరులను కూడా చేయనియ్యదు. తమిళనాడులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దాదాపు ఆరు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, ఆ కుటుంబాలు సొంత ఇల్లు వచ్చిందన్న గౌరవంతో ఉంటున్నారన్నారు. ఇదే సమయంలో మరో మూడు లక్షల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. డీఎంకే ప్రభుత్వం సర్వేలు చేయకుండా కాలయాపన చేయడమే కారణమని విమర్శించారు. డీఎంకే చిల్లర రాజకీయాల వల్ల పేద కుటుంబాలు ఎందుకు ఇబ్బందులు పడాని మోడీ ఆరోపించారు. తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుకళ్లారా చూస్తున్నారు. ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై దృష్టి పెడతాం. డ్రగ్ మాఫియా, క్రిమినల్స్‌ను జైలులో వేస్తాం. రామేశ్వరానికి ఉన్న పాత పంబన్ వంతెనకు దాదాపు వందేళ్లు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత దానిని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మా పనితీరులో వేగాన్ని ప్రదర్శించాం. ఇప్పుడు రైళ్లు కూడా వేగంగా పరిగెడుతున్నాయి. 2009 నుంచి 2014 మధ్య డీఎంకే, కాంగ్రెస్ పాలనలో తమిళనాడుకు రూ. 880 కోట్లు కేటాయించారు. ఒక్క 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే రూ.7,600 కోట్లు కేటాయించాం. ఇది దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువని ప్రధాని అన్నారు. మోడీ తన పర్యటనలో తమిళనాడులో రూ.4400 కోట్లు, పుదుచ్చేరిలో రూ.2700 కోట్లు విలువైన అభివృద్ధి, మౌలికసదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు.

## నేడు రాహుల్‌గాంధీ తెలంగాణకు రాక

>> దూరంగా ఉన్నాయి. తదితర అంశాలపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. సోమవారం రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.వికారాబాద్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షులకు పదిరోజుల శిక్షణ కార్యక్రమం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భాంగా పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో నాయకత్వ నైపుణ్యాలు, ఎన్నికల వ్యూహాలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను అందిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఈ సమావేశానికి రానున్నారు.

**వికారాబాద్‌లో భారీ భద్రత ఏర్పాట్లు :** రాహుల్ గాంధీ పర్యటన దృష్ట్యా వికారాబాద్ హరిత హోటల్ పరిసరాల్లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పార్టీ నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. డీసీసీ అధ్యక్షులకు పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై రాహుల్ గాంధీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తారని సమాచారం. రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌లో కొత్త ఉత్సాహం రానుంది. ముఖ్యంగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు రేపటితో తెరపడనుంది.

## నేడు సిఎం రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా పర్యటన

హైదరాబాద్, మార్చి1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగే ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి సిఎం స్వాగతం పలకనున్నారు. అనంతరం రాహుల్ గాంధీతో కలిసి శంషాబాద్ నుంచి నేరుగా వికారాబాద్ పర్యటనకు సిఎం బయలుదేరి వెళ్లనున్నారు. ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై తిరిగి సాయంత్రం హైదరాబాద్ చేరుకోనున్నారు.

## అనుక్షణం అప్రమత్తం

>> కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం మవుతామన్నారు. ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తున్నదన్నారు. అవసరమైతే కేంద్రంతో కలిసి తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఆయా దేశాల్లో ఉన్న భారత ఎంబసీలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఇక 30 రోజులే..

>>గాలు కలిసికట్టుగా ఆపరేషన్ కగార్‌ను శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో అమలు చేయడంతో రెండు సంవత్సరాల కాలంలో 70సంవత్సరాల మావోయిస్టు పార్టీ కార్యకలాపాలను అతలాకుతలం చేయడంతో వందల సంఖ్యలో అగ్రనేతలతో సహా పలువురు మావోయిస్టు సభ్యులు ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడగా, వేలాది మంది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముందు లొంగిపోయారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్-2 ప్రారంభించడం 2026మార్చి 31 డెడ్‌లైన్ విధించడంతో అప్పటికే దండకారణ్యాలలో మిగిలివున్న మావోయిస్టులకు సమాచార వ్యవస్థ కనుమరుగైపోవడం అన్న, పానీయాలు అతికష్టం మీద లభిస్తుండడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జనజీవన స్రవంతిలోకి వచ్చే మావోయిస్టులకు పునరావసం కల్పిస్తాం.. కేసులు ఎత్తివేస్తాం.. భద్రత కల్పిస్తాం.. పిలుపు నివ్వడంతో చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గత మూడు మాసాలుగా మావోయిస్టు అగ్రనేతలతో పాటు కిందిస్థాయి నేతలు కుప్పలు, తెప్పలుగా తుపాకులు వీడి ప్రభుత్వాల ముందు లొంగిపోతున్నారు. ఈ దశలో మార్చి 1వ తేది నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన గడువు ఇక 30రోజులే ఉండడడం.. గడియలు ముంచుకస్తుండడం.. దండకారణ్యంలో ఉన్న మావోయిస్టులు జనరాణ్యంలోకి అడుగుపెడుతున్నారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా తారాలపల్లికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ అగ్రనేత ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్ మరో 15మంది మావోయిస్టులతో కలిసి ఆయుదాలతో యుక్తంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాసముంద్ జిల్లాలో బలింగిర్ బర్‌గడ్-మహాసముంద్ (బిబిఎం) డివిజన్‌కు చెందిన కీలక నేతలతో వచ్చి ఆయుదాలతో సహా పోలీసు అధికారుల ముందు లొంగిపోవడం సంచలనం రేపింది. స్పెషల్ జోన్ కమిటీ నాయకుడిగా, ఒరిస్సా మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా ముప్పిడి సాంబయ్య విధులు నిర్వర్తిస్తున్నట్లు చత్తీస్‌ఘడ్ పోలీస్ ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముప్పిడి సాంబయ్యతోపాటు దినేష్ (ప్లాటూన్ సభ్యుడు), కవిత (ప్లాటూన్ సభ్యురాలు), సవిత (ప్లాటూన్ సభ్యురాలు), మంగేష్ (డివిజన్ కమిటీ సభ్యుడు), రింకూ (ఏరియా కమిటీ సభ్యుడు), జుగ్ను (ప్లాటూన్ సభ్యుడు), అస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), సస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), సాస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), రీటా (ఏరియా కమిటీ సభ్యురాలు), నీల (ఏరియాకమిటీ సభ్యురాలు), మీనా (ప్లాటూన్ సభ్యురాలు), బేబి (డివిజన్‌కమిటీసభ్యురాలు) లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.మార్చి 31గడువు ముంచుకస్తుండడంతో ఉద్యమంలో అనేకఒత్తిళ్లకు గురవుతున్న మావోయిస్టులు రానున్న 30 రోజుల్లో ఇంక ఎంతమంది లొంగిపోతారోనన్న కోణంలో నాలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పోలీస్ యంత్రాంగంఎదురుచూస్తుంది. ముప్పిడి సాంబయ్య లొంగుబాటు మావోయిస్టు పార్టీకితీరని నష్టమని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి.

## వారం - వర్జ్యం

02-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
చతుర్దశి సా.5.59
ఆశ్లే ఉ.7.52
వర్జ్యం : రా.7.42-9.16
దు.మ.12.44-1.32, మ.3.06-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసంగాలు, ఆరోగ్య సూత్రాలు మీపై చెప్పుకోదగిన ప్రభావం చూపుతాయి.

**వృషభం:** ఓర్పుతో, ధైర్యముతో చేయ వలసిన పనిని సఫలము చేయగలుగుతారు. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**మిథునం:** విధి నిర్వహణలో గానీ, వ్యాపారములో గాని మార్పులు జరుగ వచ్చును. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**కర్కాటకం:** రాజకీయ సంఘములు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యములకు అనుకూల కాలము.

**సింహం:** కుటుంబసభ్యులతో కలిసి దేవాలయ సందర్శనము చేసుకుంటారు. మిత్రుల ఒత్తిడివలన కొంత బాధ కలుగుతుంది.

**కన్య:** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది, మొండి బాకీలు రాబట్టు కోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**తుల :** వ్యక్తిగత సౌకర్యాలకు గాను, ఈరోజు అధికంగా ధనాన్ని ఖర్చు చేస్తారు. ఆరోగ్యపరంగా విశేషమైన జాగ్రత్తలు తీసుకుంటారు.

**వృశ్చికం:** ప్రముఖవ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.విందు, వినోదాలు పాల్గొంటారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు వాయిదా పడే సూచనలు ఉన్నాయి. రచన, వ్యాపారాల పట్ల ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.

**మకరం:** జీవిత భాగస్వామితో భేదాభిప్రాయాలు ఏర్పడకుండా ముందు చూపులతో వ్యవహరించండి. వృత్తిలో అనుకోని మార్పులు.

**కుంభం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంది. కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది.

**మీనం:** సన్నిహితుల సహాయంతో కొన్ని వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## సిఎం రేవంత్‌రెడ్డిని రిసెప్షన్‌కు ఆహ్వానించిన నటి రష్మిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 1:** టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహం రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో జరిగింది. ఈ జంట తమ సొంత గ్రామంలో రిసెప్షన్ వేడుకలు గ్రాండ్‌గా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన రష్మిక మందన్న తమ రిసెప్షన్ వేడుకకు ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో రష్మిక ముచ్చటించారు. ఈ నెల 4వ తేదీన సాయంత్రం హైదరాబాద్‌లో తాజ్ కృష్ణలో వెడ్డింగ్ రిసెప్షన్‌కు, ఉదయం తుమ్మన్‌పేట ఫామ్‌హౌస్‌లో జరిగే సత్యనారాయణస్వామి వ్రత వేడుకలకు రావాలని ముఖ్యమంత్రి దంపతులను ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి సతీమణి రష్మిక మందన్నకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బొట్టుపెట్టి, కానుక ఇచ్చారు. ముఖ్యమంత్రి దంపతులు రష్మికను దీవించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'సినీనటుడు విజయ్ దేవరకొండతో ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సినీనటి రష్మిక తమ వివాహ రిసెప్షన్‌కు ఆహ్వా నించారు' అంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ముఖ్యమంత్రి దంప తులను సగౌరవంగా ఆహ్వానించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా వంటి దిగ్గజాలను కూడా ఈ జంట ఆహ్వానించింది. ఈ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులతోపాటు రాజకీయ నేతలు పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు.



ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ పాతబస్తీలోని దారుల్‌షిఫాలో ప్రదర్శన చేస్తున్న షియా వర్గీయులు

## ఇరాన్‌పై అమెరికా దాడితో పాతబస్తీలో నిరసనలు

**హైదరాబాద్, (చార్మినార్) మార్చి 1, ప్రభాతవార్త:** ఇరాన్‌పై అమెరికా దాడులకు పాల్పడడాన్ని నిరసిస్తూ పాతబస్తీలోని దారుషిఫాలో షియా వర్గీయు లు ఆదివారం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది షియా వర్గీయులు ఒక్కసారిగా తరలిరావడంతో దారుషిఫా నుంచి చార్మినార్ వెళ్లే మార్గంలో వాహనాలను ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు నిలిపివేసి ఆ మార్గాన్ని మూసివేశారు. ఇరాన్‌పై శనివారం నాడు అమెరికా దాడులకు పాల్పడడం, ఈ దాడుల్లో ఆ దేశ నేత ఖమేని సహా అనేక మంది ప్రముఖులు మరణించడం తెలిసిందే. ఈ దాడులను నిరరిస్తూ భారత్‌లోని అనేక నగరాలలో షియా వర్గీయులు నిరసన ప్రదర్శన చేశారు. పాతబస్తీలోని పురాని హావేలి, దారుషిఫా ప్రాంతంలో షియా వర్గీయులు ఎక్కువగా వుండడ ం తెలిసిందే. వీరంతా మధ్యాహ్నం ప్రార్థనలు పూర్తయిన తరువాత రెండు గంటల సమయంలో ఖమేని ఫోటోలు కలిగిన ప్ల కార్డులు పట్టుకుని పు రాని హావేలి నుంచి దారుషిఫా మైదారం వరకు ర్యాలీగా వచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా అమెరికాకు వ్యతిరేకంగా నినదించారు. అమెరికా చర్యలను వారంతా ఖండించారు. కాగా దారుషిఫా మైదానంలో అనంతరం అమెరికా చర్యలను వ్యతిరేకిస్తూ ఒక సభ నిర్వహించారు. ఈ సభలో చార్మినార్ ఎంఎల్ఏ మీర్ జుల్ఫికర్ అలీతో పాటు ఎంఎల్‌సి మీర్జా వుల్ హాస్సన్ సహా పలువురు మజ్లిస్ పార్టీ నేతలు, షియా మత పెద్దలు పాల్గొనా న్నరు. వీరంతా ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించడంతో పాటు ఇరాన్‌కు సంఘీభావం తెలిపారు. అమెరికా దాడులు ఇరాన్‌ను ఏమీ చేయలేవ ని వారు వెల్లడించారు. ఇరాన్ ప్రజలకు యావత్ ప్రపంచం అండగా వుంటుందని వారు తెలిపారు.

**భారీగా ట్రాఫిక్ జాం.. దారుషిఫా, చార్మినార్ మార్గం మూసివేత**

ఇదిలావుండగా ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ దారుషిఫాలో షియా వర్గీయులు చేబట్టిన ర్యాలీ కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జాంకు దారితీసింది. అఫ్జల్‌గంజ్ నుంచి మీర్‌చౌక్ మీదుగా చార్మినార్‌తో పాటు ఫలక్‌నుమా వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహ నాలు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి వుండడంతో ర్యాలీ కారణంగా వాహ నాలన్నీ సాలార్‌జంగ్, ఐబిఎస్, చాదర్‌ఘాట్ మార్గంలో నిలిపిపోయాయి. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పురాని హావేలి, దారుషిఫా, చార్మినార్ మార్గాన్ని కొన్ని గంటలపాటు మూసివేసి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలను ఇతర ప్రాంతాల గుండా మళ్లించారు. అయినప్ప టికీ సాయంత్రం వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ జాం కొనసాగింది. మరోవైపు షియా వర్గీ యుల ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.





## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం

**తిరుపతి, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తన గానామృతంతో తెలుగు ప్రజలను ఉర్రూతలూగించిన ఘంటసాలను స్మరించుకోవడం ప్రతి తెలుగువారి బాధ్యత అని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యం లో ఘంటసాల అభిమానులు ఆదివారం తమ అభిమాన గాయకున్ని స్మరించుకుంటూ విగ్రహానికి మంచినీటితో శుద్ధిచేసి పుష్పాంజలితో నివాళి అర్పించారు. అనంతరం ఘంటసాల అభిమాని రామకృష్ణ మొదలియార్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటేశ్వరులు, ఘంటసాల అభిమా నులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, తులసిరామ్ నాయుడు, పోలే జనార్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వినాయకరెడ్డి, టీచర్ తిరుమలయ్య పాల్గొన్నారు.

# అమెరికన్ కాన్సులేట్ ముందు పోలీసుల గట్టి బందోబస్తు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 1, ప్రభాతవార్త:** ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మ ృతిపై దేశంలోని పలు ప్రాంతాలు, అంతర్జాతీయంగా నిరసన ప్రదర్శనలు చేపడుతుండడంతో నగరంలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద సైబరాబాద్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ భద్రతను పర్యవేక్షించే బలగాలకు అధనంగా భారీ బలగాలను మోహరించారు. నగరంలో నిరసన ప్రదర్శన ఉండడంతో గచ్చిబౌలి పోలీసులు అప్రమత్తమయ్యారు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని అమెరికన్ కాన్సులేట్‌కు వెళ్లే రహదారులను మొత్తం నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎటువంటి అనుమానిత వాహనం కనిపించినా వెంటనే నిలిపివేసి తనిఖీలు చేపడుతున్నారు.

ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ఇరాన్ సు ప్రీం లీడర్ ఖమేనీ, అతని కుటుంబ సభ్యులు చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో పలు దేశాల్లోని అమెరికన్ కాన్సులేట్‌ల వద్ద నిరసనకారులు ఆందోళనలు చేపట్టారు. మన దేశంలో సైతం పలు రాష్ట్రాలు, నగరాల్లో ఆదివారం నిరసన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా నగరంలో సైతం ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించడంతో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలో గల అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి అదనపు బలగాలతో భద్రతను ఏర్పాటు చేశారు. సాధారణంగానే అమెరికన్ కాన్సులేట్ పరిధిలో పటిష్ట భద్రత కొనసాగుతుండగా, ప్రస్తుత పరిస్థితులతో గచ్చిబౌలి పోలీసులు అదనంగా 50 మంది పోలీసులను మోహరించి ముందు జాగ్రత్తగా భద్రతా చర్యలు చేపట్టారు. ఈ దారిలో వచ్చే వాహనాలపై నిఘా ఉంచడంతో పాటు అనుమానిత వాహనాలను నిలిపివేసి తనఖిలు చేపడుతున్నారు.

**ప్రతి పౌరుడు శాంతియుతంగా ఉండాలని కోరుకునే దేశం మనిది : మంత్రి శ్రీధర్‌బాబు**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి దేశం, ప్రతి పౌరుడు శాంతియుతంగా ఉండాలని కోరుకునే దేశం మన భారతదేశమని తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

మాదాపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆదివారం హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులపై స్పందించారు.



గచ్చిబౌలి అమెరికన్ కాన్సులేట్ ముందు పోలీసుల బందోబస్తు

యుద్ధం నేపథ్యంలో వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు, ముఖ్యంగా తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పలు దేశాల నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఎయిర్ పోర్టుల్లో మన ప్రజలు చిక్కుకుపోయారని, వారందరూ సంయమనం పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా దేశాల్లోని భారతీయులు స్థానికంగా ఉన్న భారత కార్యాలయాలను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఎవ్వరికీ ప్రాణనష్టం జరుగకూడదని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

**భారత్ సహా ఆసియా దేశాల్లో పాక్షికం**

**ఉదయం 9 గంటల నుంచే మూతపడనున్న ఆలయాలు**

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఈ నెల మూడో తేదీన ఏర్పడనున్న చంద్ర గ్రహణం భారత్ సహా ఆసియా దేశాల్లో పాక్షికంగానే కనిపించ నున్నా గ్రహణంతోనే చంద్రోదయం కనువిందు చేయడం అరుదైన ఘటనగా ఆగమన పండితుతు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ గ్రహణం సాయ ంత్రం వేళ కనిపించనున్నా సూతకాలం మాత్రం ఉదయం ఏడు గంటకే మొదలవనుండడం గమనార్హం. దీంతో ఆలయాలన్నీ ఉదయం తొమ్మిది నుంచి పది గంటలకే సంప్రోక్షణతో మూసివేయనున్నారు. మరో వైపు ఈ గ్రహణం శక్తివంతమైనదని ఆగమన పండితులు చెబుతున్నారు. సింహరా శిలో పుబ్బ నక్షత్రంలో ఈ గ్రహణం ఏర్పడుతోంది. భారత కాలమానం సాయంత్రం 4.58 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం రాత్రి 7.53 గంటలకు ముగుస్తుంది. అయితే ఈ సమయం కొన్నిచోట్ల మారుతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మార్చి మూడవ తేదీన చంద్రోదయం సాయం త్రం ఆరు గంటల 22 నిమిషాలకు వుండగా చంద్రుడు గ్రహణంతోనే ఉదయించడం మరో విశేషం. గ్రహణంతో చంద్రోదయం ఏర్పడడం చాలా అ రుదుగా జరిగే ఘటనగా ఆగమన పండితులు చెబుతున్నారు. గ్రహణం మొత్తం వ్యవధి రెండు గంటల 55 నిమిషాలు. చంద్ర గ్రహణం మొదలైన 84 నిమిషాల తరువాత భారత్‌లో చంద్రోదయం కనిపించనుంచడగా అప్పటి నుంచి గ్రహణం ముగిసే వరకు వీక్షించవచ్చు. భారత్‌లో దాదాపు గ్రహణం పూర్తిగా వున్న దశలో చంద్రోదయం ఏర్పడనుండడం విశేషం. ఇదిలావుంటే భారత్‌లో ఒక్కోచోట ఒక్కో సమయంలో గ్రహణ వేళలు వుండడ ం గమనార్హం. చివరి 90 నిమిషాలు గ్రహణం భారత్‌లో స్పష్టంగా వీక్షించే వీలుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. సింహరాశి వారు గ్రహణాన్ని వీక్షించడ ం శ్రేయస్కరం కాదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈసారి ఏర్పడే గ్రహణం రాక్షస గణాలకు బలం చేకూరే వీలుందని, ఈ క్రమంలో గ్రహ ణం ముగిసిన తరువాత ఆలయాలలో, ఇళ్లలో సంప్రోక్షణలు చేశాక ప్రత్యేక పూజలు చేయాలని వారు సూచిస్తున్నారు. అమెరికాతో పాటు ఆస్ట్రేలి యా, న్యూజీలండ్ దేశాలలో గ్రహణం పూర్తిగా కనిపించనుంది. ఆసియా దేశాలలో కొన్ని చోట్ల అరగంట నుంచి గంటన్నర పాటు గ్రహణం కనిపించనుంది. కాగా గ్రహణ పూర్ణకాలం సాయంత్రం 4.30 గంటలు. మధ్య కాలం సాయంత్రం 5.03 గంటలు. గ్రహణ విడిచే సమయం 6.45 గం టలు. కాగా ఈసారి చంద్ర గ్రహణం రోజున హోలీ పండగా కావడం విశేషం. గ్రహణం రోజున మధ్యాహ్నం 12 గంటలకే భోజనాలు ముగించాల ని, ఆ తరువాత గ్రహణం పూర్తయిన స్నానాధికాలు చేసి, పూజలు చేశాకే మళ్లీ అన్న పానీయాలు స్వీకరించాలని ఆగమన పండితులు చెబుతున్నారు. చంద్రోదయం సమయంలో గ్రహణం కనిపించనుండడంతో దీనిని గ్రస్తోదయ గ్రహణంగా ఆగమన పండితులు నామకరణం చేశారు.

## సచివాలయం వద్ద అర్ధరాత్రి మాక్‌డ్రిల్

**భారీగా పోలీసుల మొహరింపుతో సమీప బస్తీల ప్రజల్లో ఆందోళన**



సచివాలయం వద్ద జరిగిన మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులకు సూచనలు చేస్తున్న ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** అత్యవసర పరిస్థితులు తలెత్తితే ప్రజల ను ఆదుకునేందుకు పోలీసుల సన్నద్ధతను పరిశీలించేందుకు ఉద్దేశించిన మాక్‌డ్రిల్ శనివారం అర్ధరాత్రి సమయంలో సచివాలయం వద్ద ఖైరతాబాద్ జోన్ పోలీసులు నిర్వహించారు. ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి నేతృ త్వంలో మొత్తం జోన్ సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుకోని విపత్తులు ఎదురైతే, వెంటనే అక్కడకు ఎలా చేరు కోవాలి? ప్రజలను ఎలా కాపాడాలి? ఆపదలో ఉన్న వారిని ఎలా ఆదుకో వాలి? అనే దానిపై డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు తమ సామర్థ్యాలను చూపారు. ఈ సందర్భంగా డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంతో పాటు ఫైర్ బాల్స్, రాయట్ గేర్ వంటి పరికరాల పనితీరును ప రిశీలించారు. అర్ధరాత్రి వేళ సచివాలయం ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పోలీసులు మొహరించడంతో సమీప బస్తీల ప్రజలు కంగారు పడ్డారు. సచివాలయంలో ఏం జరిగిందోనని ఆందోళనకు గురై ఆరా తీశారు. అయితే పోలీసులు వారికి నచ్చచెప్పి ఇదంతా మాక్‌డ్రిల్ అని వివరించ డంతో శాంతించారు. ఈ సందర్భంగా డిసిపి శిల్పవల్లి మాట్లాడుతూ ప్రజల రక్షణ పోలీసుల ప్రథమ విధిగా తెలిపారు. ఎంతటి విపత్కర సమయంలో కూడా పోలీసులు వెనుకంజ వేయకుండా ప్రజలను కాపాడతారని ఆమె తెలిపారు. ఆపదలు, విపత్కర పరిస్థితులు ఎదురై నపుడు ఎలా వ్యవహరించాలనే దానిపై పోలీసుల సామర్థ్యాన్ని పరిశీలిం చేందుకు, వారి సన్నద్ధత ఏ వధంగా వుందో తెలుసుకునేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఆమె చెప్పారు.

ఇటువంటి డ్రిల్ వల్ల పోలీసుల సన్నద్ధత మరింత మెరుగుపడుతుందని ఆమె అన్నారు. మాక్ డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు తమ సన్నద్ధతను భేషుగ్గా నిర్వహించారని, ఇందుకు గానూ వారందరిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమలో ఎసిపిలతో పాటు ఇన్‌స్పెక్టర్లు సహా అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ సబ్జెక్టు పరీక్షలు

**ప్రశాంతంగా ముగిసిన లాంగ్వేజెస్ పరీక్షలు**

**4 నుంచి సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం**

**15 నుంచి మూడు విభాగాలుగా వాల్యూయేషన్**

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా లాంగ్వేజెస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేటి(సోమవారం) నుంచి సబ్జెక్టు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నేడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మేథమెటిక్స్, పొలిటికల్ సైన్స్, బొటనీ పేపర్-1 పరీక్షలు జరగనున్నాయి. గత నాలుగు రోజులుగా ఇంటర్ విద్యార్థులకు లాంగ్వేజెస్ పరీక్షలు జరిగాయి. నేటి(సోమవారం) నుంచి సబ్జెక్టు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. శనివారం జరిగిన ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని కరీంనగర్, సిద్ధిపేట జిల్లాల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. శనివారం జరిగిన ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షకు సెట్ సీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షకి 97.80 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు 4,56,458 మంది హాజరు కావల్సి ఉండగా.. వారిలో 4,46,457 మంది విద్యార్థులు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 97.80 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు సెక్రటరీ తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి కామారెడ్డి, కరీంనగర్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అబ్జర్వర్స్ పరీక్షల సరళిని పరిశీలించి, పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. సంస్కృతం పేపర్-1, పేపర్-2 జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 4(బుధవారం)న ప్రారంభం కానుంది. ఎక్కువ మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షను రాస్తున్న నేపథ్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ముందుగానే సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 4 నుంచి ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించి 20 వరకు మూడు విడతలుగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 15 ఎవల్యూయేషన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. గత ఏడాది వరకు మైనర్ మీడియంతోపాటు, ఒకేషనల్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని హైదరా బాద్‌లోని ఇంటర్ బోర్డు పక్కన గల ఎంఏఎం కాలేజీలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఎంఏఎంలో కేవలం ఒకేషనల్ విద్యార్థుల మూ ల్యాంకనాన్ని కొనసాగిస్తూ.. మైనర్ మీడియం విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మహబూబియా కాలేజీలో నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో రాష్ట్రంలో 16 కేంద్రాల్లో మూల్యాం కనం కొనసాగనుంది. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభం కాగా.. మార్చి 18 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షలకు 9.97 లక్షల మంది హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతున్నాయి.

## నిద్రిస్తున్న భర్తను సుత్తితో హతమార్చిన భార్య

**పోలీస్‌స్టేషన్ ఎదుట లొంగిపోయిన మహిళ**

**గుండాల, మార్చి 1, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని గుండాల మండల కేంద్రంలో భార్య చేతిలో భర్త హత్యకు గురైన ఘటన తీవ్ర సంచలనం రేపింది. నిద్రలో ఉన్న భర్తపై సుత్తితో దాడిచేసి హతమార్చిన అనంతరం భార్య స్వయంగా పోలీసులకు లొంగిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండాల మండల కేంద్రానికి చెందిన మాదరబోయిన భిక్షం(64) శనివారం అర్ధరాత్రి సమయంలో తన నివాసంలో నిద్రిస్తున్నాడు. అదే సమయంలో ఆయన భార్య మాదరబోయిన ఉపేంద్ర సుత్తితో భిక్షం తలపై బలంగా దాడి చేసింది. తీవ్రగాయాల కారణంగా భిక్షం అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం ఉపేంద్ర గుం డాల పోలీస్‌స్టేషన్ ఎదుట నిలబడి ఉండగా, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఆమెను గమనించి విచారించారు. విచారణలో ఆమె తన భర్తను హతమార్చినట్లు ఒప్పు కోవడంతో వెంటనే అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సమా చారం అందుకున్న వెంటనే క్లూస్ టీం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై యాదగిరిగుట్ట డిఎస్‌పి శ్రీనివాస్‌నాయుడు, ఆత్మకూరు సీఐ హనుమంతు, గుండాల ఎస్సై తేజంరెడ్డి, యాదగిరిగుట్ట ఎస్సై రూపశ్రీ సంఘటన స్థలాన్ని పరిశీ లించి వివరాలు సేకరించారు. స్థానికులను విచారించి ఘటనకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. గ్రామస్తుల సమాచారం మేరకు, ఉపేంద్ర మాన సికస్థితి కొంతకాలంగా సరిగాలేదని తెలిసింది. అయితే కుటుంబ వివా దాలు లేదా ఇతర కారణాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసా గిస్తున్నా రు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

BAJAJ FINANCE

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ అక్షస్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in


(10-04-26) ఆర్మూర్ - అంబేద్కర్ చౌరాస్తా: PB56SGL16573422, 16703485, 16747200. బాన్సువాడ - బస్ స్టాండ్: PCV9SGL16187921, 16454449, 16620259. భద్రాచలం - ఆర్‌టిసి బస్ స్టాండ్: PEK5SGL16651066, 16689601, 16728381. భైంసా - నిర్మల్ రోడ్; PPA4SGL16348418, 16433264, 16448363, 16506551, 16497289, 16496205, 16498528, 16704863, 16725115. భోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL16393036, 16575697, 16706251, 16717766, 16725415. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL16262438, 16523417, 16594173, 16601898, 16707017. (13-04-26) గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL15072223, 15403966, 16378827, 16519241, 16523673, 16526615, 16592279, 16618200, 16644636, 16716732. గోదావరిఖని - కల్యాణ్ నగర్; PEK6SGL16528780. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL16325893, 16503869, 16553761, 16686028. హుస్నాబాద్ - అక్కన్నపేట్ చౌరస్తా; PCW5SGL16622688. హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PJH1SGL16525298. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL16695893. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; P86QSGL15121541, 16190316, 16471015, 16533996, 16591495. కరీంనగర్ - సీపీఆర్ఎస్ రోడ్; PCW8SGL16203264. (14-04-26) ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL16192498, 16326111, 16566334, 16591865, 16622626, 16617835, 16641450. ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL16345435, 16442558, 16626580, 16730533. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL16643183. కోరుట్ల - బీజీఎల్; PNU4SGL16578678, 16577915. కోస్గి - శివాజి చౌక్; PJH6SGL16525484. మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరాస్తా; PMJ9SGL16414131. (15-04-26): మహబూబ్‌నగర్ - జడ్చెర్ల; POI2SGL16367733. మనుగూరు - అశోక్ నగర్; PCX1SGL16172779, 16189988, 16745722. మెదక్ - టిఎల్ బ్రాంహ్యాక్ స్ట్రీట్; PCX2SGL15222096, 16644507. మెట్‌పల్లి - మైన్ రోడ్; PEF7SGL15237909, 15372409, 15531492, 16238884, 16230995, 16496093, 16504545, 16621549, 16700513. మిర్యాలగూడ - బీజీఎల్; PNT9SGL16237155, 16319516, 16443128, 16467279, 16649154, 16679851, 16703145. ములుగు - గాంధీ చౌక్; PJV5SGL15417730, 15474988, 16303105, 16372632, 16500197, 16550006, 16568216, 16565934, 16617828, 16723665. (16-04-26) నాగర్‌కర్నూల్ - బీజీఎల్; PNY5SGL16389718, 16477200, 16616151. నల్గొండ - ఆర్‌పీ రోడ్; PNT8SGL16212677, 16496169, 16741474. నారాయణ్‌పేట్ - సర్వీరెడ్డి చౌరాస్తా; PJH5SGL16704567. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PCX3SGL16230765, 16688089. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL16326546, 16446207, 16624342, 16652918, 16699300, 16704072. నిజామాబాద్ - వినాయక్ నగర్; PCX5SGL16216450, 16465251. (17-04-26) పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL15301176, 15348863, 16266947, 16286274. పటాన్‌చెరు - బీజీఎల్; PY29SGL14020987, 16545088, 16615434, 16676281, 16717137. పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL15065402, 16167308, 16211843, 16242236, 16318779, 16327245, 16338390. సదాశివపేట్ - రాచయ్య నగర్; PCX6SGL16368223, 16392171. సహద్‌నగర్ - వెంకటేశ్వర కాలోని; PCX7SGL15216231, 16530958. సంగారెడ్డి - బీజీఎల్; POA5SGL16723438, 16727895. (18-04-26): సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL16704250. సిద్ధిపేట - మెదక్ రోడ్; PGM8SGL16521203, 16619658. సిరిసిల్ల - మెయిన్ రోడ్; PB66SGL16371640, 16424188, 16478528, 16503647, 16591323, 16595642, 16742361. సూర్యాపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL15217849, 15547330, 16264062, 16378234, 16430578, 16498294, 16569873, 16703968. తాండూర్ - ఇందిరా చౌక్; PDA6SGL15236925, 16276123, 16464939, 16741448, 16747606. (20-04-26) తూప్రాన్ - రామాయమ్‌పేట్ రోడ్; PJT5SGL15457673, 15518152, 16465188. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL16745640. వరంగల్ - కెయు క్రాస్ రోడ్; PGP7SGL16649002. వరంగల్ - స్టేషన్ రోడ్; P04ISGL16412326, 16500368, 16501846. వరంగల్ - సూబేదారి; PB55SGL16369600, 16530222. యెల్లందు - బుగ్గవాగు; PGC4SGL15250099, 15347896.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఇతరులను పరిహాసం చేయవద్దు,
నిన్ను పరిహాసించడానికి అవకాశం ఇవ్వవొద్దు.
-సోక్రటీస్

# విద్యాలయాల్లో 'బోగస్' నీలినీడలు

'అన్నీ ఉన్నాయనుకున్న చోట ఏదో తనం' లేదన్న విషయాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆలస్యంగానైనా గుర్తించినట్లుంది. దేశంలోని 12 రాష్ట్రాలలో 30బోగస్ విశ్వవిద్యాలయాలను గుర్తించారు. దేశవ్యాప్తంగా లోపభూయిష్టమైన విద్యావిధానం, బోధనా పద్ధతులపై సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. విద్యపై బడ్జెట్‌లో సరిపడా నిధులు ఉన్నా లేకపోయినా విద్య గురించి ఎన్నో సెమినార్లు, అడ్వయిజరీ కౌన్సిళ్లు ఉండనే ఉన్నాయి. కానీ యుజిసి అనుమతులతో బడా విశ్వవిద్యాలయాల జాబితాలోకి ఎన్నో బోగస్ వర్సిటీలు చొచ్చుకు వచ్చేస్తున్నాయి. నిత్యం ఆయా విశ్వవిద్యాలయాలు దాని అనుబంధ కళాశాలలకు తాము ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని యుజిసి స్పష్టం చేస్తోంది. కాగా విశ్వవిద్యాయాల అధికారాలు మాత్రం వాటిపై చర్చలుతీసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా విశ్వవిద్యాలయాల నిర్వహణలో ఎన్ని లోపాలున్నా వాటిని ఎవరో ఒకరు ఫిర్యాదులు చేస్తే తప్ప వాటిపై తనిఖీలు, నిఘా ఉంచడాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత విద్యా విధానం గురించి కన్నాతొలుత ఆలోచించాల్సింది ప్రభుత్వాలే. కానీ వారాపని చేయడానికి ఏళ్లాపూళ్లు గడిచిపోతాయి. ఢిల్లీ,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలాంటి బోగస్ వర్సిటీలు ఎక్కువగా దొరికిపోతున్నాయి. విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు ఒక వంతైతే ఆ తరువాత విద్యాబోధనా కార్యక్రమాల స్థాయి బోధనాంశాలు, వాటిని బోధించే వారి టీచింగ్‌సత్తాపై కూడా దృష్టి సారించాల్సింది యుజిసియే. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు అన్నిటికి యుజిసి ప్రణాళికలను అమలు చేయాల్సిన బాధ్యత ఉంది. ఆ సంస్థ సూచిస్తున్న విధంగా విద్యా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. కానీ వాటి విషయం గూర్చి ఆలోచించడం మాని యాజమాన్యాలు తమ ఖర్చులు మిగుల్చుకునే ధోరణిలో పక్కన పెడతారు. అదేమీ వ్యయకర్తనం కాదు. ధనలబ్ధి కోసమే. యుజిసి తాజాప్రయత్నంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కొన్ని సలహాలు ఇస్తోంది. ఉన్నత విద్యాసంస్థల్లో కొన్ని బోగస్ విద్యాసంస్థలున్నాయని అవి అందించే పట్టాలకు గుర్తింపు, విలువ లేవని చెబుతోంది. ఈకళాశాలల్లో చదివిన ఉద్యోగార్థుల పట్టాలు ఉద్యోగార్హతను ఇవ్వలేవని, ఉన్నత విద్యకు పనికి రావని హెచ్చరిస్తున్నాయి. ప్రజల్లో తమ విద్యావ్యాపార ప్రచారం విస్తృతంగా వెళ్లిపోయాక వాటిపట్ల ఆకర్షితులైన విద్యార్థులను ఆపడం చాలాకష్టం. విస్తృత ప్రచారం ద్వారా జనంలోకి వెళ్లినప్పుడే యుజిసి స్పష్టమైన ప్రకటన ఇవ్వకపోవడంతో కొందరు వాటిలో జానయ్యారు కూడా. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు విశ్వవిద్యాలయాల్లో పలువురు విద్యార్థులు జాయినయ్యారు. గత యేడాది కూడా ఈ రెండు విశ్వవిద్యాలయాలనుబోగస్‌గా ప్రకటించినా వారు ఈఏడాది సక్రమమైన గుర్తింపు తెచ్చుకోలేదు. దాంతో యుజిసి ఈసారికూడా వాటిని బోగస్‌గా ప్రకటించింది. అప్పటికే చేరిన విద్యార్థులు ఆచిక్కుల్లోంచి బయటపడడానికి నానా యాతన పడ్డారు. బోగస్ సంస్థలుగా గుర్తించిన ఆయా విశ్వవిద్యాలయాలు జారీ చేసే పట్టాలు చెల్లుబాటు కావు. వాటికి ఎలాంటి చట్టబద్ధత లేదు. ఇతర ఉపాధి,అధికారిక ప్రయోజనాలు ఈ పట్టాలతో పొందడం సాధ్యం కాదు. 12బోగస్ విశ్వవిద్యాలయాలున్న ప్రధానకేంద్రంగా ఢిల్లీ అగ్రస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఈ బాపతు విశ్వవిద్యాలయాలు నాలుగు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ,మహారాష్ట్ర,పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌లలో రెండేసి బోగస్ కళాశాలల చొప్పున యుజిసి గుర్తించింది. హర్యానా, అరుణాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాజస్థాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఇలాంటి విశ్వవిద్యాలయాలున్నాయి. ఆ వివరాలన్నిటినీ విద్యార్థులకు అందే విధంగా వెబ్‌సైట్‌లో ఉంచింది. తమ బిడ్డల భవిష్యత్‌ను తల్లిదండ్రులను మధ్యపెట్టే విధంగా గొప్ప గొప్ప పేర్లు , నినాదాలతో వారి విస్తృత ప్రచారం ఉంటుంది. కనుక ఎవరైనా వారిఉచ్చులో పడతారు. పైగా మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వంటి జాతి నేతల పేర్లతో బాగాఆకట్టుకునే విధంగా ఆయావిశ్వవిద్యాలయాల పేర్లుకూడా పెట్టుకున్నారు. బోగస్‌విద్యాలయాల్లో సరైన సౌకర్యాలుండవు. విద్యాప్రమాణాల పరిస్థితిఅంతే. నకిలీ సంస్థలపై కేసులు పెట్టాలనియూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశించింది. ఎంతో సురక్షితమైన భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు పేరొందిన విద్యాలయాల్లో చేరతారు. వాటి వెనుకనున్న విశ్వవిద్యాలయాలు విద్యాప్రమాణాలు ఏమేరకు ఉన్నాయి. విద్యాప్రమాణాలు లేకుండానే విద్యార్థులను ఆకట్టుకునే బోగస్ విశ్వవిద్యాలయాలపై యుజిసి నిరంతర నిఘాఅవసరముంది. ఈమధ్య యుజిసి ప్రమాణాలు ఉల్లంఘించిన విశ్వవిద్యాలయాలపై కఠినంగా వ్యవహరించి మూడుసంస్థల్లో కొత్తగా పిహెచ్‌డి విద్యార్థులను ఐదేళ్లపాటు చేర్చుకోకుండా నిషేధం విధించింది. అలాంటి కఠిననియంత్రణ నిబంధనలున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిరంతర నిఘావ్యవస్థను ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. విద్య జీవిత మార్గదర్శకంగాకాక కాలక్షేప వ్యవహారంగా ఎప్పుడు మారుతుందో అప్పుడే విద్యార్థుల్లో విద్యాసక్తి తగ్గిపోతుంది. అందుకే విద్యాప్రమాణాలు మెండుగా కలిగిన విశ్వవిద్యాలయాలనువాటి అనుబంధ కళాశాలలను ఉత్తమ విద్యాలయాలుగా తీర్చిదిద్దే దిశగామరిన్ని మార్గదర్శకాలను రూపొందించాల్సిన ఆవశ్యకతఉంది. ప్రాంతీయ పర్యవేక్షణ కేంద్రాలు చైతన్యవంతంగా వ్యవహరిస్తే బోగస్‌విద్యాసంస్థలకు తావుండదు.



మన మంచి గుణాలను మనం మరచిపోవచ్చు. కానీ దేవుడు మాత్రం మరవడు. మన మనసు వక్రమైతే ఈ విశాల విశ్వమంతా వక్రమే.
షేక్స్పియర్



సరిగా వినియోగించుకుంటే పుస్తకాలంత మంచివి ఏవీ లేవు. సరిగా వినియోగించు కోకపోతే వాటంత నిరుపయోగమైనవి లేవు.
స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## వ్యవస్థలు భ్రష్టుపడితే అంతర్యుద్ధం తప్పదు

ఎనిమిదో వతరగతి సాంఘికశాస్త్రంలో "న్యాయవ్యవస్థలో అవినీతి' అనేపాఠాన్ని చేర్చినందుకు ఎన్‌సిఆఆర్‌టి మీద సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ గారి అవేదన అర్థమైంది. ఈరోజు అన్నివ్యవస్థల కంటే ఒక్క న్యాయవ్యవస్థే కొంతమెరుగ్గావుంది. అలాంటి న్యాయవ్యస్థమీద న్యాయవ్యవస్థలో అవినీతిఅనివ్రాయటం ఎన్‌సిఆఆర్‌టి తొందరపాటు చర్య అనిఅనుకోవచ్చు. న్యాయవ్యవస్థలో కూడా కొన్ని లోపాలు ఉన్నమాట వాస్తవమే! చరిత్రను తొలగించి పుక్కిటిపురాణాలను పాఠ్యాంశాలుగా కేంద్రం ప్రవేశపెడుతుంది. అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ అన్ని విషయాలపై అలోచించాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## పేదరికం లేని రాష్ట్రం

కేరళరాష్ట్రం దుర్భర పేదరికంలేని రాష్ట్రంగా మారడంలో సమిష్టి కృషి ఫలితం మరియు వికేంద్రీకృత ప్రణాళికలు రూపకల్పన ఉంది ముందు ప్రమాణాలు సెట్ చేసి ఆ ప్రమాణాలుఅందుకోలేని కుటుంబాలనుగుర్తించి ఆ ప్రమాణాలను అందుకోలేని కుటుంబాలను గుర్తించి కనీస అవసరాలు అందుకోలేని కుటుంబాలను ఫోకస్ చేసి వాళ్లకు ప్రభుత్వ పరమయిన సహాయం అందేలా చేయడం ఒక చేయడం మూలంగ జీవన ప్రమాణ స్థాయిని అందుకునేల చేశారు తద్వారా పేదరికం స్థాయిలను తగ్గించుకుంటు వచ్చి పేదరికం లేకుండా చేశారు.

- భారత అవినాష్, జనగామ

## ఆలోచించాల్సిందే..

పాలన ఎంత బాగా చేసినా ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించినాకొంతకాలానికి ప్రభుత్వాలపై వ్యతిరేకత రావటం సహజం. ప్రజావ్యతిరేకత కారణంతోనే రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారుతుంటాయి. అయితే ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలోనే ఇలా జరుగుతోందని కాని బిజెపి పాలిత రాష్ట్రాలలో కాదు. ఇదంతా చూస్తుంటేఎక్కడోఏదోజరుగుతోందని అనిపిస్తోంది. ప్రభుత్వాలపై వ్యతిరేకత వచ్చినా పాలకులు పట్టించుకోకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

- ఎమ్. జగన్నాథం, హైదరాబాద్

## స్త్రీ శక్తిపథకం అమలు

ఇటీవల ఏపిలోఅమలైన స్త్రీశక్తి పథకంవల్ల ఆర్‌టిసిలో మహిళల ప్రయాణాలు బాగా పెరిగాయని, సిబ్బంది హెచ్చు ట్రాఫిక్‌తో విధులు భాధ్యత, అంకితభావంతో చేశారని,ఆదాయం వారికి బాగా పెరిగిందని ప్రభుత్వం అభినందనలు తెలియజేశారు. మహిళా ప్రయాణాల ద్వారా వారి వ్యక్తిగత సాధికారత, సగటు ఆదాయం పెరిగినట్లు, ఇతర మార్పులు ప్రకటించారు. ఐతే బస్సులకొరతను తీర్చేందుకు కొత్తగా రాష్ట్రానికి విద్యుత్ బస్సులు త్వరలో వస్తున్నాయని, ఆ కొరత ప్రజల అన్ని మార్గాలకు తృప్తి చేస్తుందని శుభవార్త తెలిసినది. ఐతే ఆ బస్సులను ప్రైవేటుగా వేరే సంస్థ నుండి కొనుగోలు చేయడం సహజమే.గానీ వాటి నిర్వహణకు డిపోలలోని స్థలాలనుఅప్పగించి పూర్తి నిర్వహణకు సొంతసిబ్బందిని శిక్షణఇచ్చి ఇప్పటి వారి అనుభవాన్ని తీసుకొని ఉపయోగిస్తే నూతన బస్సుల వినియోయం విజయవంతం అవుతుంది.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## పూర్వ వైభవం రావాలి

ఒకనాడు తెలుగునాట పాడి పంటలు వెల్లివిరిసేయి. గ్రామాలలో నిత్యం పాలు,నెయ్యి, తేనెలు పుష్కలంగా లభించేవి. నదులలో నీరు నిండుగా ప్రవహించేవి. ఎప్పుడూ సరిసంపదలతో విలసిల్లుతూ లలితకళలు నాట్యమాడేవి. శాతవాహన, ఇక్ష్వాక, కాకతీయ, విజయనగర సామ్రాజాల కాలంలో తెలుగుతేజం వెలుగొంది అనంత కీర్తిని ఆర్జించింది. ఆనాటి సిరిసంపదలను తిరిగి తెలుగు రాష్ట్రాలుసాధించాలి. ప్రజాజీవితాన్ని సౌభాగ్యవంతం చేయాలి. అప్పటి తెలుగభాషను, కళాప్రాభవాన్ని పున: ప్రతిష్టించాలి. ఆ లక్ష్యసాధన కోసం రెండు తెలుగు రాష్ట్రాలు సహకరించుకుంటూ ముందుకు సాగితే పూర్వ వైభవం తథ్యం.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

## వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలుఅప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి. అప్పుడే శాంతియుత స్వతంత్ర దేశంగా ఉంటుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నైపుణ్యత మెరుగుపడిన భారత్ దౌత్యనీతి

**నిన్నగాక మొన్న ఇజ్రాయిల్‌లో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ పార్లమెంట్ బలమైన దేశం, ప్రత్యే కత కలిగిన దేశంగా ఇండియాను అభివర్ణించటం పైపై పొగడ్తలుగా తీసుకోవాల్సిన అవసరం లేదు. నిజాయితీగా భారత్ ప్రత్యేకతను గుర్తించడం వల్లే ఇజ్రాయిల్ మరింతగా భారత్‌కు దగ్గర కావాలని ప్రయత్నిస్తున్న మాట నిజం. ఇండియా పట్ల చైనా వైఖరిలో మార్పు కనపడుతున్నా,అను కూల శత్రువుగానే ప్రస్తుతం భావించక తప్పదు. బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం ఇండియాకు స్నేహహస్తం చాచింది. పాకి స్థాన్ రాజకీయంగా క్షీణిస్తున్న పరిస్థితులను అధిగమించలేక పోతున్నది. అందుకనే భారత్ సహజ రీతిలో ప్రతిభతో నాయకత్వ పటిమను కాపాడుకుంటూ ఆర్థిక ఎదుగుదలను చేజారినివ్వకుండా, అంతర్గత పరిస్థితులనుచక్కదిద్దుకుంటూ వ్యవహార దక్షతను ప్రదర్శించినప్పుడే దటీజ్ భారత్ అన్న ప్రత్యేకతను కాపాడుకోగలదు.**



రావులపాటి సీతారాం రావు

డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ సమస్య ఇంకా సర్దుబాటు కాలేదు. కారణం అక్కడి సుప్రీంకోర్టు మెజార్టీ ఓటుతో ట్రంప్ హెచ్చు సుంకాల విధింపును రద్దు చేసింది. ప్రభుత్వాధికారులు విభజనకు లోనవుతే ముఖ్యమైన మూడు లెజిస్లేచర్, జ్యుడిషియరీ, అధికార యంత్రాంగం ఎవరి పని వారు చేయక తప్పదు. అందుకే ట్రంప్ సుంకాల పెంపును నిర్ణయిస్తే జ్యుడిషియరీ కుదరదు పొమ్మన్నది! అంతటి స్వతంత్ర నిర్ణయాలు ఇతర దేశాల్లో ప్రభుత్వాలు తీసుకోవడం కష్టం. సర్దుబాట్లే ఎక్కువ.మొదటి నుంచీ అమెరికా 'డివిజన్ ఆఫ్ పవర్స్'ను రాజ్యాంగపరంగా ఏర్పరుచుకొని ఫెడరల్ వ్యవస్థను నడుపుతున్నది. రాష్ట్రాలు కొంత మేర స్వయంప్రతిపత్తితోనే వ్యవహరిస్తాయి. ఫెడరల్ వ్యవస్థ 'టాజ్'గా ఏర్పడినదవటం వల్ల ఒక్కొకప్పుడు రాష్ట్రాలూ, గవర్నర్లు, సెనేట్, జ్యుడిషియరీ స్వతంత్రంగా అవసరమైతే అధ్యక్షుడికి వ్యతిరేకంగా కూడా నిర్ణయాలు తీసుకోనేందుకు వెనకాడవు. సుప్రీంకోర్టు నిర్ణయం డోనాల్డ్ ట్రంప్‌విదేశాంగ విధానానికి గట్టిదెబ్బగా మారింది. ప్రెసిడెంట్ ఇంటర్‌నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్‌ను (ఐఇఇపిఎ) వినియోగించి సుంకాలను ఇతర దేశాల మీద హెచ్చురీతిలో వేయటం చట్టానికి వ్యతిరేకమని కొట్టివేయడం ట్రంప్ నాటకీయ నిర్ణయాలకు, నాటకీయంగానే చెక్ పెట్టినట్లుఅయింది. ట్రంప్ నియమించిన చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ మరో ఇద్దరు మాత్రం మెజార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కాంగ్రెషనల్ ఆథరైజేషన్ లేకుండా ప్రెసిడెంట్ ట్రంప్ అసాధారణ రీతిలో అన్‌లిమిటెడ్ ఎమోంట్, కాలపరిమితిని పట్టించుకోకుండా ఈ సుంకాలను వేయటం సరికాదని తేల్చి చెప్పిజ్యుడిషియరీ తన ప్రత్యేకతను చాటుకుంది. మరొక ముఖ్యమైన అంశాన్ని కూడా సుప్రీంకోర్టు తన ఆర్డర్‌లో పొందుపర్చటం గమనించదగ్గ విషయంగా అందరూ భావిస్తున్నారు. ఐఇఇపిఎకి సంబంధించినంతవరకు ఎగ్జిక్యూటివ్ (అంటే ఒక విధంగా ప్రెసిడెంట్) టారిఫ్స్‌ను కానీ డ్యూటీస్‌ను కానీ రెగ్యులేట్ చేసే స్టాట్యూతోను గుర్తించలేదని, అందువల్ల టాక్సేషన్‌ను ఆథరైజ్ చేసే విధానం ఉన్నట్లు చట్టంలో ఎత్తి చూపలేదని కూడా తమ ఆర్డర్‌లోపేర్కొంది. ఇంతవరకూ ఏ అధ్యక్షుడూ ఈ విధానాన్ని అమలు పర్చిన దాఖలాలు లేకపోవడంతో పాటు సాక్ష్యాధారాలు ఏవీ తమ దృష్టికి రాకపోవటంతో అధ్యక్షుడి నిర్ణయాన్ని రద్దు చేస్తున్నామని స్పష్టంగా సుప్రీం పేర్కొంది. యధావిధిగా ప్రెసిడెంట్ కోపంతో ఊగిపోతూ సుప్రీం ఆర్డర్‌ను దాదాపు త్రోసివేసాడు. గ్లోబల్ టారిఫ్‌ను మొదట 15 శాతానికి పెంచుతున్నానని, అటు తర్వాత 10శాతం వరకు వైట్‌హౌస్‌కు ఉన్న అధికారాల మేర (122 సెక్షన్, ట్రేడ్ యాక్ట్ 1974) పెంచుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు చేయడం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న ధోరణిని గుర్తు చేసినట్లయింది. అయితే ఈ రూలింగ్ ముందుముందు అనేక ఛాలెంజిలకు జ్యుడిషియల్ రివ్యూకు గురికాక తప్పకపోవచ్చు. భారతదేశం మీద సుప్రీం కోర్టు నిర్ణయం ట్రంప్ 15శాతం టారిఫ్ విధింపు, అంతకు ముందే భారత్‌తో చేసుకున్న ఇంటరిమ్ అగ్రిమెంట్ లాంటివి ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయో ఎవరికీ అంతుపట్టడం లేదు. ట్రంప్ నిముషానికొక మాట అనటం ఇండియాతో చేసుకున్న నిర్ణయంపై ఎలాంటి ప్రభావం ఉండదని చెప్పటం రష్యా, దగ్గర నుంచి ఆయిల్ దిగుమతి చేసుకోకూడదని స్పష్టంగా చెప్పటం ఎన్నో మరెన్నో చిక్కుముడులను విప్పాల్సిన పరిస్థితి భారత్‌కు ఎదురయింది. ఈ పరిణామాలు నిశితంగా పరిశీలిస్తున్న భారత్ ప్రభుత్వం ప్రధాని మోడీ బహుశా ఈ అనిశ్చిత పరిస్థితిని దాటటానికి ఇజ్రాయిల్, కెనడా, లాంటి మరికొన్ని దేశాలతో సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుకోవటంతో పాటు ఆర్థిక స్థితిగతులను, మిలటరీ పరంగా ఆయుధసంపత్తిని, మన ఎగుమతులు పెంపొందించుకొని వాణిజ్యపరంగా బలోపేతం కావడానికి రాజకీయంగా విమర్శలూ అవరోధాలను అధిగమిస్తూ సాహసోపేత నిర్ణయాలకు సిద్ధమవుతున్న సూచనలు కనపడుతున్నాయి. అమెరికా, రష్యాలు ఒకప్పుడు ప్రపంచ దేశాలను ఏలాయి. రెండూ బలమైన దేశాలు. కొన్ని దేశాలను తమ వైపు మరల్చుకొని నాటో లాంటి కూటములు ఏర్పరుచుకొని, అణ్వాయుధ ఉత్పత్తులతోసహా తాము చెప్పిందే వినాలనే రీతిలో వ్యవహరించటం జరిగింది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. సోవియట్ రష్యా రిపబ్లిక్ చీలిపోయింది. అప్పటి యుస్.యస్.యస్.ఆర్ ఇప్పుడు రష్యాగా ఉంది. కానీ ఆనాటి బలం ఇప్పటి రష్యాకు లోపించింది. యూనియన్ నుంచి చీలిన ఉక్రెయిన్‌గుడా సమవుజ్జీనన్న ధోరణిలో అమెరికా అండదండలతో రష్యాకు తలనొప్పులు తెచ్చిపెట్టున్నది. ఇరాన్ లాంటి దేశం అమెరికా బెదరింపులకు లొంగకుండా సై అంటే సై అనటంతో అమెరికా ప్రస్తుత బలమేమిటలో ఎవరూ సరియైన అంచనాలు వేయలేకపోతున్నారు. చివరకు రష్యా కూడా అప్పుడప్పుడు అమెరికాతో సత్సంబంధాలు ఏర్పరుచుకొనే పరిస్థితిని చవిచూస్తున్నది. రష్యా, అమెరికా, ఉక్రెయిన్ లాంటి దేశాలు చమురు మీద, గనుల మీద ఆధిపత్యం సంపాదించుకొని గ్లోబల్ వ్యవస్థను శాసించే ప్రయత్నంలో ఉన్నాయి. ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య పోరు ఇప్పట్లో తెగే సూచనలు కన్పడటం లేదు.



ట్రంప్ తానే సంధి కుదురుస్తున్నానని చెబుతున్నాడు. కానీ యుద్ధ విరమణ, కాల్పుల విరమణ నిర్ణయాలు ఎప్పుడూ ఏవిధంగా సమాప్తమై, మళ్లీ యుద్ధవాతావరణ ప్రజ్వలిస్తుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి వాతావరణంలో భారత్ మాత్రం గుంభనగా ఉంటూ, అవసరమనుకున్నప్పుడు అన్నిదేశాలతో సామరస్య ధోరణితో వ్యవహరిస్తూ స్నేహవాతావరణాన్ని చెడగొట్టుకోవటం లేదు. ప్రధాని మోడీ, ఇజ్రాయెల్ పర్యటన ఒక విధంగా బలమైన దేశాల కళ్లు తెరిపించింది. ఇజ్రాయెల్ చిన్న దేశమైనా సాంకేతికంగా, ఆధునిక యుద్ధ శైలిని ఆయుధ సంపత్తిని సమకూర్చుకొని సమయం వచ్చినప్పుడు వెరవకుండా సంఘర్షణలలో పై చేయి తనదే అని నిరూపించుకుంటున్నది. యూరప్ దేశాలు ఇదివరకటి మాదిరి అమెరికాను గుడ్డిగా నమ్మటం లేదన్న భావనను కలిగిస్తున్నట్లు దౌత్య నిపుణులు భావిస్తున్నారు. వెస్ట్‌ఏషియా, సౌత్ ఏషియా, గల్ఫ్ దేశాలు, రాజకీయంగా ఎలాంటి ఛాలెంజినైనా ఎదుర్కోగలం అన్న నమ్మకంతో ఈ మధ్యకాలంలో వ్యవహరిస్తున్నారు. అరబ్ దేశాల వైఖరిలో మార్పు అంచనా వేయటం కష్టంకానీ, స్వతంత్ర ప్రతిపత్తితో ఏ బలమైన దేశం వెనక తోకలా ఉండకుండా వ్యవహరించే దిశగా క్రమంగా బలోపేతమవుతున్నాయన్న అంచనాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు, భారతదేశం పొరుగు దేశాలతో సఖ్యతను కాపాడుకోవటం కోసం అహర్నిశలు ప్రయత్నిస్తూ గౌరవప్రదంగా దౌత్య విధానాలను ఆచరిస్తున్నదన్న నమ్మకం దాదాపు అన్ని దేశాలలో కలుగుతున్నది. నిన్నగాక మొన్న ఇజ్రాయెల్‌లో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ పార్లమెంట్ బలమైన దేశం, ప్రత్యేకత కలిగిన దేశంగా ఇండియాను అభివర్ణించటం పైపై పొగడ్తలుగా తీసుకోవాల్సిన అవసరం లేదు. నిజాయితీగా భారత్ ప్రత్యేకతను గుర్తించడం వల్లే ఇజ్రాయెల్ మరింతగా భారత్‌కు దగ్గర కావాలని ప్రయత్నిస్తున్న మాట నిజం. ఇండియా పట్ల చైనా వైఖరిలో మార్పు కనపడుతున్నా,అనుకూల శత్రువుగానే ప్రస్తుతం భావించక తప్పదు. బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం ఇండియాకు స్నేహహస్తం చాచింది. పాకిస్థాన్ రాజకీయంగా క్షీణిస్తున్న పరిస్థితులను అధిగమించలేక పోతున్నది. అందుకనే భారత్ సహజ రీతిలో ప్రతిభతో నాయకత్వ పటిమను కాపాడుకుంటూ ఆర్థిక ఎదుగుదలను చేజారినివ్వకుండా, అంతర్గత పరిస్థితులనుచక్కదిద్దుకుంటూ వ్యవహార దక్షతను ప్రదర్శించినప్పుడే దటీజ్ భారత్ అన్న ప్రత్యేకతను కాపాడుకోగలదు. ●

# మాటల్లో కాదు..చేతల్లో చూపాలి!

డా.పోలం సైదులు

రైతులను వెంటాడుతున్న సమస్య పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం.పంట పండించడానికి వేల రూపాయలు ఖర్చు పెట్టినా,మార్కెట్‌లో ఆ ఖర్చులకు సరిపడే ధర కూడా దక్కడం లేదు. ప్రభుత్వం మద్దతుధర ప్రకటించినా,చాలాచోట్ల ఆధరకు కొనుగోలు జరగడం లేదు. దళారులు, మధ్యవర్తుల చేతుల్లో రైతు మోసపోతున్నాడు. ఇక సాగు ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయి.కానీ పంటధరలు మాత్రం అదేస్థాయిలో ఉన్నాయి.పెట్టుబడి పెరిగి లాభంతగ్గడంతో వ్యవసాయం రైతుకు భారంగామారి మరింత ఇబ్బందుల్లోకి నెట్టి అప్పులపాలు చేస్తుంది. బ్యాంకుల నుంచి రుణాలు సమయానికి దొరకక, ప్రైవేట్ వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లాల్సివస్తోంది. అధికవడ్డీలతో అప్పులు తీరని పరిస్థితి ఏర్పడుతోంది. పంటనష్టమైతే ఆ అప్పుల భారమే రైతుకుటుంబాన్ని మరింత కుంగదీస్తోందని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే వాతావరణమార్పులు కూడా రైతుకు పెద్దసవాల్‌గా మారాయి. అకాల వర్షాలు, వరదలు, కరువులు పంటలను నాశనం చేస్తున్నాయి. పంట బీమా ఉన్నా, నష్టపరిహారం ఆలస్యం కావడం లేదా పూర్తిగా అందకపోవడం వల్ల రైతుకు ఆశ్రయం లేకుండాపోతోంది. చాలా ప్రాంతాల్లో గ్రామాల నుంచి ప్రజలు వలస వెళ్లడంతో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడింది. కూలీలు దొరకకపోవడం, కూలీ ఖర్చులు పెరగడం వల్ల రైతుకు మరింత భారమవుతోంది. యాంత్రీకరణ ఉన్నా, చిన్న రైతులకు అది అందుబాటులో లేదు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా రైతు ఆవేదన మాత్రం అలాగే ఉంది. వ్యవసాయరంగంలో మౌలిక మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్న మాటలు చెబుతున్నప్పటికి అవి అమల్లోకి రావడంలేదు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందంటారు. కానీ అదే యువతనేడు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. చదువుకున్నా ఉపాధి దొరకని పరిస్థితి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగం దొరికినా భద్రతలేని స్థితి యువతను ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. విద్యావ్యవస్థలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల లేమి, నాణ్యత తగ్గడం యువతను ప్రైవేట్ విద్యవైపు నెట్టేస్తోంది. కానీ ప్రైవేట్ విద్య ఖర్చులు సామాన్య కుటుంబాలకు అందని స్థాయిలో ఉన్నాయి. ఫలితంగా విద్యేయువతకు భారంగా మారుతోంది. డిగ్రీలు, పీజీలు,పీహెచ్డీలు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్ల ఆలస్యం కావడంవల్ల యువత ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ నిరీక్షణ కాలంలో వయసు పరిమితులు, మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాలు పెరుగుతున్నాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగం దొరికినా తక్కువ జీతాలు, భద్రతలేని పని పరిస్థితులు యువతను నిరుత్సాహ పరుస్తున్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పెరిగిపోవడంతో ఉద్యోగ స్థిరత్వం తగ్గుతోంది. పనిగంటలు ఎక్కువగా ఉండటం,వేతనం తక్కువగా ఉండటం వల్ల జీవన భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇవన్నీ కలిసి యువతలో మానసిక ఒత్తిడి పెరగడానికి కారణమవుతున్నాయి. నిరుద్యోగం, పోటీ, కుటుంబఒత్తిళ్లు యువతను ఆత్మవిశ్వాసం కోల్పోయేలా చేస్తున్నాయి. కొందరిలో డిప్రెషన్, నిరాశ పెరుగుతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే విద్య, ఉద్యోగ విధానాల్లో సమగ్ర మార్పులు అవసరం. నాణ్యమైన ప్రభుత్వవిద్య, సమయానికి ఉద్యోగ నియామకాలు,పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ,యువతకు భద్రత కలిగించే ఉద్యోగ విధానాలు అమలవ్వాలి. మాటలకే పరిమితమవకుండా కార్యాచరణ జరిగితేనే యువత ఆశలు నిలబడతాయి. ఆరోగ్యం, విద్య వంటి మౌలికరంగాలు సైతంక్రమంగా వ్యాపారాలుగా మారడంతో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు బలహీనపడుతుండగా, ప్రైవేట్ సంస్థలు లాభాలపై దృష్టి పెట్టుతున్నాయి. ఉదాహరణకు ఒక పట్టణ కేంద్రాన్ని తీసుకుంటే పదుల సంఖ్యలో కార్పొరేట్ పాఠశాలలు, దవాఖానాలు దర్శనమిస్తాయి. కానీ ఉన్న ప్రభుత్వ సంస్థలలో అరకొర వసతులుండటం అందరికి సుపరిచితమే. పేద, మధ్యతరగతి కుటుంబాలు చిన్న అనారోగ్యానికి కూడా భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది సంక్షేమ పాలనకు విరుద్ధమని గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ప్రజాస్వామిక దేశంలో ఇంకా రాజకీయాల్లో అధికార కేంద్రీకరణ పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కేంద్రంగా ఉండాలి. కానీ వాస్తవంలో నిర్ణయాలు తీసుకునేఅధికారం కొద్దిమందికే పరిమితం అవుతున్నాయన్న భావన పెరుగుతోంది.రాష్ట్రంగానీ,దేశం గానీముందుకు వెళ్లాలంటే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలి.ప్రభుత్వ విధానాలు ప్రజల అవసరాలపై ఆధారపడి ఉండాలి.అలాగే పాలకులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ●

# మేల్కొనకుంటే మానవ మనుగడకు ముప్పే!

మహమ్మద్ ఆరిఫ్

వేసవి రాకముందే మధ్యాహ్నం వేళల్లో వేడి పెరుగుతున్నది. దీంతో మార్చి తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోయాయి. గతేడాది వేసవిలో ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర సహాపలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 50డిగ్రీల మార్కును దాటి రికార్డులు సృష్టించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ వడగాల్పులు పదుల సంఖ్యలో ప్రాణాలను బలి తీసుకున్నాయి. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వల్లే ఈ స్థాయిలో భూతాపం పెరుగుతున్నదని, ఇప్పటికైనా మానవ తప్పిదాలను సరిదిద్దుకోకపోతే 2070 నాటికి భూమిపై జీవరాశి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూమ్మీద రికార్డయిన అత్యధిక ఉష్ణోగ్రత 56.7 డిగ్రీలు. ఇది అమెరికాలోని కాలిఫోర్నియా డెత్ వ్యాలీలో 1913 జులై 10న రికార్డయింది. ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రికార్డయిన ఉష్ణోగ్రత దీనికి దగ్గరగా ఉన్నది. 2024 మే 29న ఢిల్లీలోని ఒక ప్రాంతంలో 52.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2016లో రాజస్థాన్లోని ఫలోడిలో 51 డిగ్రీలు, 2019లో రాజస్థాన్లోని చురూలో 50.8 డిగ్రీలు, 1956లో హర్యానాలోని సిర్సాలో 50.3 డిగ్రీలు భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు. మున్ముందు మరింత పెరిగే ప్రమాదం భారతదేశంలో సాధారణంగా వేసవి కాలమైన మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అయితే గ్లోబల్ వార్మింగ్ కారణంగా భారత్‌లో తీవ్రమైన హీట్ వేవ్‌లు తరచుగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి సగటు టెంపరేచర్ 15 డిగ్రీ సెంటీగ్రేడ్లు. కొన్ని దశాబ్దాలుగా ఇది క్రమంగా పెరుగుతున్నది. నాసా ప్రకారం భూమిపై సగటు ప్రపంచ ఉష్ణోగ్రత 1880 నుండి ఇప్పటివరకు కనీసం1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. మానవ శరీరం సాధారణ ఉష్ణోగ్రత 37.5 డిగ్రీల సెల్సియస్ వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా పని చేస్తుంది. బయట ఉష్ణోగ్రతలు పెరిగితే శరీరంపై ఒత్తిడి పెరుగుతుంది. రక్తనాళాలు ఎక్కువగా తెరుచుకుంటే బీపీ తగ్గుతుంది. దీనివల్ల గుండెపై భారం పెరుగుతుంది. శరీరానికి కావలసిన రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె వేగం పెరుగుతుంది. దీంతో సమస్యలు మొదలవుతాయి. రక్తపోటు బాగా తగ్గిపోతే, అవయవాలకు కావలసిన రక్తం చేరుకోదు. హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదముంటుంది. చెమటలు ఎక్కువగా పడితే శరీర సమతౌల్యం



దెబ్బతింటుంది. తీవ్రమైన ఎండలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడతారు. వడదెబ్బకు గురై ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఎండల తీవ్రతతో ఎక్కువగా నష్టపోతున్నది పేదలే. నిర్మాణ రంగంలో పనిచేసే వలస కూలీలు, దినసరి కార్మికులపై ఈ అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటున్నది. కార్మికులు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్,గ్రాసరీ ట్రాన్స్ పోర్ట్ చేసే ఉద్యోగులు పని చేయడం కష్టంగా మారడంతో వారి జీవనోపాధిపై ప్రభావం పడుతుంది. వడదెబ్బలతో ఉపాధి కూలీలు మృతి చెందుతున్న వార్తలను తరచూ వింటున్నాం. నేచర్ కమ్యూనికేషన్స్ నివేదిక ప్రకారం హీట్ కారణంగా భారతదేశం ప్రతీ ఏడాది 101 బిలియన్ డాలర్లు (రూ. 7,73,064 కోట్లు) కోల్పోతున్నది. ప్రపంచంలో ఇదే అత్యధికం. పెరుగుతున్న వేడి, ఉక్కపోత కారణంగా కోల్పోయిన శ్రమ గంటలు 2030 నాటికి సుమారు 2.54.5 జీడీపీని ప్రమాదంలో పడేస్తాయని 2020 మెకిన్సే నివేదిక పేర్కొంది. బయట పనిచేయడానికి సురక్షితం కాని పగటి పని గంటల సంఖ్య 2030 నాటికి సుమారు 15 శాతం పెరుగుతుందని ఈ నివేదిక తెలిపింది. వాతావరణ మార్పులకు ప్రధాన కారణం మానవ తప్పిదాలే అంటున్నారు శాస్త్రవేత్తలు. గ్లోబల్ వార్మింగ్‌కు 95శాతం మనుషులే ప్రధాన కారణమని ఒక నివేదిక చెప్పింది. బొగ్గు, పెట్రోలియం, నేచురల్ గ్యాస్ వంటివి అవసరానికి మించి వినియోగిస్తుండడంతో గ్రీన్‌హౌజ్ వాయువులు ఎక్కువగా విడుదల అవుతున్నాయని చెబుతున్నారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వల్ల విడుదలయ్యే రసాయనాలు ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. అంతేకాకుండా మనం వాడుతున్న కరెంటు ఎక్కువగాబొగ్గు, ఇంధనాన్ని మండించి తయారు చేస్తుండడంతో కార్బన్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సయిడ్‌లు గాలిలో కలుస్తున్నాయి.కార్బన్ డై ఆక్సయిడ్‌ను గ్రహించే అడవులు ప్రతి ఏడాది సుమారు 12 మిలియన్ హెక్టార్ల వరకు నాశనమవుతున్నాయి. కార్లు, ట్రక్కులు, ఓడలు, విమానాలు అధిక వాడకంతో కార్బన్ డై ఆక్సయిడ్ పెరుగుతున్నది. అంతేకాకుండా పంటలను పండించడానికి మితిమీరిన ఎరువులను వాడుతుండడం వల్ల మిథేన్ తోపాటు మరికొన్ని గ్రీన్‌హౌజ్ వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయి. వాతావరణ మార్పులపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ) 2023 మార్చిలో ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం మానవ కార్యకలాపాలు, గ్రీన్‌హౌజ్ వాయువులే గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. కర్బన ఉద్గారాలను తగ్గించలేకపోతే, భూతాపం అత్యంత వేగంగా పెరిగిపోయే ప్రమాదమున్నది అని పేర్కొన్నది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సయిడ్ లాంటి గ్రీన్‌హౌజ్ వాయువులు పెరగడం వల్లే టెంపరేచర్లు పెరిగిపోతాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే భూమిపై జీవుల మనుగడకూ ప్రమాదం తప్పదు. ●

# పశ్చిమాసియాతో భారత్ సుదీర్ఘ బంధం

## ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటనతో పటిష్టం



**భారత విదేశాంగ విధానం పశ్చిమాసియాతో ఎప్పుడూ సిద్ధాంత పరంగా కానీ, కఠినంగా కానీ లేదు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తితో పాటు ఆచరాణాత్మక జాతీయ శ్రేయస్సును దృష్టిలోకి తీసుకుని భారత్ అమలు చేసింది. ఇజ్రాయెల్, అరబ్, ఇరాన్ దేశాలతో ఇంధన భద్రత, వాణిజ్యం, భారత సంతతి సంక్షేమం, ఉగ్రవాదంపై పరస్పర సహకారం, సాంకేతికత ఆధునీకరణలపై దశాబ్దాలుగా సమన్వయంతో కూడిన సంబంధాలను భారత్ కొనసాగించింది.**

**న్యూఢిల్లీ, మార్చి 1:** ప్రధానిమోడీ ఇజ్రాయెల్ పర్యటన సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మైత్రీ బంధానికి చిహ్నంగానే కాకుండా పశ్చిమ ఆసియా పట్ల ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని గుర్తుచేసింది. భారత విదేశాంగ విధానం ఈ ప్రాంతంలో ఎప్పుడూ సిద్ధాంత పరంగా కానీ, కఠినంగా కానీ లేదు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తితోపాటు ఆచరాణాత్మక జాతీయ శ్రేయస్సును పరిగణనలోనికి తీసుకుని భారత్ అమలు చేసింది. ఇజ్రాయెల్, అరబ్, ఇరాన్‌దేశాలతో ఇంధన భద్రత, వాణిజ్యం, భారత సంతతి సంక్షేమం, ఉగ్రవాదంపై పరస్పర సహకారం, సాంకేతికత ఆధునీకరణలపై దశాబ్దాలుగా సమన్వయంతో కూడిన సంబంధాలను భారత్ కొనసాగించింది. పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగానే కాకుండా ఈ దేశాల సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా కూడా భారత్ ముందుకు సాగింది. 1992లో భారత్ ఇజ్రాయెల్ సంబంధాలకు పునాదులు పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి దౌత్యసంబంధాలను కొనసాగించింది. అప్పటి నుంచి రక్షణ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం కొనసాగుతూనే వస్తోంది. నిజానికి భారత్‌కు ఇజ్రాయెల్ కీలక రక్షణ భాగస్వామిగా కొనసాగుతోంది. వ్యవసాయం, జలవనరుల పర్యవేక్షణ, సైబర్ సెక్యూరిటీ, సృజనాత్మక రంగాల్లో మరింతగా ఈ సంబంధాలు విస్తరించాయి. ఇటీవలి కాలంలో ఈ సంబంధాలు మరిన్ని రంగాలకు విస్తరించాయి. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఈ సంబంధాలను మరింతగా ముందుకు తీసుకువెళ్లింది. పాలస్తీనా సమస్యతో భారత్ ఇజ్రాయెల్ సంబంధాలను సమన్వయంతో కొనసాగించింది. ఇజ్రాయెల్ తన సొంత వ్యూహంతోనే పాలస్తీనా సమస్యపై ముందుకు వెళ్లింది. ముఖ్యంగా పాలస్తీనా సమస్యపై రెండు దేశాల పరిష్కారంపై అప్రమత్తంగా వ్యవహరించింది. పాలస్తీనా ప్రత్యేక దేశ హోదాకు మద్దతిస్తూనే దౌత్యపరమైన సంబంధాలు కూడాపాలస్తీనా నాయకత్వంతో కొనసాగించింది. 2017 తర్వాత ప్రధాని మోడీ రెండోసారి జరిపిన ఇజ్రాయెల్ పర్యటనతో ప్రాంతీయ అనిశ్చితికి తెరదించింది. గాజా కాల్పుల విరమణ ఉద్రిక్తతలు, అమెరికా-ఇరాన్ వివాదాలు, భౌగోళిక ఉద్రిక్తతల పట్ల సంయమనంతో కూడిన వైఖరులతో భారత్ వ్యూహాత్మక వైఖరిని అనుస రించింది. ప్రధాని మోడీ ఈసారి ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగించడం భారత్ ప్రతిష్టను ఇనుమడింప చేయడంతోపాటు ఇజ్రాయెల్ ప్రజల్లో భారత్‌పట్ల ఉన్న గౌరవాభిమానాలను మరింత పెంచింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌లతో జరిపిన చర్చలు కూడా మంచి ఫలితాలిచ్చాయి. రక్షణ రంగంలో సహకారం, కృత్రిమ మేధ, స్టార్టప్స్, రెండు దేశాల మధ్య కనెక్టివిటీ, విద్యా రంగాలపైనే విస్తృతస్థాయిలో చర్చలుజరిగాయి. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రవేశించగానే సభ్యులందరూ లేచినిలబడి భారత ప్రధానికి స్వాగతం పలకడం రెండు దేశాల మధ్య ఉన్న సంస్కృతిక ప్రాభవాన్ని గుర్తుచేసింది. కేవలం రక్షణరంగ లావాదేవీలకు మాత్రమే పరిమితం కాకుండా ఎకో వ్యవస్థలపై కొత్త సృజనాత్మక ఆవిష్కరణలు, వ్యూహాత్మక చర్చలు, ఇరుదేశాల ప్రజలతో ఉన్న సంబంధాలను మమేకం చేసిందని చెప్పుకోవచ్చు. ఇజ్రాయెల్ ఇటీవలి చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శనాత్మక చర్చలు జరుగుతున్న తరుణంలో ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనపై ప్రశ్నలు అనేకం ఉత్పన్నం అయ్యాయి. భారత్ అనుసరించి వ్యూహాత్మక దౌత్యవిధానం ఇపుడు మరింత విశ్వాసాన్ని పెంచింది. గల్ఫ్‌దేశాలతో ఉన్న విస్తృతస్థాయి సంబంధాలను కూడా ఇజ్రాయెల్‌తో దౌత్యం విఘాతం కలిగించలేదు. ఇతర అరబ్ దేశాలు భారత్‌తో సంబంధాలకే ఎక్కువ మొగ్గు చూపించాయి. పశ్చిమాసియాలో భారతీయ సంతతి ప్రజల సంక్షేమం కూడా ఇపుడు భారత్‌కు ముఖ్యం కాబట్టి భారత్ అటు అరబ్బు దేశాలతోపాటు పశ్చిమాసియా ఇతర దేశాలనుకూడా సమన్వయంతో కలుపుకుని వెళుతోంది. విభిన్న రంగాలతో ఏర్పడిన వాణిజ్య బంధానికి తోడు దౌత్యబంధం కూడా వ్యూహాత్మక భాగస్వామ్య విధానంతో ముందుకు పోవడం వల్ల భారత దేశ శ్రేయస్సును పరిగణనలోనికి తీసుకునే ముందుకు వెళుతున్నట్లుగా కనిపించింది. ప్రస్తుత కాలంలో ప్రాంతీయ అనిశ్చితి, కూటముల్లో ఏర్పడుతున్న కప్పదాటుల తరుణంలో ఒకే విధానంపై ముందుకు పోవడం భారత్‌కు ఉన్న ధృఢమైన సంకల్పం అనే చెప్పాలి. భాగస్వామ్యాలు మరింత లోతైన బంధాలను పెంచుతాయి, మౌలిక సూత్రాలు సమన్వయంతో కూడా దౌత్యబంధం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి భారత్ అనుసరిస్తున్న సుదీర్ఘ విదేశాంగ విధానమే మేలని చెప్పక తప్పదు.

# ఖమేనీ కోటను ఎలా బద్దలు కొట్టారంటే...

• కాంపౌండ్‌పై 30 బాంబులు • నిఘావర్గాల పక్కా సమాచారంతోనే దాడి



**టెల్‌అవీవ్, మార్చి 1:** ఇజ్రాయెల్ - అమెరికా మధ్య సమన్వయ ప్రణాళికలో భాగంగా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ నివసించే కాంప్లెక్స్‌పై ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు 30 బాంబులు జారవిడిచాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రకారం, ఖమేనీ ఉన్న ప్రదేశం గుర్తించబడిన తర్వాత ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు ఆయన నివసించే కాంప్లెక్స్‌పై 30 బాంబులు జారవిడిచాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ సీనియర్ రాజకీయ, సైనిక నాయకుల ఉమ్మడి సమావేశం కోసం ఇజ్రాయెల్, అమెరికన్ నిఘా అధికారులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని, వారిపై ఒకేసారి దాడి చేయాలని ఇజ్రాయెల్ అధికారులు శనివారం అలాంటి మూడు సమావేశాలను గుర్తించారని, ఆ సమయంలో ఖమేనీ ఉన్న ప్రదేశం కూడా నిర్ణయించబడిందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. వాల్ స్ట్రీట్ జర్నల్ ఈ క్షణాన్ని "ప్రత్యేకమైన" అవకాశంగా అభివర్ణించింది, దీనివల్ల పట్టపగలు దాడి జరగాల్సి వచ్చింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడి ఉత్తర్వు జారీ చేయడానికి ముందే ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికన్ లక్ష్యాలపై చర్య తీసుకుంటుందని వాషింగ్టన్ నిఘా వర్గాలకు సమాచారం అందిందని నివేదిక పేర్కొంది. ఆ నిఘా సమాచారం అమెరికా అధ్యక్షుడి నిర్ణయానికి మరింత ఆవశ్యకతను జోడించిందని ఆ వర్గాలు తెలిపాయి.

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, రక్షణ మంత్రి అమీర్ నసేర్జాదే, కమాండర్ ఇన్ చీఫ్ మొహమ్మద్ పక్‌పూర్‌తో సహా అనేక సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాలనలోని అగ్ర రాజకీయ నాయకత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యకు దిగాయి. 1989 నుండి ఇరాన్‌కు నాయకత్వం వహిస్తున్న 86 ఏళ్ల ఖమేనీ ఈ దాడిలో మరణించారు. ఇరాన్ రక్షణ మంత్రి జనరల్ అమిర్ నసీర్జాదే, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అబ్దోల్ రహీమ్ మోసావి, ఖమేనీ కుమార్తె, మనవడు, అల్లుడు, కొడుకు మృతిచెందారు. ఇరాన్ రక్షణ మండలి సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన వైమానిక దాడిలో రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్ మరణించారు.

రక్షణ మంత్రి మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించింది. సాయుధ దళాలకు చెందిన పలువురు కమాండర్లు కూడా మరణించారని, వారి పేర్లను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది.

## సంక్లిష్టమైన వ్యూహం...

**టెహ్రాన్, మార్చి 1:** ఇరాన్ అత్యున్నత అధికార కేంద్రం "పాశ్చర్ స్ట్రీట్"లోని సుప్రీం లీడర్ నివాసం అత్యంత పటిష్టమైన భద్రతకు మారుపేరు. అణుదాడులను కూడా తట్టుకునేలా నిర్మించిన ఆ కోటను బద్దలుకొట్టడానికి అమెరికా, ఇజ్రాయెల్ అత్యంత సంక్లిష్టమైన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"ని అమలు చేశాయి. ఈ దాడి ఎలా జరిగిందనే అంశం ఇప్పుడు అంతర్జాతీయ రక్షణ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

వ్యూహం1: పగటి పూట దాడులతో విస్మయం

సాధారణంగా ఏ దేశమైనా వైమానిక దాడులను శత్రువు అప్రమత్తంగా లేని అర్ధరాత్రి వేళల్లో చేపడుతుంది. కానీ, ఈసారి అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహకర్తలు దీనికి భిన్నంగా పగటిపూట దాడులు ప్రారంభించారు. ఇరాన్ అధికారులు కార్యాలయాల్లో సమావేశమై ఉండే సమయాన్ని ఎంచుకుని, వారు ఊహించని విధంగా విరుచుకుపడ్డారు.

వ్యూహం2: భూమి, ఆకాశం, సముద్రం.. ముప్పేట దాడి

టెహ్రాన్ నగరాన్ని మూడు వైపుల నుంచి చుట్టుముట్టేలా ఈ ఆపరేషన్ ప్లాన్ చేశారు. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా యుద్ధ నౌకలు, జలాంతర్గాముల నుంచి వేలాది కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల"టోమాహాక్" క్రూయిజ్ క్షి పణులను ప్రయోగించారు. అమెరికాకు చెందిన ఎఫ్35 స్టీల్త్ ఫైటర్లు, బి2 బాంబర్లు రాడార్లకు చిక్కకుండా ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి"పిన్ పాయింట్" బాంబు దాడులు చేశాయి. సరిహద్దు దేశాల నుంచి హైమార్స్ రాకెట్ సిస్టమ్స్ ద్వారా ఖచ్చితమైన లక్ష్యాలపై దాడులు జరిగాయి.

వ్యూహం3: సరికొత్త "లుకాస్" డ్రోన్ల వినియోగం

ఈ ఆపరేషన్‌లో అతిపెద్ద ప్రధానాంశం. లో కాస్ట్ అన్ మ్యాన్డ్ కాంబాట్ అటాక్ సిస్టం(లుకాస్) డ్రోన్లు. అమెరికా సైన్యం తొలిసారిగా ఈ కమికేజ్ (సూసైడ్) డ్రోన్లను భారీ స్థాయిలో వాడింది. ఇరాన్ సొంతంగా తయారు చేసుకునే షాహెద్ డ్రోన్ల తరహాలో ఉండే ఈ డ్రోన్లు గుంపులుగా వచ్చి ఇరాన్ రక్షణ వ్యవస్థలైన ఎస్300 క్షి పణులను ఏమార్చి, ఖమేనీ నివాసాన్ని నేరుగా తాకాయి. శాటిలైట్ చిత్రాల ప్రకారం.. కేవలం నిమిషాల వ్యవధిలోనే ఆ ప్రాంతమంతా శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిన తర్వాతే ఈ దాడులు జరగడం విశేషం.

## మధ్యప్రాచ్యంలో అలుముకున్న యుద్ధమేఘాలు

### అమెరికా స్థావరాలపై ఇరాన్ ఐఆర్‌జీసీ దాడులు

**టెహ్రాన్, మార్చి 1:** ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. ఆపరేషన్ ట్రూ ప్రామిస్4 పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ఐదో దశ దాడులను ముమ్మరం చేసింది. కువైట్‌లోని అబ్దుల్లా ముబారక్ ప్రాంతంలో ఉన్న అమెరికన్ నావల్ బేస్‌పై 4 బాలిస్టిక్ క్షిపణులు, 12 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో బేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా ధ్వంసమైందని, పలువురు అమెరికన్ సైనికులు మరణించారని సమాచారం. అటు హిందూ మహాసముద్రంలోనూ ఇరాన్ అలజడి సృష్టించింది. అమెరికా నౌకలకు ఇంధనం సరఫరా చేస్తున్న కంబాట్ సపోర్ట్ షిప్‌పై ఖద్ర 380 క్షిపణులతో దాడి చేసింది. మరోవైపు, దుబాయ్‌లోని జెబెల్ అలీ యాంకరేజ్‌లో అమెరికాకు ఆయుధాలు చేరవేస్తున్న నౌకపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల తీవ్రతకు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. పర్షియన్ గల్ఫ్ దేశాలతోపాటు ఇరాక్ కుర్దిస్తాన్‌లోని అమెరికా బేస్‌లపై కూడా ఇరాన్ ఎయిర్ ఫోర్స్ బాంబుల వర్షం కురిపించింది. ఖమేనీ మరణం తర్వాత మధ్యప్రాచ్యంలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పింది.

## ఇరాన్ వీధుల్లో సంబరాలు



**టెహ్రాన్, మార్చి 1:** నాలుగున్నర దశాబ్దాల ఇరాన్ షియా పాలనలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశాన్ని 36 ఏళ్లుగా ఉక్కు పిడికిలితో ఏలిన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ(86) శకం ముగిసింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మెరుపుదాడిలో ఆయన హతమయ్యారు. ఈ వార్త పశ్చిమాసియాలో కార్చిచ్చులా వ్యాపించగా, ఇరాన్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ప్రతీకారంతో రగిలిపోతుంటే, మరోవైపు ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ఘటనతో యావత్ పశ్చిమాసియా యుద్ధ మేఘాల నీడలోకి జారుకుంది. ఖమేనీ మరణవార్తను ధ్రువీకరించిన వెంటనే, టెహ్రాన్, ఇస్ఫహాన్, షిరాజ్, కరాజ్ వంటి ప్రధాన నగరాల్లో అసాధారణ దృశ్యాలు కనిపించాయి. ప్రభుత్వ ఆంక్షలను, ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొందరు భవనాలపైకి ఎక్కి ఆనందంతో కేరింతలు కొట్టగా, మరికొందరు వీధుల్లో నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ తమ స్వేచ్ఛను ప్రకటించుకున్నారు. నియంతృత్వ పాలన అంతమైంది... అంటూ నినాదాలు చేశారు. స్టార్‌లింక్ వంటి శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ఉపయోగించి కొందరు ఈ సంబరాల వీడియోలను ప్రపంచానికి చేరవేయడంతో అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ద్రవ్యోల్బణం, కఠినమైన సామాజిక నియమాలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసిన నేపథ్యంలో, ప్రజాగ్రహం ఈ రూపంలో బయటపడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ హత్యపై ఇరాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు అత్యవసరంగా సమావేశమై ఈ దుశ్చర్యకు కారణమైన హంతకులపై చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామని భీకర ప్రతిజ్ఞ చేశారు. ఇరాన్ క్యాబినెట్ సైతం అమెరికా, ఇజ్రాయెల్‌కు తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. మా సుప్రీం లీడర్ నెత్తుటిబొట్టుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అధికారిక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, ఈ దాడిని తామే నిర్వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఇజ్రాయెల్‌తో కలిసి అత్యంత పకడ్బందీగా ఈ ఆపరేషన్ పూర్తిచేశాం. మా అత్యాధునిక నిఘా వలయం నుంచి ఖమేనీ తప్పించుకోలేకపోయారని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు, అమెరి కా సైనిక స్థావరాలున్న ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్‌లపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణు లతో దాడి చేసింది. దీంతో పశ్చిమాసియా యుద్ధ వాతావరణాన్ని కమ్మింది. ఒమన్ మధ్య వర్తిత్వంతో జెనీవాలో జరిగిన చర్చ లు విఫల మైన 48 గంటల్లోపే ఈ దాడి జరగ డం గమ నార్హం. ఖమేనీ మరణంతో ఇరాన్ రాజ కీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఆయన స్థానంలో ఎవరు వస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అదే సమయంలో, ఈ పరి ణామం పశ్చిమాసియాను పెనుప్రమాదంలోకి నెట్టింది.

## ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఆర్మీచీఫ్ మౌసావి మృతి

**టెహ్రాన్, మార్చి 1:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దోల్లాహిం మౌసవి మరణించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా ఇరిబ్ టీవీ ఆదివారం వెల్లడించింది. టెహ్రాన్‌పై జరిగిన ఈ భీకర దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ కమాండర్ మొహమ్మద్ పాక్‌పూర్, రక్షణ మండలి కార్యదర్శి అలీ షంఖానీ, రక్షణ మంత్రి అజీజ్ నసిర్‌జాదే కూడా ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇరాన్ ఉన్నతాధికారులు సమావేశమైనట్లు మిలిటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిందని, ఆ వెంటనే ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ మెరుపు దాడులు చేసిందని ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో రక్షణ మంత్రి, ఐఆర్‌జీసీ చీఫ్ సహా మొత్తం ఏడుగురు సీనియర్ కమాండర్లను మట్టుబెట్టి నట్లు ఐడీఎఫ్ తెలిపింది. మరికొంత మంది వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## నియంత పాలన ముగిసింది

### ఇరాన్‌షా కుమారుడు రెజా పెహ్లవి

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ శకం ముగిసిందని, ఆయనను చరిత్ర పుటల నుంచి తుడిచిపెట్టేశామని ఇరాన్ చివరి షా కుమారుడైన రెజా పహ్లవి సంచలన ప్రకటన చేశారు. ఖమేనీ మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన కూడా వాస్తవంగా ముగిసిపోయిందని ఆయన అన్నారు. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి పహ్లవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమేనీ రక్తపిపాసి నియంత. ఇరాన్‌కు చెందిన వేలాది మంది ధైర్యవంతులైన యువతీ యువకులను హత్య చేసిన వ్యక్తి. ఆయన మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ అంతం మొదలైందన్నారు.

## మంటల్లో పశ్చిమాసియా



# పాకిస్థాన్‌కు అంటుకున్న 'ఇరాన్' మంటలు..

### అమెరికా కాల్పుల్లో 12 మంది మృతి

**ఇస్లామాబాద్, మార్చి 1:** ఇరాన్‌లో ఖమేనీ మరణం మంటలు పాకిస్థాన్‌కు వ్యాపించాయి. పాకిస్థాన్‌లో కరాచీ, లాహోర్‌లో ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలు హింసాత్మక నిరసనలకు పాల్పడుతున్నారు. కరాచీలోని యుఎస్ ఎంబసీపై దాడులకు తెగబడ్డారు. రాయబార కార్యాలయాన్ని తగలపెట్టే ప్రయత్నం చేశారు. పరిస్థితి తీవ్రం కావడంతో యుఎస్ కాన్సులేట్‌లోని అమెరికా సైనిక సిబ్బంది అల్లరిమూకపై కాల్పులు జరిపింది. ఈ దాడుల్లో 12 మంది మరణించారు. చాలామంది గాయపడినట్లు తెలుస్తోంది. కరాచీలోని ఎంటిఖాన్ రోడ్‌లోని అమెరికా కాన్సులేట్ వెలుపల పెద్దసంఖ్యలో నిరసనకారులు గుమిగూడడంతో ఈ సంఘటన ప్రారంభమైంది. ఇరాన్‌లో అయతుల్లా ఖమేనీ, అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడంపై వారు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిరసనకారులు ఎంబసీ కాంపౌండ్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించి భద్రతాబలగాలపై రాళ్లు రువ్వారు. పరిస్థితిని నియంత్రించడానికి పాక్ పోలీసులు, అమెరికా భద్రతా దళాలు మొదట భాష్పవాయు గోళాలు ప్రయోగించి, ఆ తర్వాత కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12 మంది మరణించగా, మరో 30 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## మీ కోసం నరక ద్వారాలు తెరిచాం

### అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు

**టెహ్రాన్, మార్చి 1:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు దట్టంటా అలుముకున్నాయి. ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4' పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. శత్రువులకు నరకం అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని తీవ్ర హెచ్చరికలు చేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ అయిదో దశ దాడులను ముమ్మరం చేసింది. కువైట్‌లోని అబ్దుల్లా ముబారక్ ప్రాంతంలో ఉన్న అమెరికన్ నావల్ బేస్‌పై 4 బాలిస్టిక్ క్షిపణులు, 12 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో బేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా ధ్వంసమైందని, పలువురు అమెరికన్ సైనికులు మరణించారని సమాచారం. అటు హిందూ మహాసముద్రంలోనూ ఇరాన్ అలజడి సృష్టించింది. అమెరికా నౌకలకు ఇంధనం సరఫరా చేస్తున్న కంబాట్ సపోర్ట్ షిప్‌పై 'ఖద్ర 280' క్షిపణులతో దాడి చేసింది. మరోవైపు, దుబాయ్‌లోని జెబెల్ అలీ యాంకరేజ్‌లో అమెరికాకు ఆయుధాలు చేరవేస్తున్న నౌకపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల తీవ్రతకు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. తమ నాయకుడి మరణానికి ప్రతీకారంగా 'చరిత్రలోనే అత్యంత భయంకరమైన అఫెన్సివ్ ఆపరేషన్' చేపడతామని ఐఆర్‌జిసి హెచ్చరించింది. 'శత్రువులకు నరక ద్వారాలు తెరిచి ఉంచుతాం.. ఇమామ్ హంతకులకు కచ్చితంగా శిక్ష పడుతుంది' అని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

## యుఎఇపై 137 బాలిస్టిక్ క్షిపణులు..

# 200కిపైగా డ్రోన్లతో ఇరాన్ ఐఆర్‌జీసీ దాడులు

**అబూదాబి, మార్చి 1:** మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించినట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ధ్రువీకరించింది. ఇదే సమయంలో, ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు, డ్రోన్లతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై భీకర దాడి జరిగింది. ఈ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. యూఏఈపై ఇరాన్ మొత్తం 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో దాడి చేసిందని, వాటిలో చాలా వరకు విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 132 క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేయగా, 195 డ్రోన్లను కూల్చివేసినట్టు తెలిపింది. మిగిలినవి సముద్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. ఈ దాడుల శిథిలాలు అబుదాబి, దుబాయ్‌లలో పడటంతో నష్టం వాటిల్లింది. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను అడ్డుకునే క్రమంలో దాని శకలాలు కిందపడి ఆసియా దేశానికి చెందిన ఒకరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. దుబాయ్‌లోని పామ్ జుమేరా ప్రాంతంలో ఓ భవనంపై క్షిపణి శిథిలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల విమాన రాకపోకలకు అంతరాయం కలిగి, సుమారు 20,200 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అధికారులు తెలిపారు. మరోవైపు, ఖమేనీ మరణంతో ఇరాన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనతో పాటు మరో నలుగురు కుటుంబసభ్యులు కూడా ఈ దాడుల్లో మరణించినట్టు ప్రకటించింది. ప్రభుత్వం 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది.

## ఇరాన్ సుప్రీం లీడర్ హత్యపై పుతిన్ ఆగ్రహం

### ఇదొక కిరాతక చర్య: పుతిన్

**మాస్కో, మార్చి 1:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని సినికల్ మర్డర్ (కిరాతక హత్య)గా అభివర్ణించిన పుతిన్ ఇది అంతర్జాతీయ చట్టాలను, మానవత్వాన్ని పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు పుతిన్ ఓ లేఖ రాశారు. ఖమేనీని రష్యాలో అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా గుర్తుంచుకుంటామని, ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ లేఖలో కొనియాడారు. ఖమేనీ మృతికి 40 రోజుల పాటు సంతాప దినాలను ఇరాన్ ప్రకటించింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ స్పష్టం చేసింది. బిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలు స్పందిస్తూ అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగాలని సూచించారు. ఖమేనీ మరణం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా రష్యా-ఇరాన్ సంబంధాల్లో కీలక మార్పులకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పాక్-అఫ్ఘాన్ మధ్య యుద్ధమేఘాలు..!

**కాబూల్, మార్చి 1:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు యుద్ధ వాతావరణానికి దారితీశాయి. ఆదివారం నాటికి ఇరు దేశాల మధ్య ఘర్షణ నాలుగో రోజుకు చేరుకుంది. ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌పై పాకిస్థాన్ యుద్ధ విమానాలు భీకర దాడులు చేస్తుండగా, వాటిని కూల్చివేసేందుకు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌లతో ఎదురుదాడి చేస్తున్నామని తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ప్రకటించారు. తమ సరిహద్దు దళాలపై తాలిబన్ల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఈ తీవ్ర చర్యలకు దిగింది. ఆపరేషన్ గజబ్ లిల్ హక్ పేరుతో కాబూల్, కాందహార్‌లోని తాలిబన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించింది. "మా సహనం నశించింది. ఇక ప్రత్యక్ష యుద్ధమే" అని పాక్ రక్షణ మంత్రి ప్రకటించడం పరిస్థితికి పడుతోంది. పాకిస్థాన్‌లో విధ్వంసాలకు పాల్పడుతున్న తెహ్రీక్‌ఇ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని పాక్ చాలాకాలంగా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను ఆఫ్ఘన్ ప్రభుత్వం తోసిపుచ్చుతోంది. తమ దేశంపై దాడికి ప్రయత్నించే వారిని అణచివేసే శక్తి తమ సైన్యానికి ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాకిస్థాన్ నేరుగా ఆఫ్ఘన్ రాజధానిపై వైమానిక దాడులకు పాల్పడటం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది. 2,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు కలిగిన ఈ రెండు దేశాల మధ్య తాజా ఘర్షణలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి.

## ఇరాన్ ఐఆర్జిసి చీఫ్‌గా అహ్మద్ వాహిదీ

**టెహ్రాన్, మార్చి 1:** యుద్ధం కొనసాగుతున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తన ఐఆర్జిసికు కొత్త కమాండర్ ఇన్‌చీఫ్‌ను బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిదీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దాడుల్లో ఐఆర్జిసి కమాండర్ మహ్మద్ పాక్పూర్ మరణం వార్త ధృవీకరించగానే నియామకం జరిగింది. అహ్మద్ వాహిదీకి సైన్యంలోనూ, ప్రభుత్వంలోనూ విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన ఇరాన్ రక్షణ మంత్రిగా, అంతర్గత వ్యవహారాల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో, వ్యూహరచనలో నిపుణుడైన వాహిదీ నియామకం ద్వారా సైనిక బలగాల్లో ఐక్యతను తీసుకురావాలని ఇరాన్ ప్రభుత్వం భావిస్తోంది.

# రేషన్ తీసుకోని కార్డుదారులపై విచారణ

### ప్రత్యేక దృష్టి సారించిన పౌర సరఫరాల శాఖ

### విచారణ ప్రారంభించనున్న తహశీల్దార్లు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** నెలల తరబడి సన్న బియ్యాన్ని తీసుకోని రేషన్‌కార్డుదారులపై పౌర సరఫరాల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఆరు నెలలపాటు రేషన్ తీసుకోని కార్డుదారుల వివరాలను సేకరిస్తోంది. కార్డుదారులు స్థానికంగా ఉన్నారా? లేదా ఇతర ప్రాంతానికి వలస వెళ్లారా? ఒకవేళ అనర్హులు అయినప్పటికీ కార్డును పొందారా? అన్న కోణంలో వివరాలను సేకరిస్తోంది. ఇందుకు రేషన్ లబ్ధిదారుల్లో వరుసగా ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మండల తహశీల్దార్ ఆఫీస్ లాగిన్‌కు సిబ్బంది పంపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ చేయను న్నారు. విచారణలో ఒకవేళ అనర్హులను గుర్తిస్తే వారి రేషన్‌కార్డు రద్దు చేయనున్నారు. ఒకవేళ అర్హులకే సమస్యలుంటే నేరుగా పరిష్కరించనున్నారు. ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి రేషన్ కార్డును అధికారులు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షల కొత్త కార్డులను మంజూరు చేసింది. పాత రేషన్ కార్డుల్లోనూ పేర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో లక్షల సంఖ్యలో రేషన్ కార్డులను కొత్తగా పొందారు. అయితే వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకునేందుకు రావట్లేదు. వరుసగా ఆరు నెలలుగా రేషన్ బియ్యం తీసుకోకుంటే, ఎందుకో ఆరా తీయాలని క్షేత్రస్థాయి అధికారులకు పౌరసరఫరాలశాఖ సూచించింది. అర్హులకు సమస్యలున్నా పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న సన్న బియ్యాన్ని తీసుకుంటున్న చాలామంది కార్డుదారులు వాటిని 10 రూపాయలకో, 20 రూపాయలకో బయట మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. ఆ తర్వాత దుకాణానికి వెళ్లి సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ చర్యతో జనం ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆహార నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో అద్భుతమైన పోషకాలు ఉన్నాయని, ఈ విషయం తెలియక వాటిని ఇలా దుకాణాల్లో అమ్ముతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా.. పోషకాలు నిండిన ఫోర్టిఫైడ్ రైస్ వదులుకొని, మార్కెట్లో దొరికే సాధారణ బియ్యం తెచ్చుకొని తింటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోషకాహార లోపం ఒకటి. పిల్లల నుంచి పెద్దల వరకు దీనిబారిన పడుతున్నారు. వయసుకు తగిన బరువు లేకపోవడం కొందరి సమస్యకాగా తగినంత ఎత్తు పెరగకపోవడం మరి కొందరి సమస్య. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలోని ఐదేళ్లలోపు పిల్లల్లో 32 శాతం మంది వయసుకు తగ్గ బరువు ఉండటం లేదు. 35 శాతం మంది వయసుకు తగిన ఎత్తులేరు.

## ఎన్పీడిసిఎల్ హిస్టరీలో తొలిసారిగా విద్యుత్ డిమాండ్ 6,267 మె.వా. నమోదు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో క్రమేపీ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఈ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత రెండు రోజులుగా భారీగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. సంస్థ చరిత్రలో తొలిసారిగా ఆదివారం అత్యధికంగా 6,267 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది.

ఈ విధంగానే శనివారం ఎన్పీడీసీఎల్ హిస్టరీలో గరిష్ట డిమాండ్ అయిన 6,057 మెగావాట్లను అధిగమించి ఆదివారం అది 6,267 మెగావాట్లకు చేరుకోవడం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగం రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సంస్థ ముందుగానే తీసుకున్న ప్రణాళికాబద్ధమైన చర్యల ఫలితంగా అత్యధిక డిమాండ్‌ను అధిగమిస్తున్నట్లు తెలిపారు.

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నందున, అదే సమయంలో విద్యుత్ డిమాండ్ కూడా గణనీయంగా పెరుగుతోందని చెబుతున్నారు. అయితే, నిరంతర విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి సంస్థ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతూ, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించిందని అంటున్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్‌కు డిమాండ్ ఎంత పెరిగినా, ఎటువంటి అంతరాయాలు లేకుండా సరఫరా చేయడానికి సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

## గల్ఫ్ దేశాల్లోని భారత్, తెలంగాణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అక్కడ ఉన్న భారతదేశానికి తెలంగాణకి చెందిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడుల ప్రభావం, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడ ఉన్న భారత, తెలంగాణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత భారత ప్రభుత్వందేనని అన్నారు. గల్ఫ్ దేశాల్లో అనేక మంది భారతీయులు తెలంగాణ వారు ఉన్నారని, ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో అక్కడ ఉన్న వారు సురక్షి తంగా ఉండాలన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వారికి ఇబ్బందులు ఉంటే తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికీ తీసుకురావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ ఉన్న తెలంగాణ వారిని స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## రవాణా శాఖపై తప్పడు ప్రచారాలు చేస్తే లీగల్ చర్యలు

### మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖపై తప్పుడు ప్రచారాలు చేస్తే లీగల్ చర్యలు తప్పవని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఆర్టీసీలో జరగనున్న నియామకాలకు ఆర్టీసీకి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఆర్టీసీలోని నియామకాలను పోలీసు రిక్రూట్మెంట్ సెల్ పరిధిలో చేపట్టడం జరుగుతుందని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్టీసీలో డ్రైవర్ పోస్టుకు 6 అడుగులు అనే తప్పుడు ప్రచారం సరికాదన్నారు. డ్రైవర్ పోస్టుకు 5.3 అడుగులు(160 సెంటిమీటర్లు)అర్హతగా ఉంటుందన్నారు. టికెట్ యాప్‌లో ఎలాంటి సమస్యలు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ, రవాణా శాఖపై తప్పుడు ప్రచారాలు మనుకోకపోతే చర్యలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## కాంప్లెక్స్ ఎరువుల ధరాఘాతం

### యాసంగి సాగుపై ప్రతికూల ప్రభావం

### ఎకరాకు రూ.4 వేలు పెరిగిన పెట్టుబడి

### రెండు నెలల్లో రూ.50 నుండి రూ.100 పెరిగిన ఎరువుల బస్తా ధర

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఇప్పటికే భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం తో సాగు గిట్టుబాటుకాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతలకు పెరిగిన ఎరువుల ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలతో సాగు వ్యయం తలకుమించిన భారంగా మారింది. రెండు నెలల వ్యవధిలోనే ఎరువుల బస్తాల ధరలు రూ.50 నుంచి రూ.100 మేర పెరిగాయని అన్నదాతలు మండిపడుతున్నారు. దీంతో యాసంగి సాగు భారంగా మారిందని వాపోతున్నారు. యూరియా వినియోగాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. దీంతో బహిరంగమార్కెట్‌లో యూరియా లభ్యత తగ్గడంతో రైతులు ఇతర కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని పెంచారు. విరివిగా వినియోగించే 20:20:0 ధర కూడా భారీగా పెరగడంతో ఎకరానికి పెట్టుబడి వ్యయం రూ.4వేల నుంచి 5వేల మేర అదనంగా పెరిగిందని రైతులు మండిపడుతున్నారు.పెరిగిన ఎరువుల ధరలు... 15:15:15 మిశ్రమ ఎరువు 50 కిలోల బస్తా ధర రబీ ప్రారంభంలో రూ.1150గా ఉండగా ప్రస్తుతం రూ.1650కి, 20:20:13 కాంప్లెక్స్ రూ.1400 నుండి రూ.1500కు, 10:26:26 ఎరువు ధర రూ.1900 నుండి రూ.2100కు , 14:35:14 ధర రూ.1950 నుండి రూ.2150కు, 16:16:16 ఎరువు రూ.1600 నుండి రూ.1675కు పెరిగింది. దీంతో యాసంగి సాగు పెట్టుబడి వ్యయం పెరిగి సాగు రైతుకు గిట్టుబాటుకాని పరిస్థితి నెలకొంది.సాధారణంగా రబీ సీజన్‌లో యూరియా, డిఎపితోపాటు కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది.

యూరియా మినహా ఎన్పికె ఎరువులపై పోషకాధారిత సబ్సిడి పథకం కింద ఆరేళ్లకోసారి రాయితీ వాటాను కేంద్రం నిర్ణయిస్తుంది. కంపెనీలు ధరలు పెంచినపుడు ఆ మేరకు కేంద్రం రాయితీ పెంచితే ఆ భారం రైతులపై పడదు. కానీ కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాయితీలు పెంచకపోవడంతో కంపెనీలు పెంచే భారం పూర్తిగా రైతులపై పడుతోంది. అదే సమయంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకుని ఎరువుల తయారీ ముడిపదర్థాలపై 18శాతంగా ఉన్న జిఎస్టిని ఇటీవలే కేంద్రం 5శాతానికి తగ్గించింది. ఆ మేరకు ఉత్పత్తి వ్యయం తగ్గింది. కానీ జిఎస్టి ఫలాలను జేబుల్లో వేసుకుంటున్న కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల తయారికి ఉపయోగించే ముడిసరుకుల ధరలు పెరిగాయన్న సాకుతో ఏటా కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచేస్తుండడం రైతులకు పెనుభారంగా మారుతోంది.

## మూసీ ప్రక్షాళనతో ఎప్పటికీ సిఎంగా రేవంత్

# కొనసాగుతాడని విపక్షాల భయం

### సబర్మతి సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపి కిరణ్, విప్ బీర్లఐలయ్య, గుత్తా అమిత్



**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** మూసీ ప్రక్షాళనతో తెలంగాణకు ముఖ్య మంత్రిగా ఎప్పటికి రేవంత్ రెడ్డి కొనసాగుతాడని భయంతో ప్రతిపక్ష పార్టీలు బిజెపి, బిఆర్ఎస్ వ్యతిరేకిస్తు న్నాయని సబర్మతి రివర్ ఫ్రంట్ సందర్శించిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి,ఎం.పి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల ఐలయ్య అభిప్రాయపడ్డారు. ఆదివారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, భువనగిరి లోక్ సభ సభ్యులుచామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,డైరీ డెవలప్ మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి,మదర్ పాల డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డిలు అహ్మదాబాద్ సబర్మతి రివర్ పరివాహక ప్రాంతంను సందర్శించారు. భువనగిరి ఎంపి చామల కిరణ్ రెడ్డి మాట్లాడుతూ గుజరాత్ లో సబర్మతి రివర్ 22 కిలోమీటర్లు ప్రక్షాళన జరిగిందనీ వివరించారు. సబర్మతి రివర్ కు ఎస్టిపి నుంచి నర్మదా నది నుంచి వచ్చే నీళ్లను పంటలకు పంపి స్తున్నారు. హైదరాబాద్ నగరంలో మూసీ రివర్ నగరం నడిబొడ్డున ఉండ టంతో ఆ కాలుష్య కాసారంను ప్రక్షాళన చేసి గోదావరి నీళ్లను తెచ్చి ఆ నదిలో కలపాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నా రనీ చామల తెలిపారు. భువనగిరి లోక్ సభ పరిధిలో సాగు, తాగు నీరు ఇవ్వాలనేది ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం అని అన్నారు. హైదరాబాద్ నగరం మూసీ ప్రక్షాళనతో మరింత అభివృద్ధి చెందు తుందనీ ఆయన అభిప్రాయపడ్డారు. సబర్మతి రివర్ కు మూసీకు సంబంధం లేదని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు అంటున్నారనీ, సబర్మతికి నీళ్ల నర్మదా నది నుంచి వస్తాయి, మూసీకి నీళ్ల గోదావరి నది నుంచి వస్తాయి ప్రక్షాళ తీరుపై సంబంధంలేదని అనడం విడ్డూరంగా ఉందని విస్మయం వ్యక్తం చేశారు. సబర్మతి రివర్ ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు పది వేల కుటుంబాలను తరలించామని అధికారులు చెప్పారు. ఎవరిని తరలించలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అబద్దాలు మాట్లాడు తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నేత హరీశ్ రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మూసి పరివాహక ప్రాంతంలో కాలుష్యం కాటుకు గురవుతున్న ప్రజలను అర్థం చేసుకోవాలనీ ఆయన సలహా ఇచ్చారు. మనం హైదరాబాద్ మూసి నదిని ప్రక్షాళన చేసుకోవద్దా అని ప్రశ్నించారు. మూసీ మురికి కూపంలోనే బ్రతుకుదామా...? అని ఆయన ప్రపశినంచారు. రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన చేస్తే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటారని భయపడి బిఆర్ఎస్,బిజెపి వాళ్ళు వ్యతిరేకిస్తున్నారనీ ఆవేదన చెందారు. హరీష్ రావు,రామచంద్రరావు ఇక్కడికి వచ్చి సబర్మతి రివర్ ను చూసి అహ్మదాబాద్ లోని అధికారులతో మాట్లాడి మాట్లాడి వాస్తవాలు తెలుసుకోని మూసి ప్రక్షాళనపై మీ అభిప్రాయ చెప్పాలని కోరారు. బిజెపి,బిఆర్ఎస్ పార్టీ నేతలు మూసీ ప్రక్షాళనను గుడ్డిగా వ్యతిరేకించడం సబర్మతి రివర్ ఫ్రంట్ వల్ల ప్రజలఎవరు గృహనిర్వాసితులు కాలేదని తప్పుడు ప్రచారాలు చేయడం తగదని హితవు చెప్పారు . మూసీ ప్రక్షాళన, మెట్రో పేజ్ 2, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ మహా నగరాన్ని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తే బిఆర్ఎస్, బిజెపి కలిసి అడ్డం పడుతున్నాయని అన్నారు. తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్ నగర ప్రజలు కలిసికట్టుగా బిఆర్ఎస్,బిజెపి నాయకులు బుద్ధి వచ్చే విధంగా జ్ఞానోదయం కల్పించాలనీ సూచించారు.

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యంలో తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధ వాతావరణం నేప థ్యంలో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలుగువారు అత్యంత జాగ్రత్తగా ఉండా లని పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సూచించారు. తెలంగా ణకు చెందిన కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నివసిస్తు న్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత యుద్ధప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో మిసైల్ దాడుల భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షణ కొనసాగిం చాలని ఆయన కోరారు. యుద్ధ ప్రభావంతో కొన్నిచోట్ల విమానాశ్రయ సేవలు అంతరాయం కలిగినట్లు సమాచారం అందుతోందని, గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు కార్మికులు, ముఖ్యంగా తెలంగాణకు చెందిన వారు ఇబ్బందులు పడు తున్నారనే వార్తలు వస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకుని తెలుగువారిని సురక్షి తంగా స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. యూ.ఏ.ఈ, ఇరాన్ ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు స్థానిక అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిసి ్థతులు తప్ప బయటకు రావొద్దని, పరిస్థితులు సాధారణం అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారత రాయబార కార్యాలయాలతో నిరంతర సంబంధం కొనసాగించాలని సూచించారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన గల్ఫ్ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని, అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారం ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

## పేదల ఇళ్లు కూల్చివేతపై జోక్యం చేసుకోవాలి

### అదే భూముల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

### ముఖ్యమంత్రికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు లేఖ

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఖమ్మం పట్టణంలోని పేదల ఇళ్ల కూల్చివేత సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. వారికి అదే భూదాన భూముల్లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఘవులు ఆదివారం లేఖ రాశారు. ఖమ్మం కార్పొరేషన్, వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో గత 12 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న సుమారు 700 మంది పేదల ఇండ్లను గత నెల ఫిబ్రవరి 24న కూల్చివేశారని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, అవి భూదాన యజ్ఞ బోర్డుకు చెందిన భూములని, 2014లోనే ఈ బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి అక్కడి పేదలకు ఇంటి స్థలం కోసం 100 గజాల చొప్పున మంజూరు చేసినట్లు తెలిసిందని లేఖలో పేర్కొన్నారు. అయితే అవి విలువైన భూములు కావడంతో పేదలను అక్కడి నుండి తొలగించటం సరైంది కాదన్నారు. ఫిబ్రవరి 28న తాను ఆ ప్రాంత సందర్శనకు వెళ్లానని, అక్కడి పరిస్థితిని చూసిన తరువాత అది యుద్ధంలోనో, భారీ భూకంపంలోనో నాశనమైనట్లు బీభత్సంగా ఉందన్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉండి బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న మీరు, మీ ప్రభుత్వం ఈ విధంగా పేదల పట్ల అమానుషంగా వ్యవహరించటం దారుణమైన విషయమని లేఖలో బీవీ రాఘవులు పేర్కొన్నారు. వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించిన అంబేద్కర్ భవన్, టిటిడిసిలలో సరైన వసతి, భోజన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదన్నారు. అక్కడ ఉన్నవారు అనారోగ్యం పాలౌతున్నారని తెలిపారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే పేదల ఇళ్లు కూల్చివేత

### రేవంత్‌రెడ్డిది ప్రజావ్యతిరేక ప్రభుత్వం

### మీడియాతో బిజెపి రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు



**ఖమ్మం మార్చి 1, ప్రభాతవార్త:** రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం నిరుపేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపురాజు రామచందర్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా వెలుగుమట్లలో ఆశ్రయం కోల్పో యిన భూదాన బాధితులను ఆయన పరామర్శించారు. న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయకుండా తెల్లవారుజామున భారీ బలగాలతో చిన్నారులు, వృద్ధులు అని చూడకుండా పేదలను వీధిన పడేయడం దారుణమని మండిపడ్డారు. బాధితులందరికీ అక్కడే నివాస స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులు తమ గోడును రామచందర్‌రావు ముందు వెళ్లబోసుకున్నారు. వారం రోజుల నుంచి ఖమ్మంలో భూదాన యజ్ఞ సంస్థ నిర్వాసితుల ఆక్రందన యావత్తు తెలంగాణ తోపాటు దేశ వ్యాప్తంగా ప్రతిధ్వని స్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల ప్రాంతంలోని భూ కొలత సంఖ్య నూట నలభై ఏడు, నూట నలభై ఎనిమిది, నూట నలభై తొమ్మిది భూముల్లో గత పదిహేను సంవత్సరాలుగా దాదాపు ఆరు వందల పేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పద్దెనిమిది వందల మందికిపైగా నిరుపేదలు కూలీపనులు చేసుకుంటూ పైసాపైసా కూడబెట్టుకుని వంద గజాల చొప్పున స్థలాన్ని ఏర్పాటు చేసుకుని చిన్నపాటి గుడిసెలు నిర్మించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస కనికరం లేకుండా ఆ ఇళ్లను నేల మట్టం చేసిందని రామ చందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశా లను ఏమాత్రం ఖాతరు చేయలేదని ఆరోపించారు. అనంతరం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకున్న బాధిత కుటుంబాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరామర్శించారు. ఈ కష్టకాలంలో వారికి భారతీయ జనతా పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పక్కనే జాతీయ రహదారి రావడం వల్ల భూమి విలువ పెరిగిందని, అధికార వర్గాలకు అత్యంత సన్నిహితులైన స్థిరాస్తి వ్యాపారులకు ఆ భూములను కట్టబెట్టేందుకే దాడులు చేశారని విమర్శించారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో నాలుగు వేల మంది భద్రతా బలగాలతో దౌర్జన్యంగా నిరుపేదల గూడు చెదరగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం ఏమాత్రం కాదని, పూర్తిగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా ఇంచార్జ్ బద్ద మహిపాల్ రెడ్డి, నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, ఉప్పర్ల శారద తదితరులు పాల్గొన్నారు.

## కళాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తాం

### భక్త రామదాసు జయంత్యుత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మహోత్సవాల్లో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 1, ప్రభాతవార్త:** కళలు, కళా రూపాలు తెలంగాణకు ఆత్మ అని ప్రతి గ్రామంలోనూ ఏదోక కళ కనిపిస్తుందని ఆదే తెలంగాణ ప్రత్యేకతని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కొనియాడారు. దేవాలయాలు, పర్యాటకం, సాంస్కృతిక రంగాలు మిళితం చేసి తెలంగాణ అభివృద్ధికి దోహద పడేలా ఒక విధానం రూపొం దించి ముందుకొస్తే తెలంగాణ సంగీత నాటక అకాడమీకి ఇంకా నిధులు పెంచి ప్రోత్సహిస్తామని ఆయన అన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ వాగ్గేయకారులు భక్త రాందాసు 393వ జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగు సినిమా సంగీత దర్శకుడు సాలూరు కోటి జ్యోతి ప్రజల్వనం చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణకు చెందిన మహా వాగ్గేయకారుడు భక్త రామదాసు శ్రీరాముడి భక్తుడిగా విశేష ఖ్యాతి గడించారని గుర్తు చేశారు. కళల వ్యాప్తికి కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని, సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కార దిశగా కళాకారులు చైతన్యం తీసుకొచ్చే విధంగా తమ కళారూపాలతో కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాల్లో కళారూపాలు విరజిమ్మేలా, పర్యాటక ప్రాంతాల్లో కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసేలా అకాడమీ చేస్తున్న కృషికి ఆయన అభినందనలు తెలియజేశారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డా.అలేఖ్య పుంజాల మాట్లాడుతూ గత రెండు నెలలుగా తెలం గాణలోని అన్ని జిల్లాల్లో కృషి చేసి రెండు వేల మంది కళాకారులను సమీకరించి రామదాసు ఉత్సవాలను నిర్వహించడం జరిగిందన్నారు. పద్మశ్రీ డా.యెల్లా వెంకటేశ్వరరావు, కేంద్ర సంగీత అకాడమీ అవార్డు గ్రహీతలు రాఘవాచారి, కళాకృష్ణ, హరిప్రియ, శేషులత, కమల, శ్వేతాప్రసాద్, అయ్యగారి శ్రీదేవి, రోహిణి కందాల, మంథా శ్రీనివాస్, డా.శ్రీకాంత్, ఆర్.నాగేశ్వర్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండువేల మందికిపైగా కళాకారులకు ప్రదర్శనా అవకాశం కల్పించడం విశేషం.

## మంత్రి వాకిటి శ్రీహరి బృందం గుజరాత్ పర్యటన

### అమూల్ పాల ప్లాంట్ సందర్శన

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** పాడి పరిశ్రమ అభివృద్ధి విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బృందం గుజరాత్ రాష్ట్రంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆనంద్‌లోని ప్రముఖ అమూల్ పాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శించింది. అమూల్ ప్లాంట్ సందర్శనకు వచ్చిన మంత్రి బృందానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి) చైర్మన్ డాక్టర్ మీనేష్ షా బృందం ఘనస్వాగతం పలికింది. ఈ సందర్భంగా అమూల్ సంస్థలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పాల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ వ్యవస్థలపై మంత్రి బృందానికి వివరించింది. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, సహకార వ్యవస్థను మరింత విస్తరించడం వంటి అంశాలపై గుజరాత్ అధికారులు వివరించారు.అమూల్ మోడల్ ప్రగతి పథంపై, దేశవ్యాప్తంగా సహకార డెయిరీరంగ అభివృద్ధిలో ఎన్‌డిడిబి పాత్రపై మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గుజరాత్‌లో అమూల్‌మోడల్ ద్వారా సాధించిన విజయాలు తెలంగాణకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. తెలంగాణలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వ కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మహిళల ఆర్థిక సాధికారతలో డెయిరీరంగం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. పాల ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, సహకార వ్యవస్థ బలోపేతం, రైతులకు మెరుగైన ధరలు అందించే దిశగా గుజరాత్ అనుభవాలను తెలంగాణలో అమలు చేయాలని తెలిపారు. గుజరాత్‌లో గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పాల ఉత్పత్తి కేంద్రాల అభివృద్ధి ఆదర్శనీయమన్నారు. తెలంగాణలో పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి శ్రీహరి వెల్లడించారు. గుజరాత్ పర్యటనకు వచ్చిన సందర్భంగా స్వాగతం పలికిన ఎన్‌డిడిబి చైర్మన్ డాక్టర్ డాక్టర్ మీనేష్ షాకు, ఇతర గుజరాత్ రాష్ట్ర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి వాకిటి బృందంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ ప్రకటించింది. ఇకపై ఆర్టీసీ బస్సుల్లో వారు ఉచితంగా ప్రయాణించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని మహిళలకు మహాలక్ష్మీ పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా ఇకపై దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 47ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అన్ని వయసుల బాలికలు, మహిళలు, లింగమార్పిడి (ట్రాన్స్ జెండర్స్) వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడుపుతున్న బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చు. వారు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో రాష్ట్ర సరిహద్దుల్లో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్ర సరిహద్దుల వరకు అంతర్ రాష్ట్ర ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం ఉచితం. మహిళా ప్రయాణికులు ప్రయాణించిన వాస్తవ దూరం ఆధారంగా వసూలు చేయబడే ఛార్జీల ఖర్చును ప్రభుత్వం టిజిఎస్ఆర్‌టిసికి తిరిగి చెల్లిస్తుంది. ఇదే విధానాన్ని దివ్యాంగుల విషయంలోనూ అమలు చేయనున్నట్టు ఉత్తర్వులో పేర్కొంది.

## హైదరాబాద్ పరిసరాల్లో కబ్జా చేసిన ఘనులు మాజీమంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు

### ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శ

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** హైదరాబాద్ చుట్టుపక్కల పరిసరాల్లో ఖబ్జాచేసిన ఘనులు కెటిఆర్,హరీష్‌రావులు అని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. ఆదివారం గాంధీ భవన్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ విలేఖరులతో మాట్లాడుతూ అధికారం పోగానే గుంట నక్క కెటిఆర్ సాధు జంతువు అయ్యాడు ఇప్పుడు ఈ గుంట నక్క మొసలి కన్నీరు పెడుతున్నట్లు గా నటిస్తున్నారని దుయ్యబట్టారు. గత పదేళ్లలో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను కబ్జాలు చేసింది మీరు కాదా?! అన్నారు. దేవాలయ భూములు, వైకుంఠ దామాలు అని తేడా లేకుండా కబ్జాలు చేశారనీ ఆరోపించారు. ఎంత పరిగెత్తినా గాడిద గుర్రం కాదు తరతరాలు వస్తున్న దుర్మార్గాన్ని నువ్వు మార్చుకోలేవని ఎద్దేవా చేశారు. కెటిఆర్ హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కెటిఆర్ , హరీశ్ రావు లాంటి నీచరాజకీయాలు కాంగ్రెస్ చెయ్యదనీ ఇద్దరు కలిసిన రేవంత్ రెడ్డికి సరిపోరు అని ఆయన అన్నారు.

## 41 మంది ఐఎఎస్‌లకు సెక్రటరీ హోదా

### మరో 28 మంది అదనపు కార్యదర్శులుగా నియామకం

### రాష్ట్ర పిఆర్ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్‌కు అవకాశం

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** దేశంలోని పలు రాష్ట్రాల కేడర్‌లలో పని చేస్తున్న ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) లకు వారి హోదాను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 41 మంది ఐఎఎస్‌లకు (1990-1995 బ్యాచ్) సెక్రటరీ హోదా కల్పిస్తూ క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది. కార్యదర్శి స్థాయిలో ఎంపికైన వారి జాబితాలో సంజయ్‌కుమార్ (తెలంగాణ కేడర్), 1995 బ్యాచ్ జమ్మూ కాశ్మీర్ కేడర్ అధికారి రోహిత్ కన్సల్, ప్రస్తుతం చండీగఢ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ రాజేష్ ప్రసాద్, కేశవ్ కుమార్ పాఠక్ (1990 బ్యాచ్, బీహార్ కేడర్), టీ. గోపాలకృష్ణన్ (1991 బ్యాచ్, తమిళనాడు కేడర్), సురేంద్ర కుమార్ బాగ్దే (1993 బ్యాచ్, మహారాష్ట్ర కేడర్) వంటి సీనియర్ అధికారులు కూడా ఉన్నారు. అలాగే మరో 28 ఐఎఎస్‌లకు వివిధ విభా గాల్లో అదనపు కార్యదర్శులుగా నియమకం జరిపింది. ఈ అదనపు కార్య దర్శుల జాబితాలో మన్దీప్ భండారి మరియు సరితా చౌహాన్ తదితరులు ఉన్నారు. ఈ నియామకాలు సీనియర్ పరిపాలనా నాయకత్వాన్ని బలో పేతం చేయడానికి, కేంద్ర స్థాయిలో కేడర్ నిర్వహణను క్రమబద్ధీకరించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ హోదాను పెంచింది. ఈ మేరకు వాటి వివరాలను సంబంధిత అధికారులకు తెలుపుతూ కేంద్రం పంపిన సర్క్యులర్లు ఆదివారం అందాయి. ఇందులో భాగంగా తెలంగాణ కేడర్‌లో ఉన్న ఐఏయస్ సంజయ్‌కుమార్‌కు కూడా కేంద్రంలో సెక్రటరీ స్థాయి హోదా దక్కింది. ప్రస్తుతం సంజయ్‌కుమార్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

## ఇరాన్‌పై దాడులు వెంటనే నిలిపివేయాలి

### ఎంపి అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్ (చార్మినార్), మార్చి 1 ప్రభాతవార్త :** ఇరాన్‌పై ఆమెరికా, ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని, దాడులు వల్ల ఎంతో నష్టం కలిగిందని ఎఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ దాడులు ఆపక పోతే భవిష్యత్తులో తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. ఇరాన్‌పై ఆమెరికా, ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి చెందటం పట్ల తన తీవ్రనిరసన వ్యక్తం చేశారు. కోటి మంది భారతీయులు గల్ఫ్ దేశాలలో ఉన్నారని, వారంత ఇబ్బందులకు గురివుతున్నాని ఆయన తెలిపారు. ఇరాన్‌పై జరిగిన దాడిని ఎంఐఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఆయన తెలియజేశారు. మక్కాకు వెళ్లిన యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దుబాయి ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు చిక్కుకున్నారని ఆయన తెలిపారు. యుద్ధం వల్ల ధరలు బాగా పెరిగనున్నాయని, భారత దేశంపై కూడ భారం పెరుగు తుందని ఓవైసీ వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జ్యోకం చేసుకుని శాంతి కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

## కవితను కలిసిన తారకరత్న భార్య అలేఖ్యారెడ్డి

### ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించడంపై హర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 1:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కోర్టు నుంచి భారీ ఊరట లభించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం పట్ల ఆమె సన్నిహితులు, కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే దివంగత నందమూరి తారకరత్న అర్ధాంగి అలేఖ్యరెడ్డి.. కవితను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కవిత కుటుంబసభ్యులతో కలిసి ఆమె విజయోత్స వంలో పాల్గొన్నారు. అలేఖ్యరెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కవితతో దిగిన ఫొటోను షేర్ చేస్తూ ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 'నీ విజయం పట్ల చాలా సంతోషంగా ఉంది. నువ్వు నిరూ పించుకున్నావ్.. నిజంవైపు నిలబడ్డావు.. చివరకు సాధించావు' అంటూ అలేఖ్య రాసు కొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలోనూ అలేఖ్యరెడ్డి కల్వకుంట్ల కవితతో తనకున్న సుదీర్ఘ అనుబంధం గురించి సోషల్ మీడియాలో ప్రస్తావించారు. తమ స్నేహం గత 20 యేళ్లుగా కొనసాగుతోందని, ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చిన ప్పటికీ తమ బంధం చెక్కుచెదరలేదని తెలిపారు. కవిత అంటే తనకు ఎంతో అభిమానమని, తామిద్దరం ఎప్పుడూ కలిసిమెలిసి ఉంటామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తమ స్నేహం ఇలాగే కొనసాగాలని అలేఖ్య ఆకాంక్షించారు.

# మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

### 8 నుంచి మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి1:** క్రీడా రంగంలో దేశంలోనే అత్యంత చురుకైన నగరంగా పేరుగాంచిన హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా వేడుకకు వేదిక కానుంది. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి హాకీ(ఎఫ్ఐహెచ్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 టోర్నమెంట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించబడింది. ఈ పోటీలు మార్చి 8 నుండి 14, 2026 వరకు హైదరాబాద్‌లోని నూతనంగా పునర్నిర్మించబడిన గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. పాల్గొనే జట్లుఈ క్వాలిఫయర్స్‌లో మొత్తం ఎనిమిది దేశాల జట్లు పాల్గొంటున్నాయి. భారత్ ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ తదితర దేశాలు ఈ టోర్నమెంట్ 2026 మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు కీలక పాత్ర పోషించనుంది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయబడ్డాయి. స్టేడియంలో:అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రో టర్ఫ్ఆధునిక సదుపాయాలుఅత్యున్నత భద్రతా ఏర్పాట్లుక్రీడాకారులు మరియు అధికారుల కోసం ప్రీమియం వసతిఅందుబాటులో ఉంచబడ్డాయి. అలాగే హాకీ ఇండియా.ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి హాకీ ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జట్ల రాక:- భారత జట్టు, ఇంగ్లాండ్, స్కాట్లాండ్, ఉరుగ్వే జట్లు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకు న్నాయి. అన్ని జట్లకు అంతర్జాతీయ ప్రమాణాల వసతి మరియు ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించబడ్డాయి.

తెలంగాణ సంస్కృతి పరిచయం:-ఈ టోర్నమెంట్ సందర్భంగా నగరానికి విచ్చేసే క్రీడాకారులు, అంతర్జాతీయ ప్రతినిధుల కోసం ప్రత్యేక వారసత్వ పర్యటనలు, వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. క్రీడాభివృద్ధికి తెలంగాణ కట్టుబాటు:- రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత వలన తెలంగాణలో అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 నిర్వహణతో హైదరాబాద్ మరోసారి ప్రపంచ క్రీడా పటంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది.

# మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఖబడ్దార్

### బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్ చేస్తున్నారు: మాజీ మంత్రి కెటిఆర్

**హైదరాబాద్ (నార్సింగి), మార్చి 1, ప్రభాతవార్త :** గాంధీ సరోవర్, మూసీ అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష ఇళ్లను కూల్చే కుట్ర చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో ఉన్న కేకే-2, కేంద్రీయ విహార్, మధు అపార్టుమెంట్లలోని బాధితులను మాజీ మంత్రులు సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. మూడున్నర కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. కేంద్రీయ విహార్ వద్ద, మధు అపార్టుమెంట్‌లో బాధితులను ఉద్దేశించి కేటిఆర్ మాట్లారు. బాధితులం దరికి బిఆర్ఎస్ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని హామీనిచ్చారు. బాధితులంతా ఐక్యంగా ఉంటేనే మీకు న్యాయం జరుగుతుందని, ప్రలోభాలకు లొంగితే నష్టపోయేది మీరేనని తెలిపారు. మీకు న్యాయం చేసేందుకే మేము మీ వద్దకు వచ్చామని, రాజకీయంగా, న్యాయపరంగా మీకు అండగా ఉండి పోరాడుతామని కేటీఆర్ హామీని చ్చారు. ఒక్క ఇంటిని కూల్చకుండా కేసీఆర్ పాలనలో నాగోలు వద్ద 5.కిలోమీటర్ల దూరం మూసీని అభివృద్ధి చేశామని వివరించారు. కేవలం రూ.16.వేల కోట్లతోనే మూసీ మొత్తంను బ్యూటిఫికేషన్ చేయడం, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, క్రీడా వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లు, మూసీ మధ్యలో బ్రిడ్జి నిర్మించడం వంటి పనులు పూర్తి చేసేలా బిఆర్ఎస్ డిపిఆర్ రూపొందించిందని, సీఎం రేవంత్‌రెడ్డికి మూసీని శుద్ధి చేయాలని నిజంగానే చిత్తశుద్ధి ఉంటే దాన్ని అమలు చేయాలన్నారు. గతంలోనే తాము రూ.3,866కోట్లు వెచ్చించి 32.ఎస్టీపిలు నిర్మించామని, 80.శాతం వర్క్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన 20.శాతం పనులు చేపడితే మూసీలో డ్రైనేజి కలువకుండా, శుద్ధి చేసిన నీటిని పారించవచ్చన్నారు. కమీషన్లు దండుకునేందుకు ఏకంగా లక్షా 50.వేల కోట్లకు వ్యయంను పెంచే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీటిని 15.టీఎంసిల నీటి సామర్థ్యం ఉన్న కొండ పోచమ్మ ప్రాజెక్టు నుంచి గండిపేటకు గ్రావిటీ ద్వారా తరలించాలని, అక్కడి నుంచి మూసీలో పారిస్తే ఏడాదంతా స్వచ్ఛమైన నీటితో మూసీ కళకళలాడు తుందన్నారు. ఈ పనిని కేలం 1100 కోట్లతో పూర్తి చేయవచ్చ న్నారు. బఫర్ జోన్‌లో పేదల ఇళ్లు ఉన్నాయని కూలుస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం అదే బఫర్‌జోన్‌లో బడా బడా హోటళ్లు, రిసార్టులు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఒక్క ఇళ్లను కట్టలేని సీఎం ఇప్పటికే వందలాది ఇళ్లను నేలమట్టం చేశారని, ఏకంగా లక్షన్నర ఇళ్లను కూల్చే కుట్ర చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగంను పట్టుకొని యూపిలో బుల్డోజర్ పాలన సాగుతుందని ఆరోపిస్తారని, ఇక్కడ తెలంగాణలో కూడా మీ పార్టీ సీఎం అదే బుల్డోజర్ పాలన చేస్తున్నారని, అది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. గుజరాత్‌లో సబర్మతీ నదికి ఇరువైపులా గోడలు నిర్మించి, లోతు పెంచి స్వచ్ఛమైన నీటిని పారిస్తున్నారని, అక్కడ ఒక్క ఇంటిని కూడా కూల్చలేదన్నారు. రైతులకు రైతు బంధు, వృద్ధులకు ఆసరా పింఛన్లు, మహిళలకు పింఛన్లు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్న సీఎం ఈ గాంధీ సరోవర్‌కు ఎక్కడి నుంచి డబ్బులు తెస్తారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి వ్యవహారం తెలిసే రాజధాని హైదరాబాద్ ప్రజలు ఒక్కటంటే ఒక్క సీటును కూడా కాంగ్రెస్‌కు ఇవ్వలేదన్నారు. గ్రామీణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420.హామీలు ఇస్తామని నమ్మబలికి ఓట్లేయిం చుకున్నాడన్నారు. ఇప్పుడు వారికి కూడా మొండి చేయి చూపిస్తున్నారన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో ఇళ్లు కోల్పోయే బాధితులకు బిఆర్ఎస్ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందన్నారు. పూర్తి ఉచితంగా మీ కేసులు కోర్టులో వాదించేందుకు న్యాయవాదులను నియమిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, కార్తిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రావణ్, రాజు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, బాధిత ప్రజలు పాల్గొన్నారు.




హైదర్షాకోట్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మూసీ ఇళ్ల బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్

## ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే యత్నం

### విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేస్తాం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 1:** మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తే విద్యాకమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేస్తామని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ క్లారిటీ ఇచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బ తీసే ప్రయత్నం ఈ రిపోర్టులో జరిగింది, లక్షా 70 వేల మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని ఆరోపించారు. ఉపాధ్యాయుల జీతాలను విద్యాకమిషన్ కాదు నిర్ధారించాల్సింది. పీఆర్సీ నిర్ణయించాలి ..ఒళ్ళంతా విషం నింపుకుని ఆకునూరి మురళి ఈ రిపోర్ట్ తయారు చేశారు. ఏ మాత్రం సమీక్షించకుండా పదేళ్ల కేసీఆర్ పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని మురళి ఎలా అంటారు ?..లక్షా 70 వేల మంది ఉపాధ్యాయులకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. విద్యుత్ కమిషన్ కాళేశ్వరం కమిషన్‌లతో కేసీఆర్ కృషిని తక్కువ చేసే ప్రయత్నం చేశారు .ఇపుడు విద్యాకమిషన్ రిపోర్ట్ తో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీసే కుట్ర చేశారని ఆరోపించారు. విద్యాకమిషన్ రిపోర్టులో సిరిసిల్లలో గురుకులాల ఫోటోలు పెట్టారు. గౌలి దొడ్డి ఎక్సలెన్స్ స్కూల్ ను విద్యా కమిషన్ సందర్శిస్తే వాస్తవాలు తెలిసేవి..ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఎందుకు..? ఏ సంక్షేమ గురుకులం అయినా అన్ని వర్గాల విద్యార్థులు కేసీఆర్ హయాంలో ఏమీ చేయకుంటే ఆ ఫోటోలు ఎలా పెట్టారు.. ? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు అనేది లోప భూయిష్ఠమైన విధానం ..అన్నీ బంద్ చేస్తామనే విద్యాకమిషన్ రిపోర్ట్ ఇచ్చింది .ఇట్లా అయితే విద్యా ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయి..? ప్రభుత్వ డబ్బును కేసీఆర్‌ను తిట్టడానికి ఎలా దుర్వినియోగం చేస్తారు..? ఎంఈఓలు, డీఈఓ లను డైరెక్ట్ గా రిక్రూట్ చేస్తే ప్రమోషన్లు ఎలా చేస్తారు.. ? విద్యా వ్యవస్థలో ఖర్చు ఎట్లా తగ్గించాలని రిపోర్ట్ ఇచ్చినట్టుంది. మురళికి అప్పగించిన బాధ్యత ఏమిటీ..? ఆయన చేసిందేమిటీ? అని ప్రశ్నించారు.

## 305 చోట్ల ఇ-సిగరెట్ల అమ్మకాలు

### గుట్టురట్టు చేసిన ఈగల్ టీమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి1:** రాష్ట్రంలో ఈసిగరెట్ విక్రయాల ముఠాగుట్టును ఈగల్ పోలీసులు రట్టు చేశారు.2 నెలల క్రితం హైదరాబాద్‌లోని ఒక పాఠశాల శౌచాలయంలో విద్యార్థులు ఈ సిగరెట్లు వాడిన ఉదంతం ఆధారంగా చేసుకుని తెలంగాణ ఈగల్ కూపీలాగారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 305 చోట్ల ఈసిగరెట్లు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. దీనితో పాటు పలు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పలు జిల్లాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు.

దాదాపు రెండు నెలలపాటు నిఘా పెడుతూ సాంకేతికతను వినియోగించుకుని,ఇతర ఆధారాలతో ఈ-సిగరెట్లు విక్రయించే ప్రాంతాలను అధికారులు గుర్తించారు. వ్యాపెక్స్ కంపెనీ పేరుతో ఈ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అవి ఎక్కడెక్కిడికి చేరుతున్నాయి అనే వివరాలు సేకరించినట్లు ఈగల్ అధికారులు ఓ ప్రకటన విడదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాదేపల్లిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో 3 పాన్ డబ్బాల్లో మైనర్లకు సిగరెట్లు, గుట్కా విక్రయిస్తున్న అధికారులు గుర్తించారు. ఈ అక్రమానికి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు.రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఈ పాన్ షాపులు ఉన్నాయి.8 మంది మైనర్లకు సిగరెట్లు, గుట్కా విక్రయించినందుకు ఏకే పాన్‌షాప్ యజమాని అబేద్ మొహిద్దీన్ ఖాన్, జకీర్ పాన్‌షాప్ యజమాని మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం, మతీన్ షాన్‌షాప్ సయ్యద్ ఫహీముద్దీన్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ 205, రంగారెడ్డి 54, మెదక్ 13, ఖమ్మం 6, మహబూబ్‌నగర్ 6, కరీంనగర్ 5, నిజామాబాద్ 4, ఆదిలాబాద్ జగిత్యాల 2, కామారెడ్డి 2, నల్గొండ 2, మేడ్చల్ 2, సూర్యాపేట 1, వనపర్తి 1 ఈ జిల్లాల్లో ఈ సిగరెట్లు విక్రయాలు జరుపుతున్నారని ఆధారాలను అధికారులు సేకరించారు.

# అడవిబాట నుంచి అన్న ఒడికి 'అభయ్'

### 45 యేళ్ల తర్వాత సొంత గూటికి చేరిన మల్లోజుల

### ఆపరేషన్ కగార్‌లో కీలక మలుపు

### జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు నేత

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** నాలుగున్నర దశాబ్దాల పాటు సాయుధ పోరాట మార్గంలో అలుపెరగని ప్రయాణం చేసిన మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్, ఎట్టకేలకు తన సొంత గూటికి చేరుకున్నారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో 60 మంది సాయుధ నక్సల్స్‌తో జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన, లొంగిపోయిన తర్వాత మొదటిసారిగా తన స్వగ్రామమైన పెద్దపల్లికి చేరుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్పీ ప్రత్యేక ప్రొటెక్షన్‌లో మహారాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయన తన అన్న మల్లోజుల ఆంజనేయులను కలుసుకునేందుకు పెద్దపల్లిలోని భరత్‌నగర్ నివాసానికి రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

పెద్దపల్లి కోఆపరేటివ్ బ్యాంక్‌లో పనిచేసి రిటైర్ అయిన మల్లోజుల ఆంజనేయులు ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారు. దాదాపు 45 యేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన అన్నను, కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను కలుసుకున్న వేణుగోపాల్ భావోద్వేగానికి లోనయ్యారు. ఇన్నాళ్లు అడవి బాటలో గడిపిన ఆయన, ఇప్పుడు జనజీవనంలోకి వచ్చి తన వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు.రాడికల్ స్టూడెంట్ నుండి పొలిట్ బ్యూరో వరకు... మల్లోజుల వేణుగోపాల్ విప్లవ ప్రస్థానం విద్యార్థి దశలోనే మొదలైంది. నిజాం విముక్తి పోరాటంలో తన తండ్రి కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికుడిగా ఉంటూనే పోరాటాల్లో కీలక పాత్ర పోషించగా, ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న తనయుడు సమసమాజ స్థాపన కోసం సాయుధ మార్గం ఎంచుకున్నాడు. పీపుల్స్ వార్ ఆవిర్భావానికి ముందు రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆరఎస్‌యు) ఆర్గనైజర్‌గా ఎమ్, వి పేరుతో ప్రస్థానాన్ని ప్రారంభించారు. నడుముకు తపంచా తగిలించుకుని, సైకిల్‌పై ప్రయాణిస్తూ విద్యార్థులకు సిద్ధాంత బోధన చేసేవారు. పొరెడ్డి వెంకన్న దళంలో సభ్యునిగా అడవి బాట పట్టిన ఆయన, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలూకాలో పార్టీ బాధ్యతలు చేపట్టారు. తన క్రమశిక్షణతో పార్టీలో కేంద్ర కమిటీ సభ్యునిగా, ఆపై పొలిట్ బ్యూరో సభ్యునిగా ఎదిగారు. భూపతి, సోనుదాదా, అభయ్ వంటి పేర్లతో దశాబ్దాల పాటు క్రియాశీలకంగా వ్యవహరించారు. మొదట్లో తపంచా వాడిన ఆయన, కాలక్రమేణా ఏకే47 పట్టారు.ఒకే ఇంట ఇద్దరు విప్లవకారులు పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధునమ్మ దంపతుల ముగ్గురు కుమారుల్లో వేణుగోపాల్ చిన్నవాడు. తండ్రి కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పని చేశాడు. ప్రస్తుతం అతని తల్లిదండ్రులు ఇద్దరు చనిపోయారు. మల్లోజుల కోటేశ్వర్ రావు (కిషన్ జీ), వేణుగోపాల్ రెండో అన్న అయిన కిషన్ జీ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుని గా ఉంటూ 2011లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యారు. కిషన్ జీ భార్య కల్పన కూడా ఇటీవల అనారోగ్య కారణాలతో డీజీపీ ముందు లొంగిపోయారు. వేణుగోపాల్ భార్య తారా (అహేరీ తాలూకాకు చెందిన వారు) కూడా ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర ప్రభుత్వం ముందు లొంగిపోయారు.మలుపు తిప్పిన ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ వల్ల దండకారణ్యంలో మావోయిస్టుల కార్యకలాపాలు స్తంభించాయి. కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావు (బసవరాజ్) ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీలో తీవ్ర చర్చలు జరిగాయి. ఆయుధాలను వదిలేసి ప్రజలతో మమేకం కావడం మంచిదన్న అభయ్ నిర్ణయాన్ని తెలంగాణ కమిటీ తప్పుపట్టినప్పటికీ, బస్తర్ నార్త్ డివిజన్, గడ్చిరోలి డివిజన్ కమిటీలు ఆయనను సమర్థించాయి. చివరకు 22 పేజీల లేఖలో తన అభిప్రా యాలను వెల్లడిస్తూ, అభయ్ తన సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిశారు. కాగా, ఆయనపై రూ.2కోట్ల రివార్డు ఉంది. శాంతియుత మార్గంలో తన కుటుంబం మధ్య కు చేరిన ఈ మాజీ విప్లవ యోధుడిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు. అనంతరం మల్లోజుల వేణుగోపాలరావు తిరిగి మహారాష్ట్ర పోలీసులతో వెళ్లిపోయారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమానాల రద్దు

### గల్ఫ్ ప్రయాణికుల అవస్థలు

**హైదరాబాద్ (శంషాబాద్), మార్చి 1, ప్రభాతవార్త:** ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా విమానయాన సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా విమాన మార్గాలను మార్చడం లేదా రద్దు చేస్తున్నాయి. ఆదివారం తాజా పరిణామాల ప్రకారం... శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రధానంగా గల్ఫ్, అరబ్ దేశాలకు వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. శంషాబాద్ నుంచి వివిధ దేశాలకు వెళ్లాల్సి న 23 విమాన సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సి న 21 విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. దుబాయ్, దోహా (ఖతార్), కువైట్, దమ్మమ్, సౌదీ అరేబియా, షార్జా, అబుదాబి, జెడ్డా, మస్కట్ దేశాలకు వెళ్లాల్సి న 23 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

**ప్రయాణికుల ఆందోళన..**

ముందస్తు సమాచారం లేకుండా విమానాలు రద్దు కావడంతో ఎయిర్ పోర్టులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర దేశాలకు వెళ్లాల్సి న ప్రయాణికులు తమ కనెక్టింగ్ ఫ్లైట్స్ మిస్ అవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఎయిర్ పోర్టులోనే పడిగాపులు కాస్తున్నారు. కొన్ని సంస్థలు టికెట్ రీఫండ్ లేదా ప్రత్యామ్నాయ తేదీలను కేటాయిస్తున్నప్పటికీ, యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో సర్వీసులు ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

**యుద్ధం కారణంగా విమాన మార్గాల్లో మార్పులు**

ఇరాన్, ఇజ్రాయెల్ వైమానిక క్షేత్రాలను మూసివేయడం లేదా ప్రమాదకరంగా ప్రకటించడం వల్ల విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల విమాన ప్రయాణ కాలం 2 నుంచి 3 గంటలు పెరుగుతోంది. సుదీర్ఘ మార్గాల వల్ల ఇంధన ఖర్చు పెరిగి, విమాన టికెట్ల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. గల్ఫ్ దేశాలకు ప్రయాణించాలనుకునే వారు తమ విమాన సంస్థల నుంచి అధికారిక సమాచారం అందిన తర్వాతే ఎయిర్ పోర్టుకు బయలుదేరడం శ్రేయస్కరమని పలువురు చెబుతున్నారు.

# రేపటి నుండి పెరగనున్న ఉష్ణోగ్రతలు

### 39 నుండి 41 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచనలు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** ఈసారి వేసవి ముందే వచ్చేసింది. సాధారణంగా ఏప్రిల్ నెల నుండి పెరుగుతూ వెళ్లాల్సి న ఉష్ణోగ్రతలు మార్చిలోనే రికార్డుస్థాయిలో నమోదు కానున్నాయి. ఫిబ్రవరి రెండో వారం నుంచే రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో పెరిగాయి. తాజాగా ఈ నెల 3 తేదీ నుంచి రాష్ట్రంలో ఎండలు మరింత తీవ్రం కాను న్నాయి. చలికాలం ఇలా ముగిసిందో లేదో ఎండ తీవ్రత భారీగా పెరిగిపోయింది. తెలంగాణలో ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోద వుతున్న క్రమంలో మార్చి నెల ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉష్ణోగ్రతలలో భారీ పెరుగుదల కనిపిస్తుందని, పగటి పూట ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది.

వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలు అయిన భద్రాద్రి, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుండి 41 డిగ్రీల వరకు నమోదు కావొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు 36డిగ్రీల నుంచి 37డిగ్రీల వరకు చేరుకునే అవకాశం ఉంది. అలాగే మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత 37డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానముగా ఆగ్నేయ దిశ నుండి వీస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని, ఫలితంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయని హెచ్చరించింది. మార్చి నుండి మే నెల మధ్య దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోద వుతాయని, తీవ్రమైన వడగాలులు వీస్తాయని భారత వాతావరణశాఖ కూడా హెచ్చరించింది. వడగాలుల ప్రభావం ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తర కర్ణాటక, ఉత్తర తమిళనాడు ప్రాంతాలలో ఎక్కువగా ఉండనుంది. వడగాలుల వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం ఉందని హెచ్చరించింది.


వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగినంత నీరు తాగుతూ శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా చూసు కోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

## వెలుగుమట్ల బాధితులపై లాఠీఛార్జి

### వైరా రోడ్డుపై బైఠాయించిన బాధితులు

### గాయాలతో కన్నీరుమున్నీరైన మహిళలు

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** తెలుగుమట్ల బాధితులపై పోలీసులు విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న మహిళలపై పోలీసులు విచక్షణ రహితంగా దాడి చేయడంతో వారు గాయాలపాలయ్యారు. దీంతో అధికారులపై రాష్ట్ర ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతూ బాధిత మహిళలు కన్నీరు మున్నీరయ్యారు. ఆదివారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి సంఘ నాయకుడు రాకేష్ దత్త, తెలంగాణ బహుజన్ శక్తి సంఘం నాయకుడు రాజు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ పునరావాస కేంద్రమైన అంబేద్కర్ భవనంలో నిరసన దీక్ష చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తుండగా వారు కార్యాలయం వెనుక భాగానికి వెళ్లారు. వారిరువురుని అరెస్టు చేస్తుండగా పునరావాస కేంద్రంలో ఉన్న బాధ్యత మహిళలు పోలీసులను అడ్డగించారు. దీంతో రెచ్చిపోయిన పోలీసులు బాధ్యత మహిళలపై లాఠీచార్జి చేశారు. పోలీసుల లాఠీచార్జితో గాయాలైన బాయత మహిళలు కన్నీరు మున్నీరవుతూ అంబేద్కర్ భవనం నుండి వైరా రోడ్డుకు వచ్చి అక్కడ ధర్నా నిర్వహించారు. ఆ వెంటనే పోలీసులు వచ్చి వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా రాకేష్ దత్త రాజులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై నిరంకుశంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భూదాన్ భూములను కబ్జా చేసే ప్రయత్నంలోనే పేదలను ఖాళీ చేయించారని వారు కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను నేలమట్టం చేశారని ఆరోపించారు. పేదలకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారత మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సీతారాముల కల్యాణం.. భద్రాచలానికి సిఎం

భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేపట్టాలి
ఎటువంటి అపశ్రుతులు జరగకుండా ప్రణాళికలు రూపొందించాలి
వ్యాపారులు అధిక వసూళ్లు చేయకుండా సబ్‌కలెక్టర్ బాధ్యత తీసుకోవాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**భద్రాచలం,ప్రభాతవార్త:** రాముడి కళ్యాణానికి దేశ విదేశాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించి అంగరంగ వైభవంగా కళ్యాణం మరియు పట్టాభిషేకం జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశించారు.ఆదివారం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవాల నిర్వహణపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముల వారి కళ్యాణానికి తెలంగాణ ముఖ్యమంత్రి మరియు ఇతర వివిఐపీలు తప్పనిసరిగా వీక్షించడానికి వస్తున్నందున జిల్లా యంత్రాంగం సమన్వయంతో వారికి అప్పగించిన బాధ్యతలే కాకుండా తోటి అధికారుల బాధ్యతలు కూడా తీసుకొని వివిఐపీలకు, వీఐపీలకు,రామ భక్తులకు గాని, ప్రజలకు గాని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా ప్రవర్తించి అందరూ తనివి తీరా కళ్యాణం తిలకించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని అందుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈ నెల 27 వ తేదీన స్వామివారి కళ్యాణం ఉదయం 10:30 నుండి 12 గంటల 30 నిమిషాల వరకు జరుగుతుందని అలాగే 28 తేదీన జరిగే మహా పట్టాభిషేకం ఉదయం 10:30 గంటల నుండి 12:30 గంటల వరకు జరుగుతుందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం స్వామి వారి టికెట్లు అందుబాటులో ఉంచాలని, స్వామివారి తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు, అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 50 బెడ్లు, ప్రత్యేక వార్డు మరియు వర్షాలతో కలుపుకొని 13 మెడికల్ క్యాంపులు, మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కళ్యాణం తిలకించడానికి మండపాన్ని 26 సెక్టార్లుగా ఏర్పాటు చేసినందున ప్రతి సెక్టార్కు ప్రత్యేక అధికారులను నియమించాలని, భక్తులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు, వివిధ సెక్టార్ల మొదలుకొని భక్తులకు మంచినీళ్ల ట్యాప్ ఏర్పాటు చేయాలని మరియు పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఏడు చోట్ల మరియు భద్రాచలం పట్టణంలో ప్రముఖులు ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని, అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, కరకట్ట ప్రదేశం నుండి కళ్యాణం జరుగు స్టేడియం, భద్రాచలం పట్టణం, దేవాలయం పరిసరాలలో ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా అన్ని చోట్ల గ్రామపంచాయతీ లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. స్వామివారి తలంబ్రాలు పంపిణీకి 80 కౌంటర్లు, లడ్డూలు సరఫరాకు 20 కౌంటర్లు, ప్రతిరోజు లక్షన్నర లడ్డు, భక్తులకు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఈ సంవత్సరం భక్తులకు తలంబ్రాలు ప్రసాదాలు కొరత లేకుండా చూడాలని అన్నారు. గ్రామపంచాయతీ సహకారంతో రోడ్డు శుభ్రంగా ఉండేలా చూసుకొని ములుగు రోడ్డు నుండి భద్రాచలయానికి వచ్చే అన్ని అప్రోచ్ రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయించాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు.

## ఎన్డిడిపి సహకారంతో మదర్ డైరీకి పూర్వవైభవం
### : మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్

**రెడ్డి రాజాపేట ,మార్చ్ 01 ప్రభాతవార్త:** మదర్ డైరీ కి పూర్వ వైభవం వస్తుందని మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ,భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, గుత్తా అమృత్ రెడ్డి లతో కలిసి గుజరాత్ లో నేషనల్ డైరీ డెవలప్మెంట్ చైర్మన్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల్లో మదర్ డైరీ ని హ్యాండోవర్ చేసుకొని 10 కోట్ల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు ఎన్డిడీపీ చైర్మన్ తెలిపినట్లు మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి తెలిపారు . రాష్ట్ర ముఖ్యమంత్రి కోరిక మేరకు మదర్ డైరీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ఎన్డిడిబి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మదర్ డైరీ పరిపాలన వ్యవహారాలు మదర్ డైరీ చూడగా ఎన్డిటివి మాత్రం ఆర్థిక వ్యవహారాలు మార్కెటింగ్ ఉన్నట్టు తెలిపారు .చర్చలు సఫలం కావడం పట్ల మంత్రి వాకిటి శ్రీహరికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, గుత్తా అమృత్ రెడ్డి ల కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు .అతి త్వరలో రైతులకు పాల బిల్లులను అందజేయనున్నట్లు తెలిపారు .రైతులు అధైర్య పడవద్దు అని గతంలో మాదిరిగా మదర్ డైరీ పూర్వ వైభవంతో నడవడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఎన్డిడీబీ సహకారంతో రైతులకు న్యాయం చేస్తామన్నారు.

### ఒక్కసారి దాడితోనే 48 మందిని లేపేశాం : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 1:** ఒక్కసారి దాడితోనే 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం ఇది మాకు అద్భుత విజయం అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.

## ఫసల్‌బీమా అమలు చేసే వరకు పోరాటం ఆగదు
### బిజెఎల్పీ ఉపనేత పాయల్ శంకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి1:** రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేసి పంట నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో సాగు చేసిన పంటలో 30 శాతం మాత్రమే దిగుబడి వచ్చిందని దీంతో రైతులు నష్టపోయి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకం అసలు చేయాలని కేంద్రం కోరితే పెడచెవిన పెట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ కూడా వారి దారిలో పోతూ రైతులను అదుకోవడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కంటితుడుపు చర్యగా బడ్జెట్లో అంకెలు చూపిస్తూ ఆచరణలో పెట్టడం లేదని మండిపడ్డారు. పంట బీమా అమలు డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అదిలాబాద్ కేంద్రంగా రైతులతో కలిసి ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఉద్యమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుండి పంటల బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నామని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న పంట సష్టాలకు తగిన న్యాయం జరగాలంటే బీమా పథకం అమలు అత్యవసరమని స్పష్టం చేశారు..ఈ నెల 16వ తేదీ రైతుల తరఫున సేకరించిన 10 లక్షల దరఖాస్తులతో శాసనసభ సమావేశానికి హాజరై, రైతులు గళాన్ని ప్రభుత్వానికి గట్టిగా వినిపిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ముఖ్య నేతలు రైతుల పక్షాన నిలబడి, ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని రైతులకు భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు.

రైతుల హక్కుల సాధన కోసం ఈ ఉద్యమం కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు.. ప్రకృతి సహకరించని సమయంలో బీమా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని, రాష్ట్రాలకు నిధులు కొరత ఉంటే కేంద్రం బీమా ద్వారా రైతులను ఆర్థికంగా అదుకుంటుందన్నారు. రేవంత్ సర్కార్ ఎన్నికల్లో రైతులకు అడ్డగోలుగా హామీలిచ్చి వాటిని అసలు చేయడంలో నిరక్ష ్యం చేస్తుందని, వారు అధికారం చేపట్టిన తర్వాత ఒక విడత మాత్రమే రైతు భరోసా రైతుల ఖాతాలో జను చేశారని తెలిపారు. రుణమాఫీ విషయంలో చెప్పిన మాట తప్పిందని కొందరికే మాఫీ చేసి మరికొందరికి అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పాతబస్తీ దారుషిఫా ప్రాంతంలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

# ఖమేనీ మృతికి నిరసనగా ముస్లింల ఆందోళన

**చార్మినార్,మార్చి 1 ప్రభాతవార్త :** ఆమెరికా, ఇజ్రాయిల్ వైమానిక దాడులలో ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేనీ మృతి చెందటంతో హైదరాబాద్ పాతబస్తీలో ఆదివారం వేలాది మంది ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఆమెరికా, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ముస్లింలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇజ్రాయిల్, ఆమెరికా దాడులలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు కూతురు,అల్లుడు, కోడలు, మనవడు మృతి చెందిన విషయం తెలియటంతో షియా ముస్లింలు ఉన్న పాతబస్తీలోని దారు షిఫా, నూర్‌ఖాన్ బజార్, బాల్‌శెట్టి ఖేత్, అలీజాకోట్ల, మీరాలం మండి. డబీర్‌పుర, రెయిన్‌బజార్, ఎత్తెబార్ చౌక్‌తో పాటు పలు ప్రాంతాలలో విషాద ఛాయలు అలుము కున్నాయి. ఆదివారం మ ధ్యాహ్నం రెండు గంటలు నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటలు వరకు దారుషిఫా ప్రాంతాలలో వాహనాలను నిలిపి వేశారు. దారుషిపా ప్రాంతాలు మీదుగా చార్మినార్ వెళ్ల వలసిన వాహనాలను మదీనా, సిటీ కళాశాల, మూసాబౌలి, కిల్వత్, శాలిబండ ప్రాంతాలు మీదుగా మళ్లించారు. హైదరాబాద్ పాత నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లింలు పురానీహవేలీ నుంచి ర్యాలీగా బయలు దేరి దారుషిఫా గ్రౌండ్‌కు చేరుకున్నారు. దారుషిఫా మైదానం లో వేలాది మంది ముస్లింలు ఆమెరికా, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులు వెంటనే ఆపాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హాసన్ అఫెందీ, పలు షియా ముస్లింల సంస్థల ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ యుద్ధం కారణంగా విదేశాలలో చిక్కుకున్న భారతీయులను మన దేశానికి క్షేమంగా తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు.

కాగా ఆమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులు చేయటం పట్ల పాతబస్తీకి చెందిన ముస్లిం మత ప్రముఖులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొన్న ముస్లింలు ఇజ్రాయిల్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు.

మీర్‌చౌక్ పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చికెన్ ట్రిబుల్ సెంచరీ
## కిలో రూ.300కు చేరిన ధరలు

### మరింత పెరిగే ఛాన్స్

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత నెలలో పోలిస్తే ట్రిబుల్ సెంచరీకి చేరాయి. ఎండలు ప్రారంభం కావడంతో చికెన్ ధరలు పెరుగుతున్నాయి. దీంతో నాన్ వెజ్ ప్రియులకు షాక్ తగులుతోంది. గత వారంతో పోలిస్తే రూ.50 నుంచి రూ.60 మేర పెరిగాయి. గత నెలలో ప్రాంతాలను బట్టి కేజీ స్కిన్ లెస్ చికెన్ రూ.240 నుంచి రూ.250 మధ్య పలకగా, ఆదివారం నాటికి ట్రిపుల్ సెంచరీకి చేరుకున్నాయి. రెండు రాష్ట్రాల్లో దాదాపు అన్ని ప్రాంతాల్లో కేజీ స్కిన్ లెస్ చికెన్ రూ.300కి చేరుకుంది. అసలే ఆదివారం కావడంతో చికెన్ తినేందుకు నాన్ వెజ్ ప్రియులు షాపుల ముందు క్యూ కడుతున్నారు. ధరలు పెరగడంతో జేబు నుంచి ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులకు భారంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో చికెన్ ధరలు చూస్తే హైదరాబాద్‌లో కేజీ స్కిన్ లెస్ ధర రూ.290 నుంచి రూ.300 మధ్య పలుకుతోంది. లైవ్ ఫారం కోడి ధర రూ.150, లైవ్ కోడి రిటైల్ ధర రూ.177గా ఉండగా, విత్ స్కిన్ చికెన్ ధర రూ.257గా కొనసాగుతోంది. గత వారంలో స్కిన్ లెస్ రూ.240 నుంచి రూ.250 మధ్య లభించేది. ఇక 12 ఎగ్స్ రిటైల్ ధర రూ.66గా కొనసాగుతోంది. విజయవాడలో కేజీ స్కిన్ లెస్ ధర రూ.270, విశాఖపట్నంలో రూ.300 వద్ద కొనసాగుతోంది. గుంటూరులో కేజీ చికెన్ రూ.250గా ఉంది.

కాగా గత నెలలో తగ్గిన ధరలు సమ్మర్ వస్తుండటంతో ఎండ వేడికి కోళ్లు చనిపోయే అవకాశముంటుంది.

దీని వల్ల ఎండాకాలంలో చికెన్ ధరలు మండిపోతూ ఉంటాయి. మరోపక్క వివాహాలు వంటి వాటితో రానున్న కొద్ది నెలల పాటు చికెన్ ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు.

## బిసి రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు
### జరపాలి: బిసి సంఘాల డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మార్చి 1 ( ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల సమ యంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని 14 బీసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో డాక్టర్ రాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో జరిగిన కీలక సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం సరికాదని హెచ్చరించారు. గత ఏడాది కాలంగా వందలాది ధర్నాలు, ర్యాలీలు, రాష్ట్ర బంద్ నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న 42 శాతం రిజర్వేషన్ల కేసును త్వరితగతిన విచారణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం జీవో నెం.9 ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఈ రిజర్వేషన్లు కల్పించే అధికారం ఉందని గుర్తుచేశారు. ఆర్టికల్ 243డి 6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని, గతంలో సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు పెంచవచ్చని నేతలు పేర్కొన్నారు. బీసీ సంఘాల నాయకులను బెదిరించి ఉద్యమాలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని, బీసీ వాదం ఇప్పుడు పల్లె పల్లెకూ చేరిందని వారు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్ డ్రైవ్ దాడులు

506 మంది
మందు బాబుల పట్టివేత

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్ర వారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 506 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 401 మంది ద్విచక్ర వాహనదారులు, 47 మంది ఆటో డ్రైవర్లు, 58 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 104 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు, 214 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 105 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 43 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 24 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగురు 251 నుంచ 300 పాయింట్ల వరకు, 10 మం ది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవి ంచినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు న మోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగు తాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

# రూ.52 వేల కోట్ల రుణాలు రీ షెడ్యూల్

### కాళేశ్వరం రుణం రూ.27 వేల కోట్లు మార్పు
### ఇప్పటికే రూ.26 వేల కోట్లు వాయిదా
### భారీగా తగ్గనున్న వడ్డీల భారం
### దీర్ఘకాలిక రుణాలుగా స్వల్పకాలిక అప్పులు

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** వివిధ సంస్థలు, కార్పొరేషన్ల పేరుమీద తీసుకున్న రుణాలను రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ అనుమతితో రీ షెడ్యూల్ చేయించే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా స్వల్పకాలిక రుణాలను తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక అప్పులుగా పునర్వవస్థీకరించుకోవడం ద్వారా ప్రభుత్వంపై పడుతున్న ఆర్థిక భారం నుండి తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసుకున్న అప్పుల నుంచి ప్రభుత్వానికి కొంత ఉపశమనం లభించింది. రుణాల వడ్డీ రేటు తగ్గడంతో పాటు, చెల్లింపు వ్యవధి పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి 10.90శాతం వార్షిక వడ్డీతో రుణం తీసుకుంది. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.87,449 కోట్లు రుణం మంజూరు కాగా, ఇందులో రూ.71,566 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తంలోనే పాలమూరు రంగారెడ్డి పథకానికి కూడా రూ.10 కోట్ల రుణం ఉండగా, రూ.7,722 కోట్లు విడుదలయ్యాయి. ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి విడుదలైన రూ.71,566 కోట్ల రుణంలో ఇప్పటిదాకా చెల్లించింది పోను ఇంకా రూ.68,273 కోట్లు బకాయి ఉంది. అయితే వార్షిక వడ్డీని 7.5శాతానికి తగ్గించడానికి కేంద్రం అంగీకరించడంతో రాష్ట్రప్రభుత్వం ఏకకాలంలో రూ.33,574.11 కోట్లను చెల్లించగా, మరో రూ.27 వేల కోట్ల రుణాన్ని దీర్ఘకాలిక వాయిదాల కింద పునర్‌వ్యవస్థీకరించుకుంది. ఈ రుణం మెత్తాన్ని వచ్చే 10 ఏళ్లలో చెల్లించాల్సి ఉండగా, ఈ వ్యవధి 30 ఏళ్లకు పెరిగింది. వార్షిక వడ్డీ కూడా 10.90శాతం నుంచి 7.50 శాతానికి తగ్గడంతో ఏటా తిరిగి చెల్లించాల్సి మొత్తం కూడా తగ్గింది. దీంతో ఇప్పటివరకు ఏటా రూ.13 వేల కోట్లుగా ఉన్న చెల్లింపు మొత్తం రూ.9 వేల కోట్లకు తగ్గనుంది. కాగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ అనుమతితో అధిక వడ్డీ రేట్లతో డిసెంబరు వరకూ ఉన్న సుమారు రూ.26,103 కోట్ల పాత రుణాలను తక్కువ వడ్డీ రేటు (77.5 శాతం) కలిగిన దీర్ఘకాలిక రుణాలుగా రీస్ట్రక్చర్ చేసింది. ఈ ప్రక్రియ ద్వారా, 2035 వరకు చెల్లించాల్సిన 144 వాయిదాల రుణాలను ప్రభుత్వం సర్దుబాటు చేసి బడ్జెట్‌పై వడ్డీ భారాన్ని తగ్గించింది. ఈ విధంగా వివిధ కార్పొరేషన్ల పేరుతో అధిక వడ్డీ రేట్లు (10.9 శాతం ) ఉన్న రుణాలను తక్కువ వడ్డీ రేటుకు మార్చడం, ఆయా రుణాల కాలపరిమితిని 30 ఏళ్ల వరకు పొడిగింపు జరిగేలా యత్నం చేస్తోంది. నిధులు లేక, ఇప్పటికే తెచ్చిన కోట్లాది రూపాయల అప్పులను చెల్లించే స్తోమత లేక వివిధ కార్పొరేషన్లు రాష్ట్ర సర్కార్‌కు అవి గుదిబండగా తయారయ్యాయి. రాష్ట్ర అవసరాల కోసం నిధులు సమకూర్చుకోవడంలో భాగంగా గత ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏర్పాట్లు చేసింది. తద్వారా భారీగా రుణాలను సమీకరించింది. తాగు నీటి సరఫరా, సాగు నీటి ప్రాజెక్టులతోపాటు, ఇతర అవసరాలకు అప్పులు చేయడానికి అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్, హౌసింగ్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ గ్రిడ్ కార్పొరేషన్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కారొ ్పరేషన్, కాళేశ్వరం కార్పొరేషన్ వంటి వాటిని ఏర్పాటు చేసింది. ఇలా వివిధ కార్పొరేషన్ల ద్వారా దాదాపు రూ.84 వేల కోట్ల మేర అప్పులు సేకరించింది. ఇందుకు గత రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చింది. ఈవిధంగా కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రూ.24 వేల కోట్లు, మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం రూ.20 వేల కోట్లు, దేవాదుల కార్పొరేషన్ నుండి రూ.20 వేల కోట్లు, హౌసింగ్ కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్లు, పాలమూరు, రంగారెడ్డి కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్లు అప్పులు చేసింది. ఇప్పుడు వీటి నిర్వహణ ప్రభుత్వానికి పెద్ద భారంగా తయారైంది. దీంతో ఈ రుణాలను తక్కువ వడ్డీకి, ఎక్కువ వాయిదాలతో రీ షెడ్యూల్ చేయించడం ద్వారా ప్రభుత్వం ఉపశమన మార్గాలను అమలు చేస్తోంది.

## తెలంగాణలో 4 వేల మెగావాట్ల అణు విద్యుత్

**హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచన చేస్తోంది. అందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. తదుపరి వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా అణు ఇంధన ఉత్పత్తికి కావాల్సిన వనరులు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, అందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున 4 రూపాయలు వరకూ ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ 2.15 రూపాయలకు లభిస్తోంది.

ఇక రాత్రి వేళల్లో ఎక్స్ంజలో విద్యుత్ సేకరిస్తే యూనిట్‌కు 9 రూపాయల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాలపై సర్కార్ దృష్టిసారించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## రెండేళ్లు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి ప్రజావాణి

### 74 శాతం సక్సెస్ రేటు.. ఇంచార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి1:** ముఖ్యమంత్రి ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోందని ఇంచార్జ్ చిన్నా రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతుండడంతో రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు భారీ ఎత్తున రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహిస్తున్న సిఎం ప్రజావాణికి తరలివస్తున్నారన్నారు. సుమారు 25 నెలల క్రితం ప్రారంభమైన సిఎం ప్రజావాణి ప్రతి వారంలో మంగళ, శుక్రవారాలలో నిర్వహిస్తూ ఇప్పటివరకు 24 సెషన్స్ పూర్తి చేసుకుందని తెలిపారు. రెండేళ్ల కాలంలో సిఎం ప్రజావాణిలో మొత్తం ఒక లక్షా 12 వేల 245 దరఖాస్తులు నమోదు కాగా, అందులో 64 వేల 558 దరఖాస్తులు పరిగణలోకి తీసుకొని 47 వేల 935 దరఖాస్తులు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన 47, 687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాల్సినవి కావడం, ఉద్యోగాల కోసం సంబంధించినవి.

## వివాహం విఫలమవుతుందన్న జ్యోతిష్కుడు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య!



**బెంగళూరు, మార్చి 1:** ఐటి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగిని ఒక వ్యక్తిని ప్రేమించింది. అతడితో పెళ్లికి ఆమె కుటుంబం కూడా అంగీకరించింది. అయితే ఆమె వివాహం విఫలమవుతుందని ఒక జ్యోతిష్యుడు చెప్పాడు. మనస్తాపం చెందిన ఆ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బగలగుంటే ప్రాంతంలో నివసిస్తున్న 27 ఏళ్ల విద్యాజ్యోతి బాష్ సంస్థలో ఐటి ఉద్యోగిని. కొన్ని రోజులుగా వర్క్‌ఫ్రం హోం చేస్తున్నది. కాగా, కొడగు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి, విద్యాజ్యోతి ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించాయి. ఈ నేపథ్యంలో పెళ్లి తర్వాత తన జీవితం ఎలా ఉంటుంది అన్నది తెలుసుకునేందుకు విద్యాజ్యోతి ఒక జ్యోతిష్యుడిని సంప్రదించింది. అయితే ప్రేమించిన వ్యక్తితో ఆమె వివాహం విఫలమవుతుందని జ్యోతిష్యుడు చెప్పాడు. రెండేళ్లకే వారిద్దరూ విడిపోతారని అంచనావేశాడు. దీనిని అధిగమించేందుకు తొమ్మిది రోజుల పాటు పూజలు చేయాలని సూచించాడు. జ్యోతిష్యుడి సలహాను పాటించిన విద్యాజ్యోతి అతడు చెప్పిన విధంగా పూజలు చేసింది. శుక్రవారం తొమ్మిదో రోజు పూజ కోసం కుటుంబ సభ్యులు గుడికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోకస్

### వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ- దేవాదుల, డిండి, పాలమూరు-రంగారెడ్డి పై దృష్టి

హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త: పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా రైతులకు సాగు నీటిని అందించడంతోపాటు ప్రజలు తాగునీటి సౌకర్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష ్యంగా ముందుకు వెళుతోంది. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రధానంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే దేవాదుల ఎత్తిపోతల పథకంతోపాటు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించడానికి సుందిళ్ల బ్యారేజీ మరమ్మతులు, పునరుద్ధరణపై దృష్టి పెట్టింది. ఇందుకోసం పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి స్పష్టమైన గడువును నీటిపారుదలశాఖకు రాష్ట్ర ప్రభుత్వం విధించింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో దాదాపు 73.57 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరపడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేరకు గతంలో అధ్యయనం, డీపీఆర్ తయారీకి ఉత్తర్వులు ఇచ్చిన ముందడుగు పడని ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రధానంగా ఫోకస్ పెడుతోంది. కెఆర్ఎంబి ఎదుట రాష్ట్ర వాదనలకు బలం చేకూరేలా వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల కింద అదనపు నీటి కేటాయింపులు, రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు,

కొత్తగా చేపట్టేందుకు ఉత్తర్వులు ఇచ్చి కార్యరూపం దాల్చని ప్రాజెక్టులపైనా దృష్టి కేంద్రీకరించాలని నీటిపారుదలశాఖకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో తెలంగాణకు 904 టిఎంసిల జలాల కేటాయింపు అవసరమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించింది.



## బరువు తగ్గించే నల్లబియ్యం

దక్షిణాది రాష్ట్రాలకే కాదు.. ప్రపంచంలోనే సగం మంది జనాభాకు బియ్యమే ప్రధాన ఆహారం. అయితే, ఇందులో లావు బియ్యం, సన్నబియ్యం, బాస్మతి రైస్, ఇడ్లీ బియ్యం, దంపుడుబియ్యం అంటూ ఎన్నో రకాల మార్కెట్లో ఉన్నాయి. వీటన్నింటినీ పక్కకు నెట్టి ఈ మధ్య ఆరోగ్యానికి మంచివంటూ నల్లబియ్యం వాడకం కూడా పెరిగింది. మరి ఇంతకీ దీని ప్రయోజనాలేంటో తెలుసుకుందాం ..

✦ సాధారణ బియ్యంతో పోల్చితే.. నల్లబియ్యంలో పోషకాలు ఎకువంటున్నాయి అనేక అధ్యయనాలు. పీచు, కీలక విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటంతో మధుమేహులు, బిపి ఉన్న వారూ వీటిని తినొచ్చు. ముఖ్యంగా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని అదుపు చేస్తాయి. అంథోసైనిన్లు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ✦ బ్లాక్ రైస్‌లో శక్తివంతమైన కెరోటినాయిడ్లు ఉంటాయి. ల్యూటిన్, జియాజాంథిన్ వంటివి అతినీలలోహిత కిరణాలు, కృతిమ వెలుగులు కంటికి హాని చేయకుండా కాపాడతాయి. ✦ ఈ బియ్యంలోని ప్రొటీన్లూ, పీచూ, వల్ల అతిగా తినే అలవాటు అదుపులో ఉంటుంది. ఫలితంగా బరువూ తగ్గొచ్చట. నల్లబియ్యంలో యాంటీ ఆక్సిడెంట్లూ, పుష్కలంగా ఉండి.. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌నూ, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలనూ తగ్గిస్తాయి. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పునీ సమర్థంగా ఎదుర్కోవచ్చు. □

## మెరిసే చర్మం కోసం..



మచ్చల్లేని చర్మంతో ఉండాలని ఎవరి కుండదు. కానీ చర్మంపై అక్కడక్కడా వచ్చే తెల్ల మచ్చలు అందాన్ని పాడుచేస్తాయి. శరీరంలో మెలనిన్ ఉత్పత్తి తక్కువ కావడంతో ఈ మచ్చలు ఏర్పడు తుంటాయి. కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా నివారించవచ్చు.

**దానిమ్మ తొక్కలు ...** చెంచా దానిమ్మ తొక్కల పొడికి అదే పరిమాణంలో రోజ్ వాటర్‌ను కలిపి ముఖానికి రాయాలి. పావుగంటాగి చల్లటి నీటితో కడిగి శుభ్రం చేస్తే సరి. ఇది చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేట్ చేస్తుంది. దురద, యాక్నే నుంచి రక్షణ కల్పించి ముఖాన్ని మెరిపిస్తుంది. మచ్చలనీ తగ్గిస్తుం ది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ తో పోరాడి చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.

**టీ ట్రీ ఆయిల్..** చర్మంపై మచ్చలు, మురికిని తొలగించడంలో సమర్థవంతంగా పని చేస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ లోణాలు చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. శరీరం నుంచి వెలువడే చెమట బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని కారణంగా అనేక చర్మ సమస్మలు కలుగు తాయి. ఇలా కాకూడదంటే టేబుల్‌స్పూన్ ఆలివ్ ఆయిల్‌కి అదే పరిమాణంలో కొబ్బరి నూనె, పదిచుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి మృదువుగామర్దన చేయాలి. అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరచాలి. ఇలా రోజూ రెండు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**కొబ్బరినూనె:** ఇందులో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలం.ఇవి చర్మంపై ఫంగల్ ఇన్‌ఫెక్షన్లను తొలగించి ముఖాన్ని మెరిపిస్తాయి. రోజూ నిద్రించే ముందు రాస్తే..తగిన తేమ అంది చర్మం నిగనిగలాడుతుంది.

**నిమ్మ, చక్కెర స్క్రబ్..** చెంచా చక్కెరకికొద్దిగా నిమ్మరసం తేనె కలిపి సమస్యల ఉన్న చోట రాయాలి. నిమ్మలోని సి విటమిన్ పిహెచ్ స్థాయిల్ని సమతుల్యం చేస్తుంది. తెల్లమచ్చలను నివారిస్తుంది. తేనేలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి తగినంత తేమను అందించిమెరిసేలా చేస్తాయి.

**చందనం, రోజ్‌వాటర్ మాస్క్:** తగినంత చందనం పొడికి సరిపడా గులాబీనీరు కలిపి మెత్తని పేస్టు చేసుకోవాలి. దీన్ని తెల్లమచ్చలున్న చోట రాసి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. గంధంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖాన్ని తేమగా కాంతమంతంగా కనిపించేలా చేస్తాయి. □

## రసాయన ఎరువులు ఎక్కువగా వాడాలి'

**వ్యవసాయం బాగుండాలంటే రసాయన ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడాలి' అనే నమ్మకం బలంగా పాతుకుపోయిన గ్రామంలో సేంద్రియ వవ్యసాయం గురించి ప్రచారం చేస్తే ఎలా ఉంటుంది? పెద్దగా స్పందన కనిపించదు. అంగిసింగి అనే ఊళ్లో కూడా అచ్చం అలాగే జరిగింది. అయితే కృషిమిత్ర గీత వల్ల ఆ ఊరు మారింది. పచ్చనాకు పచ్చటి తోవలో నడుస్తోంది.**

పెళ్లయిన తరువాత అంగిసింగి (నయాగఢ్ జిల్లా-ఒడిశా) అనే ఊళ్లోని అత్తగారింట్లోకి అడుగు పెట్టింది గీతారాణి సప్తతి. అంగిసింగి అనేది వ్యవసాయ ఆధారిత గ్రామం. అయితే రైతులు మాత్రం ఎన్ని రసాయన ఎరువులు వాడితే వ్యవసాయా నికి అంత మంచిది అనే ధోరణిలో ఉండేవారు. రైతులు పోటీపడి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడడం వల్ల గ్రామంలో ఆస్తమా బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండేది. గీత పిల్లలు కూడా ఆస్తమా బారిన పడ్డారు. ఈ నేపథ్యంలోనే గీత కృషిమిత్రల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. గ్రామాలలో పర్యావరణహిత వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కలిగించే స్వయం సహాయక బృందం సభ్యులను 'కృషిమిత్ర'గా మారింది. తక్కువ ఖర్చుతో పర్యావరణ హిత వ్యవసాయం చేయవచ్చు అనే నినాదంతో రైతుల దగ్గరకు వెళ్లింది గీత. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల కలుగుతున్న నష్టాల గురించి వారికి వివరించింది. ప్రచారంతోపాటే తాను స్వయంగా సేంద్రియ వ్యవసాయం చేయడం మొదలు పెట్టింది. రైతుల భార్యలను పొలానికి తీసుకువెళ్లి తాను ఆచారిస్తున్న పద్ధతులను పరిచయం చేసేది. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాల గురించి



వివరించేది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కాన్సెప్ట్‌తో గీత చేసిన సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకునేవారు. ఒకప్పుడు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే కృషిమిత్ర నేను ఒక్కరినే. నేను చేస్తున్న వ్యవసాయాన్ని గమనించిన తరువాత ఇప్పుడు చాలామంది మహిళలు కృషిమిత్రగా మారారు అంటుంది గీత. ఒకవైపు ఇంటిపనులు, పిల్లల పనులు చేసుకుంటూనే మరోవైపు రైతుల పొలాల దగ్గరికి వెళ్లి వారికి అవసరమైన సలహాలు ఇస్తుంటుంది గీత. మొబైల్ ఫోన్ ద్వారా విజువల్స్, సమాచారాన్ని చేరవేస్తుంటుంది. గీత దినచర్య వేకువ జామునే మొదలవుతుంది. ఆగిపోయిన చదువును దూరవిద్య ద్వారా తిరిగి కొనసాగించాలని నిర్ణయించుకుంది గీత. ఒకప్పుడు ఆమెను నిరుత్సాహపరిచిన భర్త, గీత మాటల వల్ల గ్రామ వ్యవసాయ పద్ధతుల్లో వస్తున్న మార్పులు, రైతులు చూపిస్తున్న గౌరవం చూశాక భార్యకు వెన్నుదన్నుగా ఉంటూ వస్తున్నాడు. □

## యముడి తీర్మానం

ఒక రాజ్యంలో మహారాజు బీదసాదలకు నిత్యం అన్నదానం చేయించేవాడు. ఓ రోజు భోజన వితరణ చేయిస్తుండగా, ఓ గద్ద పామును నోట కరచుకొని పోతోంది. పాము గద్ద పట్టు నుంచి తప్పించు కోవటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయాసలో దాని కోరల నుంచి జారిన విషం భోజన పదార్థాల్లో పడింది. అదెవరూ గమనించలేదు. కొంతసేపటికి ఆ ఆహారం తినినన పేదలు చనిపోగా రాజు దిగ్భ్రాంతి చెందాడు. ఈ పాపానికి కారణమెవరననదియమ లోకంలో చర్చనీయాంశ మైంది. గద్ద ఆహార సేకరణలో పామును పట్టుకుంది,. సర్పం ప్రాణభయంతో విషం చిమ్మింది. ఈ పొరపాటు రాజుకు తెలియదు. ఆ పాపం ఎవరి ఖాతాలో వేయాలని చిత్రగుప్తుడు అడిగితే-ముందు భూలోకానికి పదమన్నాడు. దారిలో కొందరిని కదిలించాడు. మహారాజు అన్నదానం పేరుతో విషం పెట్టి చంపుతున్నాడు అని కొందరు, జనాభాను తగ్గించేదుకు విష ప్రయోగం చేయిస్తున్నాడు అని మరికొందరు మాట్లాడుకుంటున్నారు. నిజం తెలుసుకోకుండా తమ కాలాన్ని వృథా చేసుకుంటూ గాలివార్తలు,వదంతులను వ్యాపింప చేస్తున్న వీళ్లందరి ఖాతాలో వేయిండి. ఆ పాపమంతా అంటూ చిత్రగుప్తుడికి ఆజ్ఞ జారీచేశాడు యమధర్మరాజు. ప్రచారంలో ఉననన ఈకథలో వాస్తవం ఎంతో కానీ.. అసత్యాలను ప్రచారం చేయడం మాత్రం మహా పాపమని అర్థం చేసుకోవాలి. □

## జ్ఞాపకశక్తిని పెంచే వేరుశనగ



**ప్రయాణాల్లో** పల్లీలు తింటుంటాం. ఇవి రుచిగానూ ఉంటాయి, ఆరోగ్యాన్నీ ఇస్తాయి. వేరుశనగపప్పుల్లో కాల్షియం, ఐరన్, కాపర్, ఫొలేట్, భాస్వరం, మాంగనీస్, మెగ్నీషియం, బి1, బి3, బి6 ఇ-విటమిన్లు ఉన్నాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను, రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తాయి. గుండె జబ్బులను నిరోధిస్తాయి. జీర్ణప క్రియను మెరుగుపరుస్తాయి. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు, ఫాటీ యాసిడ్స్ చర్మాన్ని సంరక్షిస్తాయి. పల్లీల్లోని పోలీ, మోనో ఆన్‌శాచ్చురేటెడ్ పాట్స్ విటమిన్ బి3లు మెదడును ఆరోగ్యంగా ఉంచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. వయసు రీత్యా వచ్చే అల్జీమర్స్ లాంటి సమస్యలను కూడా తగ్గిస్తాయని పరిశోధనల్లో తేలింది. మూడ్స్‌ను క్రమబద్ధంచేసి, యాంటీ డిప్రెసెంట్లుగా పనిచేసే ఎమినో యాసిడ్స్ పల్లీలు అందిస్తాయి. వాటివల్ల ఆందోళన తలెత్తదు. వేరుశనగ ప్రొటీన్లు ఉన్న ఆహారం అయినందున ఆకలి తీరుతుంది. ఇంకా తినాలన్న భావన లేక సంతుష్టి కలుగుతుంది. దాంతో బరువు పెరగరు. రోజూ గుప్పెడు పల్లీలు తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలెన్నో అందు తాయి. అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు. పల్లీలను వేయించి తింటే మరింత రుచిగా ఉండే మాట నిజం కానీ వీటిని ఉడికించి లేదా నానబెట్టి తినడమే మంచిది. మొలకలు వచ్చాక తింటే మరీ శ్రేష్ఠంవీటికి కొంచెం బెల్లం జతచేసి తింటే పైత్యం చేయదు. ఇన్ని లాభాలు చేకూర్చే పల్లీలను తగిన మోతాదులో తినమంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇవి బాదం, జీడిపప్పులంత ఖరీదు కాదు కనుక అందరికీ oదుబాటులో ఉంటాయి. □

## ఆర్థికంగా అడుగేయండి..

**ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగు పెడుతుంది జంట. అన్యోన్య దాంపత్యానికీ..కలిసి ఆనందంగా సాగడానికీ బోలెడు ప్రణాళికలు వేసుకుంటారు. వాటిలో డబ్బుకీ చోటివ్వండి అంటున్నారు నిపుణులు. అప్పుడే మనస్పర్థలకు తావుండదట.**



✦ ఇల్లు నిర్వహణ నువ్వు.. సంపాదన సంగతి నేను.. ఇలా విభజించుకున్నప్పుడే సమస్యలు. ఇద్దరూ ఉద్యోగాలు చేసినా, చేయపోయినా, పొదుపు, మదుపు, కొనుగోళ్లు వంటి నిర్ణయాలేవైనా ఇద్దరూ కలిసి తీసుకోవాలి. అప్పుడు ప్రతి రూపాయి లెక్క తెలియడమే కాదు. మెరుగైన ప్రణాళికకీ ఆస్కారం ఉంటుంది.

✦ కొత్తలో కలిసి పర్యటనలు, షాపింగ్ వంటివి సహజమే. అలాగని మరీ ఖర్చు చేసుకుంటూ వెళ్లొద్దు. కొనేది ఏదైనా నిజంగా అవసరమేనా అని ప్రశ్నించుకుంటే దూబారాకి చోటుండదు. అలాగే ఒక పుస్తకాన్ని పెట్టుకోండి. ఎవరు ఎంత ఖర్చు పెడుతున్నారన్నది దానిలో రాయాలనే నియమం పట్టుకోండి. దీని ద్వారా నెలకు ఎంత అవసరం అన్న సంగతే కాదు. అనవసర ఖర్చుల వివరాలూ తెలుస్తాయి. వీలైతే వాటిని తగ్గించుకొని పొదుపుగా మలుచుకోవచ్చు. ✦ ఇద్దరూ సంపాదిస్తోంటే.. ఏ బాధ్యతలూ లేకపోతే ఒకరి జీతాన్ని పూర్తిగా పక్కన పెట్టేయొచ్చు. భవిస్యత్తులో సొంతింట్లు, స్థలం వంటివిప్లాన్ చేసుకున్నా డబ్బుపరగా ఇబ్బంది ఉండదు. ✦ నగరాల్లో ఉండేవారికి కరెంటు కోతలు పెద్దగా పరిచయం ఉండదు. ఇష్టమొచ్చినట్లుగా లైట్లు, ఫ్యాన్లు వేసి వదిలేస్తుంటారు. మీకూ ఆ అలవాటు ఉంటే తగ్గించుకోండి. ఇంట్లోకి వస్తువులు కొనేప్పుడూ కరెంటు ఆదా చేసేరకాలను ఎంచుకోండి. కరెంటు బిల్లు తగ్గుతుంది. ఇంకా ఇలాంటి వృథాలేం చేస్తున్నారో తెలుసు కున్నా చాలావరకూ ఆదా చేయొచ్చు. □

# తెర



## సరస్వతి సోషల్ మెసేజ్ ఎంటర్‌టైనర్

### ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్, డైరెక్టర్ వరలక్ష్మి శరత్ కుమార్

సరస్వతి లాంటి కథ చెప్పడానికి చాలా ధైర్యం కావాలి. తప్పకుండా థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా ఇది. హీరో శరత్ కుమార్ వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం సరస్వతి. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ డైరెక్టర్, వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకి విచ్చేసిన స్వప్న దత్, నందిని, సిమ్రన్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. బాలయ్య, నాని, అడివి శేషు గార్లకి, సమంత, నయనతార, గోపి, బన్నీ వాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ సినిమాలో పనిచేసిన టెక్నీషియన్స్, నటీనటులకు పేరుపేరునా కృతజ్ఞతలు. తమన్ గారు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా సినిమాకి వెన్నుముకగా నిలిచిన ఈటీవీ యాజమాన్యానికి కృతజ్ఞతలు. పూజ ఈ సినిమాని చాలా కంట్రోల్‌గా చేసింది. ఈ సినిమాతో మా నాన్నగారిని గర్వపడేలా చేస్తానని నమ్ముతున్నాను. హీరో శరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ విమెన్ పవర్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఒక నటిగా వరలక్ష్మి విజయంలో నా పాత్ర ఏమీ లేదు. కాకపోతే ఈ ప్రపంచం ఎలా ఉంటుంది ఎలా బిహేవ్ చేయాలని చిన్నప్పటి నుంచి చెప్తుండేవాడిని. సరస్వతి లాంటి కథ ఖచ్చితంగా చెప్పాలి. స్త్రీలని గౌరవించడం మనందరి కర్తవ్యం. రాధిక శరత్ కుమార్ మాట్లాడుతూ.. సరస్వతి ధైర్యాన్ని ఇచ్చే సినిమా. వరలక్ష్మి విషయంలో చాలా గర్వంగా ఉన్నాను. ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. ప్రొడ్యూసర్ స్వప్న దత్ మాట్లాడుతూ ఈ సినిమా ట్రైలర్ చూశాను. చాలా నచ్చింది. తప్పకుండా ఈ సినిమా థియేటర్స్‌లో చూస్తాను.



### హైదరాబాద్‌లో మార్చిన 4 న విరోష్ వెడ్డింగ్ రిసెప్షన్

విజయ్ దేవరకొండ, రష్మిక వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ఇప్పుడు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. దీనికి అభిమానులతో పాటు, హాజరయ్యే అతిథులకు ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 4 సాయంత్రం రిసెప్షన్ జరుగుతుంది. కావున పాల్గొనే వారందరూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా నడచుకోవాలని మరియు ఆహ్వానించిన ఉన్న అతిథును మాత్రమే హాజరుకావాలని విజ్ఞప్తి చేశరు. ఆహ్వానం లేకుండా వేడుకకు వచ్చి ఇబ్బందులు పడొద్దని కోరారు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాల ప్రముఖులు రిసెప్షన్‌కు హారవుతున్నారు.



### హాన్సి బ్యానర్‌పై కొత్త చిత్రం ప్రారంభం

ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టు హాన్సి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శనివారం గ్రాండ్‌గా నూతన చిత్రం ప్రారంభమైంది. ఇది మొదటి చిత్రం ఈరోజు ఉదయం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్‌తోపాటు సన్నిహి తులు హాజరై విజయాశీస్సులు అందించారు. శ్రీ హాన్సిక పెద్దిరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కో-ప్రొడ్యూసర్‌గా తవిటిరాజు తలచింతల వ్యవహరిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ రఘువర్ధన్ కోట్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా ముహూర్తపు షాట్‌కు శ్రీధర్ పెద్దిరెడ్డి క్లాప్ కొట్టారు. స్రవంతి పెద్దిరెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, శ్రీ హాన్సిక పెద్దిరెడ్డి దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ చిత్రంలో యువ జంట జగన్ యోగి రాజు, నవ్య చిట్యాల హీరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ యంగ్ టాలెంట్‌తో పాటు సీనియర్ నటులు దేవీ ప్రసాద్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. లక్ష్మణ్ మీ సాల, పవన్ రమేష్, సునందిని, అంజు వాల్గు మన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

### మంచు మనోజ్ చేతుల మీదుగా రుక్మిణి టీజర్ లాంచ్...

నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియ జస్పర్, దీప్తి శ్రీరంగం హీరో హీరోయిన్స్‌గా జి సినిమా బ్యానర్‌పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్న సినిమా రుక్మిణి. ఈ చిత్రానికి శ్రీమతి నేలబల్లి కుమారి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. సరికొత్త హారర్ కామెడీ కథతో దర్శకుడు సింహాచలం గుడుపూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ రోజు రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా రుక్మిణి మూవీ టీజర్ విడుదల చేశారు. అనంతరం రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ రుక్మిణి సినిమా టీజర్ అద్భుతంగా ఉంది. ఈ సినిమాతో నిరంజన్ హీరోగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమా అతనికి మంచి సక్సెస్ ఇవ్వాలి. టీజర్ చూస్తుంటే డైరెక్షన్, డీవోపీ వర్క్, మ్యూజిక్ అన్నీ చాలా బాగున్నట్లు తెలుస్తోంది. హీరో నిరంజన్ మాట్లాడుతూ మా రుక్మిణి మూవీ టీజర్ లాంచ్ చేసిన మనోజ్ గారికి చాలా థ్యాంక్స్. మేమంతా ఎంతో ప్యాషనేట్‌గా చేస్తున్న చిత్రమిది. మా సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరారు.



### రియల్ కబడ్డీ ప్లేయర్స్‌తో డా. ఆర్కే గౌడ్ నిర్మిస్తున్న మహిళా కబడ్డీ

తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తన ఆర్కే ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం మహిళా కబడ్డీ. ఈ చిత్రంలో ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ వైస్ కెప్టెన్ పూజ నర్వాల్, ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, హీరో సుమన్, అక్సా ఖాన్, తులసితో పాటు ఏడుగురు రియల్ కబడ్డీ ప్లేయర్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విలేకరుల సమావేశంలో మూవీ టీమ్ ఇండియన్ వుమెన్స్ కబడ్డీ టీమ్ ప్లేయర్ పూజ నర్వాల్, ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, హీరో సుమన్, అక్సా ఖాన్, తులసి, దర్శక నిర్మాత డా, ఆర్కే గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### సన్ ఆఫ్‌కు వస్తోన్న రెస్పాన్సే నా సక్సెస్

– సాయి సింహాద్రి

సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం సన్ ఆఫ్. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న గ్రాండ్ రిలీజ్ చేశారు. తండ్రీ కొడుకుల మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమాకు చాలా మంచి స్పందన వస్తుంది. ఈ క్రమంలో శనివారం ఈ సినిమా సక్సెస్ మీట్‌ను చిత్ర యూనిట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ కౌన్సిల్ కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, హీరో మరియు నిర్మాత సాయి సింహాద్రి, హీరోయిన్ మీరా రాజ్, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శోభారాణి, డిస్ట్రిబ్యూటర్స్ తదితరులు పాల్గొన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ "సినిమాపై ప్యాషన్‌తో సన్ ఆఫ్ సినిమా చేసిన సాయి సింహాద్రిగారికి తొలి సినిమాతో చాలా మంచి రెస్పాన్స్ రావటం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శోభారాణి మాట్లాడుతూ సన్ ఆఫ్ సినిమాను ముందుగా సాయి నా దగ్గరకు వచ్చినప్పుడు 5 థియేటర్స్‌లో విడుదల చేస్తే చాలనే ఆలోచనతో వచ్చాడు. కానీ తర్వాత నా వంతుగా అందరి డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడి దాన్ని దాదాపు 300 థియేటర్స్‌లో విడుదల చేసేలా సపోర్ట్ చేశాను. హీరో, చిత్ర నిర్మాత సాయి సింహాద్రి మాట్లాడుతూ యుఎస్ సాఫ్ట్ వేర్ ఆర్కిటెక్‌గా ఉన్న నేను సినిమా రంగంపై ఉన్న ఆసక్తితో ఇక్కడకు వచ్చాను. ఏడాదిన్నర పాటు ఇక్కడే ఉంటూ చాలా ఒడిదొడుకులు ఎదుర్కొంటూ సినిమాను విజయవంతంగా పూర్తి చేశాను. హీరోయిన్ మీరా రాజ్ మాట్లాడుతూ మంచి ఎమోషనల్ బాండింగ్ ఉన్న సన్ ఆఫ్‌లో తండ్రీ కొడుకుల మధ్య కనెక్టింగ్ చేసే మంచి రోల్‌లో నటించటం నటిగా నాకు మంచి గుర్తింపునిచ్చింది అన్నారు.



# దుమ్మురేపిన భారత్

ఆట

## * సంజూ ధాటికి విండీస్ చిత్తు
## * సెమీస్‌లో ఇంగ్లాండ్‌తో పోరు



### బుమ్రా ఒకే ఓవర్లో 2 వికెట్లు

మొదట బ్యాటింగ్ చేసిన వెసిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 రన్స్ చేసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు షాయ్ హోప్(32), రోస్టన్ ఛేజ్(40) ధాటిగా ఆరంభించారు. అర్షదీప్ తొలి ఓవర్లో పొదుపుగా పరుగులు ఇచ్చినా, హార్దిక్ ఓవర్లో ఓ సిక్స్, ఓ ఫోర్ బాదారు. పవర్ ప్లే 6 ఓవర్లలో 45 పరుగులు రాబట్టారు. 68 పరుగులు తొలి వికెట్ భాగస్వామ్యానికి వరుణ్ చక్రవర్తి తెరదించాడు. రోస్టన్ ఛేజ్, క్రీజ్‌లోకి వచ్చిన హెట్మైర్ చెలరేగి ఆడే ప్రయత్నం చేశారు. దీంతో వెస్టిండీస్ తొలి పది ఓవర్లలో 82 పరుగులకు చేర్చారు.

**బూమ్ బూమ్ బుమ్రా**

యార్కర్ల కింగ్ బుమ్రా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి విండీస్ జోరుకు బ్రేక్ లేశాడు. మొదట హెట్మైర్(12 బంతుల్లో 27)ను బోల్తా కొట్టించాడు. సంజూ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. ఆవెంటనే రోస్టన్ ఛేజ్‌ను కూడా అవుట్ చేశాడు. ఒకే ఓవర్లో 2 వికెట్లు కోల్పోవడంతో విండీస్ స్కోరు వేగం తగ్గింది.

**పావెల్, హోల్డర్ దూకుడు**

స్లాగ్ ఓవర్లలో రోవ్‌మాన్ పావెల్(34 నాటౌట్), జాసన్ హోల్డర్(37 నాటౌట్) ధాటిగా బ్యాటింగ్ చేశారు. భారత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడుతూ స్కోరు వేగాన్ని పెంచారు. వీరిద్దరూ 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించడంతో విండీస్ 195కు చేరుకుంది.భారత బౌలర్లలో బూమ్రా2 వికెట్లు సాధించగా.. పాండ్యా,వరుణ్‌లకు తలో వికెట్ దక్కింది.

**పావెల్ అరుదైన ఘనత**

ఈ మ్యాచ్‌లో రెండు సిక్సర్లు కొట్టడం ద్వారా రోవ్‌మాన్ పావెల్ అరుదైన ఘనత సాధించాడు. 150 సిక్సర్ల మార్కును చేరుకుని విండీస్ తరుపున టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. నికోలస్ పూరన్ 149 సిక్సర్లు, వెవిన్ లూయిస్ 136 సిక్సర్లతో తరువాతి స్థానంలో ఉన్నారు.

*సెమీస్ చేరకుండానే పాక్ ఇంటికెళ్లింది. మరి మనం. సెమీస్ చేరుతుందా? గెలిచి నిలుస్తారా? కోల్‌కతా మ్యాచ్‌కు ముందు ఏ మూలనో భారత్ ఫ్యాన్స్‌లో కాస్తంత సంశయం. కానీ మరోసారి సూర్యసేన గెలిచి నిలిచింది. ఈడెన్‌లో సూపర్ గేమ్‌తో అదరగొట్టింది.జింబాబ్వేపై చూసిన జోరును కంటిన్యూ చేసింది.సంజూ శామ్సన్ మొదలు పెడితే.. సూర్య కుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య తలో చేయి వేశారు. వీరి దెబ్బకు విండీస్ కుదేలైంది. కోల్‌కథ సుఖాంతమైంది. టీమిండియా సెమీస్ చేసింది. మార్చి 5న వాంఖడేలో ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది.*



**కోల్‌కతా:** టీ20 ప్రపంచకప్‌లో డిపెండింగ్ ఛాంపియన్ టీమిండియా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్8 దశలో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ను ఓడించి ముందడుగు వేసింది. 196 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులుండానే 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. సంజూ శాంమ్సన్ కడదాకా క్రీజలో నిలిచి సూపర్ విక్టరీ అందించాడు.

భారత్ ఇన్నింగ్స్‌ను మరోసారి అభిషేక్ శర్మ, సంజూ శాంమ్సన్ ఆరంభించాడు. జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో జోరు మీదికొచ్చిన అభిషేక్ ఈసారి ట్రయిక్ తీసుకున్నాడు. రెండో బంతికే బౌండరీతో ఖాతా తెరిచాడు. అయితే అభిషేక్ ఇన్నింగ్స్ ఎంతో సేపు నిలవలేదు. భారీ షాట్‌కు యత్నించి అవుటయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఇషాన్ కూడా రెండు బౌండరీలు బాదినా వెంటనే అవుటయ్యాడు. దీంతో టీమిండియా 41రన్స్‌కే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లోపడింది.

**సంజూ సూపర్ ఇనింగ్స్**

స్పినర్ హోసెన్ రెండో ఓవర్లో తొలి బంతిని బౌండరీ బాదిన సంజూ.. అదే ఓవర్లో మరో రెండు సిక్స్‌లు బాది తన ఉద్దేశ్యమేమిటో చాటిచెప్పాడు. ఇక అక్కడి నుంచి వెనక్కి తగ్గలేదు. విండీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ పరుగుల వరద పారించాడు. ఆరో ఓవర్లో 50 పరుగుల మార్కు దాటించిన సంజూ ధాటికి... భారత్ స్కోరు 11వ ఓవర్‌కు వంద పరుగులు, 16వ ఓవర్‌కు 150 పరుగులకు చేరుకుంది.ఈ క్రమంలో 26బంతుల్లోనే ఆరు బౌండరీలు, మూడు సిక్స్‌లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. సూర్యకుమార్(18)తో కలిసి మూడో వికెట్‌కు 58 రన్స్, తిలక్ వర్మ(27)తో కలిసి నాలుగో వికెట్‌కు 42 రన్స్, హార్దిక్(17)తో కలిసి ఐదో వికెట్‌కు 38 రన్స్ విలువైన భాగస్వామ్యాలు నిర్మించాడు. 20వ ఓవర్ మొదటి బంతికి స్క్వేర్ మీదుగా సిక్స్, రెండో బంతికి మిడాన్ మీదుగా బౌండరీతో భారత్‌కు గెలుపందించాడు.మొత్తంగా సంజూ 50బంతుల్లో 12ఫోర్లు, 4సిక్స్‌లతో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

**తిలక్ వర్మ మెరుపులు**

హైదరాబాదీ తిలక్ వర్మ మిడిల్ ఆర్డర్‌లో దుమ్మురేపుతున్నాడు. జింబాబ్వేపై కీలక పరుగులు చేసిన తిలక్.. ఈడెన్‌లోనూ రిపీట్ చేశాడు. 13వ ఓవర్లో జేసన్ హల్డర్ బౌలింగ్ లో నాలుగు బౌండరీలు బాదాడు. అంతకు ముందు ఓ భారీ సిక్స్‌తో అలరించాడు. 15 బంతుల్లోనే మెరుపు వేగంతో 27 రన్స్ చేసి భారత్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.హార్దిక్ కూడా బాధ్యతాయుతంగా ఆడి రెండు బౌండరీలతో 17 రన్స్ చేశాడు.




# సఫారీ సూపర్ షో

## తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో ఢీ

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా అజేయంగా కొనసాగుతోంది. సూపర్8లోనూ హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. న్యూఢిల్లీ వేదికగా జింబాబ్వేతో జరిగిన సూపర్8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. గ్రూప్ 1 నుంచి అగ్రస్థానంతో సెమీస్‌లో అడుగు పెట్టింది. గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంకపై సంచలన విజయాలతో టాపర్‌గా నిలిచిన జింబాబ్వే అదే జోరును సూపర్8లో కొనసాగించలేక చతికిలపడింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటములే ఎదురయ్యాయి. 28 పరుగులకే ఓపెనర్లు మరుమణి, బెన్నెట్ వికెట్లు కోల్పోయిన దశలో క్రీజ్‌లోకి వచ్చిన సికిందర్ రజా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. సఫారీ బౌలర్లపై విరుచుకుపడుతూ పరుగుల వరద పారించాడు. 5 ఫోర్లు, మూడు సిక్స్‌లతో కేవలం 29 బంతుల్లోనే వేగంగా అర్ధసెంచరీ పూర్తి చేశాడు.జింబాబ్వే స్కోరును వంద దాటించాడు. చివరకు 73 రన్స్ చేసిన రజాను మఫాకా అవుట్ చేశాడు. రజా ఇన్నింగ్స్‌లో8 ఫోర్లు, 4 సిక్స్‌లు ఉన్నాయి. స్లాగ్ ఓవర్లలో క్లివ్ మదాండే(26) వేగంగా ఆడడంతో జింబాబ్వే స్కోరు 150 రన్స్ దాటింది. సఫారీ బౌలర్లలో మఫాకా, బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. పడగొట్టారు.

అనంతరం దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఓపెనర్లు మార్క్రమ్(4), క్వింటన్ డికాక్(0) తొందరగానే పెవిలియన్ చేరినా... మిగతా బ్యాట్స్‌మెన్ రాణించ డంతో సౌతాఫ్రికా విజయం సులువైంది. బ్రెవిన్(42) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రికల్టన్(31), డేవిడ్ మిల్లర్(22), ట్రిస్టన్ స్టబ్స్(21), జార్జ్ లిండే(30) దాటిగా ఆడడంతో సౌతాఫ్రికా మరో 13 బంతులుండగానే గెలుపొందింది. బ్యాటింగ్‌లో రాణించిన సికిందర్ రజా బౌలింగ్‌లోనూ వణికించి మూడు వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ షోతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.గ్రూప్-1 టాపర్‌గా సెమీస్‌లో పవేశించిన

## దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధూ



**దుబాయ్:** భారత అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధూ దుబాయ్‌లో చిక్కుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ దాడులు కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ఆమె ప్రయాణానికి అంతరాయం కలిగింది. సింధూ బర్మింగ్ హామ్‌లో జరగనున్న ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్స్ కోసం దుబాయ్ మీదుగా లండన్‌కు బయల్దేరింది.దుబాయ్ ట్రాన్సిట్‌లో ఉన్న సమయంలో గల్ఫ్ ఎయిర్‌స్పేస్‌లో మిసైల్ దాడుల కారణంగా అన్ని విమాన సర్వీసులు నిలిపి వేశారు.దీంతో సింధూ విమానాశ్రయంలోనే ఉండాల్సి వచ్చింది. అక్కడి పరిస్థితులపై సింధు ఓ పోస్ట్ పెట్టింది. విమానాశ్రయ సిబ్బంది తమను సురక్షిత ప్రాంతానికి తరలించారని పేర్కొంది. కాగా బర్మింగ్హామ్‌లో రేపటినుంచి మార్చి 8వరకు ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ జరగనుంది.మహిళల సింగిల్స్‌లో పీవీ సింధూతో పాటు ఉన్నతి హూడా, మాల్విక బరిలోకి దిగుతున్నారు. పీవీ సింధూ తొలి రౌండ్‌లో థాయిలాండ్ క్రీడాకారిణి కటతాంగ్‌తో

## వన్డేల్లో అమ్మాయిలు వైట్‌వాష్

**హోబర్ట్:** ఆస్ట్రేలియా గడ్డపై టీ20 సిరీస్ నెగ్గిన భారత్ విమెన్స్ టీమ్...వన్డేల్లో మాత్రం బోల్తా కొట్టింది. మూడు వన్డేల సిరీస్‌లో వైట్ వాష్ అయింది. మూడో, ఆఖరి వన్డేలోనూ ఆస్ట్రేలియా 185 పరుగులతో గెలుపొందింది.

తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 409 పరుగుల భారీ స్కోరు చేసింది. హీలే, బెత్ మూనీ శతకాల మోత మోగించారు. అలీసా హీలే (98 బంతుల్లో 27 ఫోర్లు, 2సిక్స్‌లతో 158),జార్జియా వోల్ (62) రెండో వికెట్‌కు 104 రన్స్ భాగస్వామ్యం నిర్మించారు. వోల్ అవుట్ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన బెత్ మూనీ కూడా ధాటిగా ఆడి 84 బంతుల్లో 10 ఫోర్లు,ఒక సిక్స్‌తో 158 రన్స్ చేశారు.మూడో వికెట్‌కు 145రన్స్ జోడించారు.దీంతో ఆసీస్ స్కోరు 400 పరుగులు దాటింది. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు తీశారు.

అనంతరం లక్ష్య ఛేదనలో తడబడ్డ భారత్ విమెన్స్ 45.1 ఓవర్లలో 224 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్‌లో స్నేహ్ రాణా (44) టాప్ స్కోరర్‌గా నిలిచింది.. జెమీమా రోడ్రిగ్స్ (42) ఫర్వాలేదనిపించగా.. మిగతావారు బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో అలానా కింగ్ 4, జార్జియా 2 వికెట్లు తీశారు.ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హీలే నిలిచింది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ పెర్త్ వేదికగా మార్చి 6న ప్రారంభమవుతుంది.


అలీసా హీలే(158)

## ఇరాన్ వార్ ఎఫెక్ట్! భారీగా పెరుగుతున్న వెండి, బంగారం ధరలు



**ముంబయి, మార్చి 1:** బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పసిడి ధరలను అమాంతం పెంచేశాయి. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకపడడం, ఊహించని విధంగా ఇరాన్ ప్రతిదాడులు చేయడం ఇప్పుడు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. తులం బంగారం రేటు ఏకంగా రూ.7 వేల పైన పెరిగింది. కిలో వెండి రేటు ఒక్కరోజే రూ.25000 మేర పెరిగింది. ఈ క్రమంలో దేశీయ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు మార్చి 1వ తేదీన భారీస్థాయిలోపెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 100 డాలర్ల పైన పెరిగింది. ఔన్స్ పసిడి రేటు 5278 డాలర్ల పైకి ట్రేడవుతోంది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 7.59 శాతం పెరిగింది. ఔన్స్ వెండి రేటు 93.72 డాలర్ల పైకి చేరుకుంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్ పై ప్రభావం చూపించాయి. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈరోజు 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు ఏకంగా రూ.7140 మేర పెరిగింది. తులం బంగారం ధర రూ. 1,68,710 వద్దకు చేరుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ. 6,550 మేర పెరి తులం రేటు రూ.1,54,650 వద్దకు చేరుకుంది. బంగారంతో పాటు వెండి రేటు సైతం భారీగా పెరిగింది. గత రెండు రోజులు స్థిరంగా కొనసాగుతూ వచ్చిన వెండిపై ఇరాన్ అమెరికా దాడులు ప్రభావం చూపించాయి. దీంతో ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.25000 మేర పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ. 3,20,000 వద్దకు చేరుకుంది.

## గెయిల్ సిఎండిగా దీపక్ గుప్తా!



**న్యూఢిల్లీ, మార్చి 1:** ఇంధనరంగంలో చీఫ్‌ఎగ్జిక్యూటివ్‌గా విశేష అనుభవం ఉన్న దీపక్ గుప్తా గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ గెయిల్ ఛైర్మన్‌మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీ ఇంజినీరింగ కళాశాలలో మెకానికల్ ఇంజినీర్ అయిన గుప్తా సహజవాయు రంగంలో విశేషానుభవం కలిగి ఉన్నారు. ట్రాన్స్‌మిషన్, మార్కెటింగ్, మౌలిక వనరుల అభివృద్ధి విభాగాల్లో విశేషానుభవం కలిగి ఉన్నారు. గెయిల్‌లోకూడా కీలక విభాగాలను ర్యవేక్షించారు. ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, కార్పొరేట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలుచూసారు. బోర్డుస్థాయి నాయకత్వ లక్షణాలున్నాయి. సాంకేతికంగా కూడా ఆయనకు విశేషానుభవం ఉంది. ప్రాజెక్టు, నిర్మాణ యాజమాన్యం, అంతర్జాతీయ కొనుగోళ్లు, కాంట్రాక్టులు, టెక్నాలజీ ఎంపిక, బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ నిర్వహణ వంటి వాటిలో ఆయనకు అపారమైన అనుభవం ఉందని గెయిల్‌ప్రకటించింది. ఇప్పటివరకూ పనిచేసిన సందీప్‌కుమార్ గుప్తా స్థానంలో ఆయన బాద్యతలు స్వీకరించారు.

## మార్కెట్లకు వచ్చే వారం మూడు ఐపిఒలు

**ముంబయి, మార్చి 1:** వచ్చేవారం మార్కెట్లకు మూడు ఐపిఒలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డు ఇష్యూల్లో ఒకటి మిగిలినవి ఎస్‌ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై ఉన్నాయి. కొనుగోళ్ల స్థాయి, గ్రేమార్కెట్‌ప్రీమియమ్‌లతోపాటు లిస్టింగ్ తీరు వంటి వాటిపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ ఉంటుందని రేటింగ్ సంస్థల అంచనా. మెయిన్‌బోర్డు ఐపిఒల్లో సెడెమాక్ మెచాట్రానిక్స్ ఇష్యూ మార్చి 4న ప్రారంభం అయి ఆరోతేదీ ముగుస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద 80 లక్షల షేర్లు విక్రయిస్తుంది. మొత్తం 1087.45 కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. ప్రస్తుతం ఉన్న వాటాదారులు తమ షేర్లను ప్రత్యక్షంగా పబ్లిక్‌కు విక్రయించే వెసులుబాటు ఉంటుంది. ఈ ఐపిఒ మొత్తం కేవలం షేర్‌హోల్డర్లకే వెళుతుంది.కంపెనీకి ఉండదు. తొమ్మిదో తేదీ షేర్ల కేటాయింపు ఉంటుంది. బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇల్లో లిస్టింగ్ ఈనెల 11వ తేదీ ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ఇక ఎస్‌ఎంఇ విభాగంలో రెండు కొత్త ఐపిఒలు వస్తున్నాయి. ఎల్ఫిన్ ఆగ్రో ఇండియా ఐదోతేదీ ప్రారంభం అయి తొమ్మిదో తేదీ ముగుస్తుంది. ఇష్యూనుంచి రూ.25.03 కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. మొత్తం 53 లక్షల వాటాలను ఐపిఒకు తెచ్చింది. శ్రీనిబాస్ ప్రధాన్ కన్‌స్ట్రక్షన్స్ ఐపిఒకు వస్తోంది.ఆరోతేదీ నుంచి పదోతేదీవరకూ ఓపెన్‌చేసి ఉంటుంది. బుక్ బిల్ట్ ఇష్యూ రూ.20.32కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. మొత్తంగా 17 లక్షల షేర్లు కేటాయించింది. అంటే వీటి విలువ రూ.16.79 లక్షలకోట్లుగా ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో నాలుగు లక్షల షేర్లు రూ.3.53 కోట్ల విలువైనవి విక్రయిస్తోంది.




## ఫిబ్రవరి నెల జిఎస్టి వసూళ్లు రూ.1.83 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 1:** వస్తుసేవల పన్ను జీఎస్టీ రాబడులు ఫిబ్రవరి నెలలో రూ.1.83 లక్షలకోట్లకు చేరాయి. గత ఏడాది ఫిబ్రవరిలో రూ.1.69 లక్షలకోట్లు మాత్రమే వసూలయిన ఈ వృద్ధి 8.1శాతం పెరిగిందని కేంద్రం ప్రకటించింది. జనవరిలో జిఎస్టీ వసూళ్లు రూ.1.71 లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షికపద్ధతిలోచూస్తే జీఎస్టీ స్థూల వసూళ్లు రూ.20,27,033 కోట్లుగా ఉంది. 8.3శాతం వృద్ధిని నమోదుచేసాయి. ఫిబ్రవరిలో స్థూల జిఎస్టీ వసూళ్లు రీఫండ్‌లు కూడా 7.9శాతం పెరిగాయి. రీఫండ్‌ల తర్వాత రూ.1.61 లక్షలకోట్లుగా ఉంది. అయితే ఫిబ్రవరినెల రీఫండ్లు ప్రస్తుతం సమీక్షలో ఉన్నాయి. ఇలాంటి రివ్యూలు 10.2శాతంపెరిగి రూ.22,595 కోట్లవరకూ ఉన్నట్లు అంచనా. ఆర్థికసంవత్సరానికి గాను ప్రభుత్వం జిఎస్టీ వసూళ్లలో 11శాతం వృదిధ అంచనాలువేసింది. వార్షిక రాబడులు రూ.11.78 లక్షలకోట్లుగా ఉంటాయని తెలిపింది. వాటిలోనే కేంద్ర జిఎస్టీ, పరిహారం సెస్సులు కూడా ఉంటాయి. గతనెలలో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటకల్లో భారీ వసూళ్లు ఉన్నాయి. హర్యానా, యూపి, ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

లక్షద్వీప్, అండమాన్‌న ఇకోబార్ దీవులు, లడక్, మిజోరమ్, నాగాలాండ్; మణిపూర్‌లలో తక్కువ జిఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. అలాగే ఫిబ్రవరినెలకుగాను పరిహారం సుంకం రూ.5063 కోట్లుగా ఉంది.

## వాణిజ్య సిలిండర్ ధరలు పెంచిన చమురు కంపెనీలు!



**ముంబయి, మార్చి 1:** ఇండియన్ చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.28 నుంచి రూ.31 వరకు పెరగ్గా.. డొమెస్టిక్ 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచాయి. ప్రతీ నెలా 1వ తేదీన గ్యాస్ సిలిండర్ కొత్త ధరలను కంపెనీలు ప్రకటిస్తూ ఉంటాయి. అందులో భాగంగా మార్చి 1న గ్యాస్ సిలిండర్ ధరల్లో కంపెనీలు మార్పులు చేశాయి. డొమెస్టిక్ సిలిండర్ ధరలు గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు జరగలేదు. హైదరాబాద్‌లో 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.905.00 వద్ద కొనసాగుతోంది. రవాణా, నిర్వహణ ఛార్జీల కారణంగా ప్రాంతాలను బట్టి గ్యాస్ ధరల్లో మార్పులు ఉంటాయి. చివరిసారిగా గత ఏడాది ఏప్రిల్ 8న వీటి ధరలను సవరించగా అప్పటినుంచి ఎలాంటి మార్పు లేదు. రెస్టారెంట్లు, హోటల్స్, ధాబాలు ఇతర వ్యాపార అవసరాల కోసం ఉపయోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి. ఫిబ్రవరిలో 19 కిలోల సిలిండర్ ధరలు రూ.48 నుంచి రూ.50 వరకు పెరగ్గా ఈనెల 1న మళ్లీ పెంచాయి. ప్రాంతాలను బట్టి రూ.28 నుంచి రూ.31 వరకు ధరలు పెరిగాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఢిల్లీలో 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1768.50గా ఉంది. గతంలో రూ.1740.50గా ఉండేది కోల్‌కత్తాలో రూ.1844.50గా ఉండగా ఇప్పుడు రూ.1875.50కి పెరిగింది ముంబైలో గతంలో రూ.1692గా ఉండగా ఇప్పుడు రూ.1720.50కి చేరుకుంది చెన్నైలో గతంలో రూ.1899.50గా ధర ఉండగా ఇప్పుడు రూ.1929కి పెరిగింది.

## రూ.26.84 లక్షలకోట్ల యుపిఐ లావాదేవీలు!

**న్యూఢిల్లీ, మార్చి 1:** యుపిఐ లావాదేవీలు ఫిబ్రవరిలో ఆరుశాతం తగ్గాయి. 20.39 బిలియన్ లావాదేవీలు జరిగాయని అంచనా. విలువలపరంగా కూడా ఐదుశాతం తగ్గి రూ.26.84 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. ఫిబ్రవరి నెలలో తక్కువ రోజులు ఉండటమే ఇందుకు కారణమని నిపుణుల అంచనా. జనవరిలో లావాదేవీలు 21.70 బిలియన్ లావాదేవీలుజరిగి రూ.28.33 లక్షలకోట్లు విలువైన చెల్లింపులు జమలు జరిగాయి. ఫిబ్రవరిలో రోజువారి లావాదేవీలు 728 మిలియన్లపెరిగాయి. విలువలు 95,865కోట్లుగా ఉన్నాయి. జనవరిలో అయితే 700 మిలియన్ లావాదేవీల్లో రూ.91,403 కోట్లవరకూ ఉన్నట్లు అంచనా. నెలవారీగా కూడా స్వల్పస్థాయిలో మాత్రమే పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా యుపిఐ లావాదేవీలకు మరింత బూమ్ వచ్చింది. నిరంతరాయంగా చెల్లింపులు, 24 గంటల్లో ఎప్పుడైనా చేసుకునే వెసులుబాటు రావడంతో యుపిఐ లావాదేవీలుభారీస్థాయిలోనే జరుగుతున్నట్లు క్యాఫ్‌ఫ్రీ పేమెంట్స్ సిఇఒ ఆకాష్ సిన్హా అన్నారు. డిసెంబరులో ఈ చెల్లింపులు 21.63 బిలియన్‌లవరకూ జరిగి రూ.27.97లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే యుపిఐ లావాదేవీలు 27శాతంపెరిగాయి. విలువలపరంగా కూడా 22శాతం పెరిగినట్లు ఆయన చెప్పారు. ఇక బ్యాంకుల్లో ఉన్న ఐఎంపిఎస్ లావాదేవీలు 10శాతం తగ్గి 336 మిలియన్ల లావాదేవీలుజరిగాయి. అదే జనవరిలో 374 మిలియన్లుజరిగాయి. డిసెంబరులో 6.62 లక్షలకోట్ల విలువైన 380 మిలియన్ల ఐఎంపిఎస్ లావాదేవీలుజరిగాయి. అదే జనవరిలో 12.07 మిలియన్ల లావాదేవీలుజరిగాయి. ఇక రోజువారి ఐఎంపిఎస్ లావాదేవీలు రూ.21,709 కోట్లుగా ఉన్నట్లు అంచనా. ఇక ఫాస్టాగ్ లావాదేవీలు ఫిబ్రవరిలో ఆరుశాతం తగ్గి 350 మిలియన్లుగానే ఉన్నాయి. అదే జనవరిలో 373 మిలియన్లుజరిగాయి. విలువలపరంగా కూడా 4శాతం క్షీణించి 6925 కోట్లుగా ఉన్నాయి. జనవరిలో 7232 కోట్లు ఉన్నట్లు అంచనా. ఆధార్‌అనుసంధానితచెల్లింపులు 90 మిలియన్లుగా ఉన్నాయి.




వాణిజ్యం

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.